సాహితీ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు : fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-8-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 191 పేజీలు: 12 వెల: 6.50

జెన్‌జడ్‌ను తప్పుదారి పట్టించారు: ధర్మేంద్ర ప్రధాన్ 9లో

పాక్‌లో లష్కర్ కమాండర్ అనుమానాస్పద మృతి

## దుశ్చర్యకు బలి..

# మృత్యువుతో పోరాడి ఓడిన మెడికో ప్రియాంక



### రాజమండ్రిలో కొందరు మద్యం మత్తులో కారుతో ఢీకొన్న ఘటన..

### హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ప్రియాంక మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు9,ప్రభాతవార్త:** అభంశుభంతెలియని ఓ యువవైద్యురాలు దుర్మార్గపు దుశ్చర్యకు బలైంది. మద్యం మత్తులో ఇరువురు యువకులు కారుతో ఢీ కొట్టి ఆమె ఉసురు తీసుకున్నారు. తీవ్ర గాయాలతో సికింద్రాబాద్ కిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రియాంక. బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించిన వైద్యులు. ఏడు రోజులు మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడిచింది. ఆ కుటుంబం, తల్లిదండ్రుల ఆశలు అర్ధాంతరంగా ముగిసిపోయాయి. ఏ విధంగానూ సంబంధం లేని వైద్యురాలి పట్ల కర్కశంగా వ్యవహరించి మూడుసార్లు కారుతో ఢీకొట్టిన ఆ మత్తు దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని సర్వత్రా నిరసన వ్యక్తం అవుతుంది.
ఈ నెలమూడవ తేదీన రాజమండ్రిలో కారు ఢీ కొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ డాక్టర్ ప్రియాంక(28) ఆదివారం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో మృతి చెందారు. ఏడు రోజులుగా వైద్యం అందిస్తున్నా ఫలితంలేకపోయింది. ప్రమాదం జరిగిన రోజునే ప్రియాంక బ్రెయిన్‌డెడ్‌గా >>2

# ఆదివాసీల అభ్యున్నతే లక్ష్యం

### వారి సమగ్రాభివృద్ధికి 5 అంశాలతో ప్రణాళిక

### స్వర్ణాంధ్రకోసం అంతా కలిసి పనిచేద్దాం

### పనిచేసే ప్రతి వ్యక్తి సమాజానికి మంచి ఆస్తి

### అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో సిఎం చంద్రబాబు



ఆదివారం విజయవాడలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశానికి, రాష్ట్రానికి విజన్ ఉన్నట్టే ప్రతీ పౌరుడికి ఓ విజన్ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశం, రాష్ట్రం, గ్రామం, కుటుంబం అభివృద్ధికోసం అంతా సంకల్పం తీసుకోవాలని ఆయన అన్నారు. 2047 స్వర్ణాంధ్ర కోసం తాను సంకల్పం తీసుకున్నానని ముఖ్యమంత్రి అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని అంబేద్కర్ కళా వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి సిఎం హాజరయ్యారు. గిరిజన సంప్రదాయ నృత్యం ధింసా, డప్పు, వివిధ వాయిద్యాలతో గిరిజన మహిళలు, మంత్రి సంధ్యారాణి, ఇతర ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ధింసా నృత్యం చేస్తున్న మహిళలతో ఆయన కూడా అడుగులు వేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి సిఎం నివాళిఅర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "ప్రకృతిని ఆరాధిస్తూ, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు చేయగల సామర్థం ఆదివాసీలకు ఉంది. ఓ సామాన్య ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్ము ఒడిశాలో మంత్రిగా, గవర్నర్‌గా పనిచేసి నేడు రాష్ట్రపతిగా అత్యున్నత స్థానంలో ఉన్నారు. మన సంకల్పమే మనకు ఆత్మవిశ్వాసం కల్పించి అందలాలు ఎక్కిస్తుంది.
అబ్దుల్ కలాం, ఎన్టీఆర్, ప్రధాని మోడీ ఇలా ప్రతి ఒక్కరూ సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వారే. సంకల్పం ఒక్కటే మార్పు తెస్తుందని అంతా గుర్తించాలి. దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేలా అంతా సంకల్పం తీసుకోవాలి. నేను, నా దేశం, నా రాష్ట్రం, నా ఊరు నా కుటుంబం అనే భావనతో సంకల్పం చేస్తేనే అభివృద్ధి సాధించగలం. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజానికి, దేశానికి నేను ఏమివ్వాలనే లక్ష్యంతో పనిచేద్దాం. గిరిజన రైతులు తన పంటను మెరుగ్గా పండించి దేశంకోసం కృషి చేశారు. స్వయం ఉపాధితో సంపాదిస్తున్న మహిళ దేశం కోసం పనిచేసినట్టే. ఓ విద్యార్థి, ఓ ఉద్యోగి, ఓ వ్యాపారి, ఓ కూలి ఇలా ఎవరైనా నిష్టతో అత్యుత్తమ సామర్థ్యంతో పనిచేస్తే >>2



# 13 నుంచి 15 దాకా ప్రతి ఇంటిపై జాతీయ జెండా

### వికసిత్ భారత్ స్ఫూర్తి ప్రతిబింబించాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు9, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆగస్టు 15 నుంచి పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇంటింటా జాతీయ జెండా, ప్రతి ఇంటా జాతీయ స్ఫూర్తి నింపాలని సిఎం పిలుపునిచ్చారు. ఆగస్టు 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని సిఎం స్పష్టం చేశారు. 'మై నేషన్‌నేషన్ ఫస్ట్' అనే భావన ప్రతి ఇంటికీ చేరాలని ఆకాంక్షించారు. 2047 లక్ష్యాల సాధనలో ప్రతి పౌరుడినీ భాగస్వామిని చేయాలన్నారు. వికసిత్ భారత్‌స్వర్ణాంధ్ర లక్ష్యాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛంధ సేవా స్ఫూర్తిని పునరుద్ధరించాలని చంద్రబాబు నొక్కి చెప్పారు.



# 'త్రివర్ణ పతాకం మన గర్వకారణం'

### 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనండి 2లో

### దేశ ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు

# నేడు కలిదిండిలో సిఎం పర్యటన

**ఏలూరు, ఆగస్టు 9, ప్రభాత వార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 10వతేదీన ఏలూరు జిల్లాలోని కలిదిండిలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఎదురు జిల్లా కలెక్టర్ సెల్వీ సీఎం పర్యటన షెడ్యూల్ విడుదల చేశారు. సిఎం చంద్రబాబు సోమవారం ఉదయం 10.30 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు కలిదిండిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. ఉదయం 11 గంటలకు కలిదిండి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని రైతులతో మాట్లాడతారు. అనంతరం 11.45 గంటలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి బయలుదేరి పాత పోస్టాఫీసు వెనుక ఏర్పాటు చేసిన ప్రజా వేదిక కార్యక్రమానికిచేరుకుంటారు. మధ్యాహ్నం 2.05 గంటల వరకు ప్రజావేదికలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.55 గంటలకు కలిదిండి వ్యవసాయ మార్కెట్ యార్డుకు చేరుకుని పార్టీ క్యాడర్ సమావేశంలోపాల్గొంటారు. సాయంత్రం 4.25 గంటలకు మార్కెట్ యార్డు నుంచి బయలుదేరి 4.35 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. సాయంత్రం 4.40 గంటలకు కలిదిండి నుంచి హెలికాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరి వెళతారు.

# భారత్ చట్టాలను పాటించాల్సిందే

### మెటాకు కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** మెటా ప్లాట్‌ఫారమ్‌లు భారత చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని ప్రభుత్వం ఆదివారం స్పష్టం చేసినట్లు సమాచారం. సోషల్ మీడియా దిగ్గజంతో ఇటీవల జరిగిన చర్చల ముఖ్య ఉద్దేశ్యం, కేవలం ఆ సంస్థ ప్రపంచ ప్రమాణాలను అనుసరించడం కాదని, దాని విధానాలు, కంటెంట్ నియంత్రణ పద్ధతులు దేశ చట్టపరమైన చట్రానికి అనుగుణంగా ఉండేలా చూడటమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. మెటా తన సిఫార్సు అల్గారిథమ్‌లను పూర్తిగా మార్చాలని అధికారులు ఆదేశించారని చెప్పడం వాస్తవానికి తప్పు అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దానికి బదులుగా, సంస్థ కంటెంట్ విధానాలు, అమలు యంత్రాంగాలు, ప్లాట్‌ఫారమ్ పాలన భారత చట్టపరమైన అవసరాలను తగినంతగా ప్రతిబింబించేలా చూడటమే కొనసాగుతున్న చర్చల ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొంది. >>2



ఆదివారం ప్రకాశం బ్యారేజ్ వద్ద పట్టిసీమ నుంచి వచ్చిన నీటిని పరిశీలిస్తున్న చంద్రబాబు

# ఎంత నీరు! ఎంత జోరు!

### ప్రకాశం బ్యారేజ్‌వద్ద నీటి ఉధృతిని పరిశీలించిన సిఎం చంద్రబాబు


### పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు 17 టిఎంసిల నీరు తరలింపు

**విజయవాడ,ఆగస్టు9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రకాశం బ్యారేజ్‌లో గోదారమ్మ నీటి పరవళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. పట్టి సీమ ద్వారా కృష్ణమ్మకు వస్తున్న గోదావరి నీటిని ముఖ్యమంత్రి తిలకించారు. విజయవాడలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొని తిరిగి నివాసానికి వెళుతున్న సమయంలో బ్యారేజ్‌పై కొద్దిసేపు తన వాహన కాన్వాయ్ నిలిపిన ముఖ్యమంత్రి గోదావరి నీటితో నిండు కుండలా ఉన్న బ్యారేజ్‌ను పరిశీలించారు. గోదావరి నీటితో బ్యారేజ్ నిండుగా ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తోందని సిఎం ఈ సందర్భంగా అన్నారు. పట్టిసీమ ద్వారా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 17.52 టిఎంసిల నీటిని కృష్ణా నదికి తరలించినట్లు అధికారులు వివరించారు. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాల కారణంగా గోదావరి నది నుంచి ఇప్పటి వరకు 521 టిఎంసిల నీరు సముద్రంలో కలిసినట్లు అధికారులు తెలిపారు. పట్టి సీమ ప్రాజెక్టు ద్వారా సమృద్ధిగా గోదావరి జలాలు వస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజి దిగువన వివిధ కాలువల ద్వారా డెల్టాలోని పంటలకు నీటిని విడుదల చేస్తున్నామని సిఎం అన్నారు.
కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి 3928 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ నుంచి 3115 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌నుంచి 115 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డెల్టాకు నీటి సరఫరా కోసం మొత్తం కాలువలకు 7,158 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. ఎల్ నినో కారణంగా తీవ్ర వర్షాబావ పరిస్థితుల్లో పట్టిసీమ నీరు పంటలకు జీవం పోస్తోందని ఈ సందర్భంగా సిఎం అభిప్రాయ పడ్డారు. సమర్థ నీటి నిర్వహణ ద్వారా ఎల్ నినో పరిస్థితుల్లో సాగునీటి ఇబ్బందుల్ని అధిగమించేందుకు అన్ని విధాలా పనిచేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

# ఇక అంతరిక్షంలో వ్యవసాయం!

- వరి పంట పండించి కోత కోసిన చైనా
- చంద్రుడు, అంగారకుడిపై ధాన్యం సాగు

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త :** రాబోయే రోజుల్లో అంతరిక్ష కేంద్రాల్లోనే పంటలు పండించి, వ్యోమగాములు అక్కడే భోజనం తయారు చేసుకునే రోజులు రాబోతున్నాయి. ఇందుకు ఊతమిచ్చేలా చైనా చేపట్టిన ప్రయోగం విజయవంతం అయింది. భూమికి వందల కిలోమీటర్ల ఎత్తులో ఉన్న చైనా తియాంగాంగ్ అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములు వరి పంటను తొలిసారి విజయవంతంగా పండించారు. విత్తనం వేసి ధాన్యాన్ని నూర్పే వరకు జీవిత చక్రాన్ని పూర్తిచేసి ప్రతిష్టాత్మక మైలురాయిని దాటారు. చైనా చేపట్టిన షెంజౌ23 మిషన్‌లో భాగంగా మే 24న వరి విత్తనాలను టియాంగాంగ్ స్పేస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. రెండు నెలలకు పైగా సూక్ష్మ గురుత్వాకర్షణ పరిస్థితుల్లో వాటిని పెంచిన అనంతరం వ్యోమగాములు జూ యాంగ్జు, జాంగ్ జియువాన్, లై కైయింగ్ తొలి వరి నమూనాలను సేకరించారు. అంతరిక్ష ఇక్యూబేటర్లలో ప్రత్యేక ఎల్ఈడీ కాంతి, ద్రవ పోషకాల ద్వారా నీరు, ఎరువులను అందించి వరి పంట పండించారు. సాధారణంగా భూమిపై గురుత్వాకర్షణ ప్రభావంతో మొక్కల వేళ్లు కిందికి, కాండం పైకి పెరుగుతాయి. అయితే, అంతరిక్షంలోని మైక్రోగ్రావిటీ (శూన్య గురుత్వాకర్షణ శక్తి)లో వాతావరణంలో మొక్కల పెరుగుదల శైలి మారినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. చైనా శాస్త్రవేత్తలు ఈ ప్రయోగంలో రెండు రకాల జపోనికా వరి విత్తనాలను ఉపయోగించారు. ఒకటి అంతరిక్షానికి ఎప్పుడూ వెళ్లని సాధారణ విత్తనాలు కాగా, మరొకటి 2022లో టియాంగాంగ్‌లో పండించిన వరి నుంచి వచ్చిన విత్తనాలు. అంతరిక్ష వాతావరణానికి గతంలో అలవాటు పడిన విత్తనాలు తరువాతి తరాల్లో ఎలా స్పందిస్తాయో శాస్త్రవేత్తలు పరిశీలిస్తున్నారు. 2022లో చైనా అంతరిక్షంలో తొలిసారిగా వరి పూర్తి జీవచక్ర ప్రయోగాన్ని నిర్వహించింది.




ఆ సమయంలో ఆరు వరి విత్తనాలను 120 రోజులపాటు కక్ష్యలో పెంచగా, 59 కొత్త విత్తనాలు లభించాయి. వాటిని భూమికి తీసుకువచ్చి తదుపరి పరిశోధనలు చేశారు. తాజా సంచలన ప్రయోగం ద్వారా రోదసీలోనే ఆహారాన్ని పండించటమే కాకుండా, వ్యోమగాములు విడుదల చేసే కార్బన్ డై అక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్ ను విడుదల చేయటానికి కూడా అవకాశం >>2

# అమరావతిలో భూగర్భ విద్యుత్ లైన్లు

### తాళ్లాయిపాలెం సబ్ స్టేషన్ నుంచి భారీ డక్ట్ ఏర్పాటు

### తుది దశలో టవర్ల నిర్మాణం

**విజయవాడ.ఆగస్టు9,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి రాజధాని అమరావతి ప్రాంతంలో భవిష్యత్తులో విద్యుత్ సరఫరా మొత్తం భూగర్భం ద్వారా జరిగేలా అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఇందుకు భారీ డక్ట్‌లు నిర్మిస్తున్నారు. రాజధానిలో క్వాంటమ్ వ్యాలీ, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ప్రముఖ విద్యా సంస్థలు, కీలక భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వాటన్నింటికీ విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా భూగర్భం ద్వారా విద్యుత్ లైన్లు మొత్తం వెళ్లేలా డిజైన్లు రూపొందించారు. అందుకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టారు. తాళ్లాయిపాలెం సబ్‌స్టేషన్ నుంచి భారీ డక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు 220 కేవీ విద్యుత్ సరఫరాకు వీలుగా సుమారు 24 లైన్లు వెళ్లే అవకాశముంది. 55 కి.మీ.మేర భూగర్భం నుంచే విద్యుత్ >>2



# డిఎస్సీ అక్రమాల్లో నిజమెంత?

- నిరసన కార్యక్రమాల్లో కనిపించని నిరుద్యోగులు
- ఆరోపణలు, కోర్టు కేసులు, ప్రభుత్వ వివరణల మధ్య కొనసాగుతున్న వివాదం
- స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్లపై హైకోర్టు విచారణకు ఆదేశం
- పేపర్ లీక్ ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం

**ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో, ఆగస్టు 9:** ఆంధ్రప్రదేశ్‌లో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డిఎస్సీ-2025 నియామక ప్రక్రియపై వివాదంకొనసాగుతోంది. డిఎస్సీ నియామకాల్లో అక్రమాలు, మెరిట్ జాబితాలో అవకతవకలు, రిజర్వేషన్ అమలులో లోపాలు, స్పోర్ట్స్ కోటాకింద నకిలీ ధ్రువపత్రాల వినియోగం, ప్రశ్నపత్రం లీక్‌వంటి పలుఆరోపణలు రాజకీయంగానూ, న్యాయపరంగానూ చర్చకు వచ్చాయి. అయితే వీటిలో ప్రతి ఆరోపణ నిజమని ఇప్పటివరకు న్యాయస్థానం తుది నిర్ధారణ చేయలేదు. అదే సమయంలో వివాదాలకు సంబంధించి పలు కేసులు కోర్టుల ముందుకు వెళ్లడం మాత్రం వాస్తవం.

**335కు పైగా పిటిషన్లు.. అభ్యర్థుల అసంతృప్తి**

మెగా డిఎస్సీ నియామకాలకు సంబంధించి వివిధ అంశాలపై అభ్యర్థులు పెద్ద సంఖ్యలో న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఇటీవల హైకోర్టు విచారణలో 335 పిటిషన్లు దాఖలైనట్లు ప్రస్తావన వచ్చింది. వ్యక్తిగతంగా నష్టపోయామని భావిస్తున్న అభ్యర్థులు నేరుగా న్యాయపరమైన పరిష్కారం కోరుతున్న నేపథ్యంలో, మొత్తం డిఎస్సీ ప్రక్రియను ఒకే మాటతో అక్రమమనితేల్చడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డిఎస్సీలో కొంతమంది అభ్యర్థులు తమకు ఎక్కువ >>2

# పిడుగుపాటు: ఇద్దరు మహిళా కూలీలు మృతి

### మరో నలుగురికి తీవ్ర గాయాలు

**కాశీబుగ్గ (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 9 ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా మందస మండలం బుడార్సింగి గ్రామ పంచాయితీ పాత కోట పెదంగో గిరిజన గ్రామాలకు చెందిన కె.సోముద్రి, సవర జొరలపై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటనలో మరో నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలు పాలైన గిరిజన మహిళల్లో మజ్జి దేవకి, బుయా పోరోమి, కుమారో నీలా, కట్టువ సుస్మితలను చికిత్సకై 108 వాహనంలో హరిపురం ప్రభుత్వ సామా >>2



ఆదివారం భోపాల్‌లో తిరంగా యాత్రలో పాల్గొన్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్

# 'త్రివర్ణ పతాకం మన గర్వకారణం'

## 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనండి: ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడానికి సిద్ధమవుతున్న తరుణంలో, ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నాడు పౌరులకు ఒక పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకాన్ని 'గర్వకారణం', 'స్ఫూర్తిదాయకం'గా అభివర్ణిస్తూ, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ యేడది ఈ కార్యక్రమాన్ని 'వందేమాతరం' ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'మన త్రివర్ణ పతాకం మన గర్వకారణం, అలాగే దేశం కోసం ఎల్లప్పుడూ మన అత్యుత్తమ సేవలను అందించేలా ప్రేరేపించే నిరంతర శక్తి వనరు' అని ఆయన పేర్కొన్నారు. జాతీయ గేయం 'వందేమాతరం' స్ఫూర్తితో ఈ కార్యక్రమం జరుగుతున్నందున, 'హర్ ఘర్ తిరంగా' ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొందాం. అలాగే 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్) నిర్మాణంలో మనవంతు కృషి చేసేందుకు సామూహిక సంకల్పాన్ని పునరుద్ఘాటించుకుందాం" అని ఆయన అన్నారు. "ఈ ఏడాది కార్యక్రమాలు 'వందేమాతరం'కు అంకితం కావడం, పైగా ఆ గీతం 150వ వార్షికోత్సవ వేళ ఇలా జరగడం సంతోషకరం" అని ప్రధాని పేర్కొన్నారు.



ఆదివారం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వారితో కలిసి డప్పు వాయిస్తున్న సిఎం చంద్రబాబు

# డా.ప్రియాంక మరణం బాధించింది: డి.సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,ఆగస్టు 9.ప్రభాతవార్తప్రతినిధి:**రాజమహేంద్రవరంలో మద్యం మత్తులో యువకులు కారును నిర్లక్ష్యంగా నడిపి ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన పీజీ వైద్య విద్యార్థిని డా.ప్రియాంక మృతి కలచివేసిందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.ఈ మేరకు డసిఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది.భవిష్యత్తులో వైద్యురాలిగా ఎంతో మందికి సేవలు అందించాల్సిన ఆమె ఇలా అర్థాంతరంగా కన్నుమూయడం బాధాకరం. నిర్లక్ష్యంగా కారు నడిపి ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న నిందితులకు కఠిన శిక్షలు పడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. డా.ప్రియాంక ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

# మహిళా కూలీలు మృతి

>> జిక ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన ఇద్దరు గిరిజన మహిళల కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు. ఈ సంఘటన ఈ రెండు గ్రామాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి. ఈ గిరిజన మహిళాకూలీలంతా పొలంలో వరినారు ఊడుపులుకోసం వెళ్లారు. పొలంలో వూర్పులు చేస్తుండగా హఠాత్తుగా పిడుగు పడి ఇద్దరు గిరిజన మహిళ కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు విడిచిపెట్టగా మిగతా నలుగురు తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్నారు.

# మెడికో ప్రియాంక

>> వైద్యులు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు.

ప్రసాదిత్య మాల్ వద్ద మద్యం మత్తులో ఇద్దరు యువకులు స్కూటీని వెనకరించి రెండుసార్లు ఢీ కొట్టి మరల మూడోసారి కూడా ఢీకొట్టడంతో కిందపడ్డ ప్రియాంక తీవ్రంగా గాయపడింది. ప్రియాంక స్నేహితుడు ఉమేష్‌తో కలిసి స్కూటీపై వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. ప్రియాంక జిఎస్ఎల్ మెడికల్ కళాశాలలో డెర్మటాలజీలో పీజీ ఫస్ట్ ఇయర్ చదువుతుంది.

ప్రియాంక సొంత ఊరు కర్నూలు కాగా ప్రస్తుతం కుటుంబ సభ్యులు హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. ముద్దాయిలు సూరవరపు దస్వంత్, ఆంద్రు జోసఫ్ ఎడ్వర్డ్స్‌పై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. ఈనెల ఆరవ తేదీన ఈ ఇద్దరినీ అరెస్ట్ చేసి ఏడవ తేదీన రాజమండ్రి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.

**ప్రియాంకకు న్యాయం చేయాలని నిరసనలు:**

వైద్య విద్యార్థినికి న్యాయం చేయాలని కోరుతూ రాజమహేంద్రవరంలో విద్యార్థులు నిరసన ర్యాలీలు చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రియాంకకు న్యాయం జరిగే విధంగా అండగా నిలబడతానని చెప్పారు. సోమవారం ప్రియాంక మృతి సంతాపంగా విద్యాసంస్థలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ప్రియాంకకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు.

**'మెడికో ప్రియాంకపై హత్యాయత్నం..'**

మరింత లోతుగా విచారణకు కస్టడీ కి పిటీషన్: ఎస్పీ నరసింహ కిషోర్.. వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రియాంక కేసులో ముద్దాయిలపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. రాజమండ్రిలో ప్రియాంక కేసుపై ఎస్పీ డి నరసింహ కిశోర్ మాట్లాడుతూ కావాలనే ఆమెను కారుతో ఢీకొట్టినట్లు వీడియోలు చూస్తే అర్థమవుతుందని నిందితులపై కఠిన సెక్షన్ల కింద కేసు పెట్టాం అని వెల్లడించారు.

అలాగే డాక్టర్ ప్రియాంక కేసులో ముద్దాయిలను కోర్టు అనుమతితో కస్టడికి తీసుకుని మరింత లోతుగా విచారిస్తామని ఎస్పీ నరసింహ కిషోర్ చెప్పారు. ముద్దాయిలు వెనక ఎవరైనా ఉన్నారా అనే కోణంలో కూడా విచారిస్తున్నామని ఈ కేసులో ఎవరు ప్రమేయం ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదని చట్టపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముద్దాయిలు ప్రియాంకను ఉద్దేశం పూర్వకంగా చేసారా అని మరింత లోతుగా విచారణ చేయడం జరుగుతుందన్నారు.

యాక్సిడెంట్ జరిగిందని ఎస్ఐకి సమాచారం రావడంతో ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ సిఐ ఎస్ఐ సిబ్బంది వెంటనే ఘటన ప్రాంతానికి వెళ్లడం జరిగిందని అక్కడ యాక్సిడెంట్ అయిన ప్రియాంకను ఒక వ్యక్తి కారులో జిఎస్ఎల్ స్వతంత్ర హాస్పిటల్ కి తీసుకెళ్లారు. మాల్ వద్ద సిసి పుటేజీలు పరిశీలించి కార్ నెంబర్ను ఐడెంటిఫై చేశారని వెంటనే పోలీస్ టీమ్స్ ఏర్పాటు చేసి ముద్దాయిలను కారు గురించి వెతకడం మొదలుపెట్టారు. నాలుగో తేదీన ప్రియాంక స్నేహితులు ఉమేష్ ఎంఎల్ సి స్టేట్మెంట్ ప్రకారం బి.ఎన్.ఎస్ గా వెంటనే కేసు నమోదు చేయడం జరిగింది. అదే రోజు ప్రత్యక్ష సాక్షులను స్థానికులను విచారించి బి ఎన్ ఎస్ సెక్షన్ నుండి 110 గా అటెంప్ట్ టు కమిట్ కల్పిబుల్ హోమీసైడ్ గా కేసు నమోదు చేయడం జరిగింది అన్నారు.

ఈనెల ఆరవ తేదీన బి ఎన్ ఎస్ కేసులో ముద్దాయిలు ఏ 1 సూరవరపు దస్వంత్, ఏ2 ఆంద్రు జోసఫ్ ఎడ్వర్డ్స్ లను అరెస్టు చేసినట్లు వివరించారు. ఇద్దరు ముద్దాయిలను ఏడవ తేదీన రాజమండ్రి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించడం జరిగిందని అనంతరం వారిని సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. దస్వంత్ చెన్నైలో బీటెక్ పూర్తి చేసి ఎంఎస్ వెళ్లడానికి ప్రిపేర్ అవుతున్నాడని ఆంద్రు జోసెఫ్ ఎడ్వర్డ్స్ లాలాచెరువులోని లారీ ఆఫీస్‌లో పనిచేస్తున్నాడని తెలిపారు.

# ఇక అంతరిక్షంలో వ్యవసాయం!

>> దొరికింది. నీటి వ్యవస్థ సహజ సిద్ధంగా శుద్ధి చేయటం కూడా సాధ్యమవుతుంది. అంతరిక్షంలో క్లోజ్డ్ లూప్ ఎకో సిస్టమ్ రూపుదిద్దుకోవడానికి ఇది ప్రాథమిక అడుగుగా భావిస్తున్నారు. భవిష్యత్తులో మార్స్, చంద్రుడిపై కాలనీలు నిర్మించే క్రమంలో భూమి నుంచి ప్రతీసారి ఆహారాన్ని మోసుకెళ్లే అవసరం లేకుండా, అక్కడే స్వయం పంటలు పండించేందుకు ఇక మీదట 100 శాతం సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంతేకాదు.. ఈ అంతరిక్ష వరి విత్తనాల్లోని జన్యుపరమైన మార్పులను అధ్యయనం చేయడం ద్వారా భూమిపై తీవ్ర ప్రతికూల వాతావరణ మార్పులను ఎదుర్కొనే నూతన వరి రకాలను అభివృద్ధి చేయడానికి కూడా ఈ పరిశోధన దోహదపడుతుందని చెబుతున్నారు.

# డిఎస్సీ అక్రమాల్లో నిజమెంత?

>> మార్కులు వచ్చినప్పటికీ తక్కువ మార్కులు సాధించిన వారికి అవకాశం లభించిందని, ప్రాధాన్యతలు, రిజర్వేషన్ అమలుపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం మాత్రం మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్ని, నిబంధనల ప్రకారం రిజర్వేషన్ల అమలును సమర్థిస్తోంది. హైకోర్టులో దాఖలైన కేసుల్లో కూడా అభ్యర్థుల ఎంపిక, నియామకం, రోస్టర్, ప్రాధాన్యతల అమలుకు సంబంధించిన ప్రశ్నలు పరిశీలనకు వచ్చాయి. కోర్టు ఇప్పటికే వ్యక్తిగత అభ్యంతరాలను పరిశీలించేందుకు గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేయడం వంటి చర్యలకు ఆదేశాలు ఇచ్చింది.

**కీలకంగా మారిన స్పోర్ట్స్ కోటా**

డిఎస్సీ వివాదంలో ప్రస్తుతం అత్యంత కీలకంగామారిన అంశాల్లో స్పోర్ట్స్ కోటాఒకటి. మెగా డిఎస్సీ- 2025లో మెరిటోరియస్ స్పోర్ట్స్ పర్సన్స్‌కోసం 3 శాతం హారిజాంటల్ రిజర్వేషన్ కింద 421 ఉపాధ్యాయ పోస్టులకు ప్రత్యేక ప్రక్రియ చేపట్టారు. ఈ కోటాలో నకిలీ లేదా అనుమానాస్పద క్రీడా ధ్రువపత్రాలను ఉపయోగించి ఉద్యోగాలు లేదా ఇతర ప్రయోజనాలు పొందారనే ఆరోపణలు తెరపైకివచ్చాయి. ఈ వ్యవ హారంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జులై 2026లో విచారణకు ఆదేశిస్తూ, నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్ల ఆరోపణలపై ప్రభుత్వం దర్యాప్తు చేసి నాలుగు నెలల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ముఖ్యంగా జూడో విభాగానికి సంబంధించిన సర్టిఫికెట్లపై ఆరోపణలు ప్రస్తావనకు వచ్చాయి. ఈవ్యవహారంలో హైకోర్టు దర్యా ప్తుకు ఆదేశించింది. సరిగ్గా ఇక్కడే ప్రతిపక్షమైన వైసీపీ పార్టీ ఈఅంశాన్ని తనకు అనుకూలంగా మలుచు కుంది. డిఎస్సీ నియామకాలను కోర్టు కూడా తప్పు పట్టిందని వారి శైలిలో ప్రచారం చేస్తూ నిరసన కార్యక్రమాలు ప్రారంభించారు. దీనికి కౌంటర్‌గా అన్ని ప్రాంతాలలోనూ ఎమ్మెల్యే స్థాయి నుంచి మంత్రుల వరకు కోర్టు దర్యాప్తుకి ఆదేశించడం అంటే నకిలీ సర్టిఫికెట్లు ఉపయోగించినట్లు కోర్టు నిర్ధారించినట్లు కాదని వైసిపి ఆరోపణలను తిప్పికొడుతున్నారు. అయితే ఈ ఆరోపణలు నిజమా? ఎవరు బాధ్యులు? ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే అంశాలు విచారణ అనంతరం తేలాల్సి ఉంది.

**పేపర్ లీక్ జరిగిందా?**

ఇదిలా ఉండగా విద్యాశాఖలో ఉన్న కొందరు ఉన్నతాధికారుల ద్వారా డిఎస్సీ పరీక్షల్లో ప్రశ్నపత్రం లీక్, డేటా మానిప్యులేషన్ జరిగిందని ప్రతిపక్షాలు, కొందరు అభ్యర్థులు ఆరోపించారు. కొందరు దీనిపై సిబిఐ విచారణకు కూడా డిమాండ్ చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. పరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో, భద్రతా ప్రమాణాలతో నిర్వహించామని, ప్రశ్నపత్రం లీక్ లేదా డేటా మానిప్యులేషన్‌కు అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈక్రమంలో పేపర్ లీక్ ఆరోపణ గానే మిగిలిపోయింది. దానికి సంబంధించి ఆధారాలు కోసం దర్యాప్తు కొనసాగుతోంది. రాష్ట్రమంతా వైసిపి నేతలు డిఎస్సీ అక్రమాలు అంటూ నిరసన కార్యక్రమాలు జోరుగా సాగుతున్న సమయంలో మరి అసలు నిజం ఏమిటనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. పేపర్ లీక్, పోస్టుల అమ్మకం, డేటా మానిప్యులేషన్ వంటి తీవ్రమైన ఆరోపణలు ప్రస్తుతం రాజకీయ, ప్రజా చర్చలో ఉన్నాయి. కానీ ఇవి న్యాయపరంగా తుది నిర్ధారణ కాలేదు. అయితే కొన్నిచోట్ల మెరిట్, రోస్టర్, రిజర్వేషన్, పోస్టుల కేటాయింపు, అభ్యర్థుల అర్హత వంటి అంశాలపై వాస్తవంగా కోర్టు కేసులుఉన్నాయి. ఏదిఏమైనా లక్షలాది మంది నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్న ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో చిన్న అనుమానం కూడా అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుంది. అందువల్ల డిఎస్సీ మొత్తం అక్రమమని ముందుగానే తీర్పు ఇవ్వడం ఎంత తప్పో.. ఎలాంటి అక్రమాలు జరగలేదని దర్యాప్తు పూర్తికాకముందే క్లీన్‌చిట్ ఇవ్వడం కూడా అంతే తప్పు అనే భావన ఉపాధ్యాయ విద్యార్థుల వర్గాల్లో ఉంది. డిఎస్సీ అక్రమాలు అంటూ వైసీపీ మాత్రమే నిరసనలు చేస్తుంది కానీ వామపక్షాలు తగినంత మద్దతు ఇవ్వలేదని వాస్తవాన్ని ఒప్పుకుని తీరాలి.

# అమరావతిలో భూగర్భ విద్యుత్ లైన్లు

>> తీగలు తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా కోసం వినియోగిస్తున్న లైన్లు, స్తంభాలు, తీగలను దశల వారీగా తొలగిస్తారు. రాజధాని ప్రాంతం మొత్తానికి 33 కేవీ/415 వోల్టుల లైన్లు ఏర్పాటు చేయనున్నారు. తుళ్లూరు, తాడేపల్లి, లింగాయపాలెం, నేలపాడు ప్రాంతాల్లో 220 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్లతో (జీఐఎస్) విద్యుత్ నెట్‌వర్క్‌ను అనుసంధానించనున్నారు. ఇప్పటికే నేలపాడు, లింగాయపాలెం వద్ద సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తాడేపల్లిలోని 132 కేవీ సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని పెంచుతున్నారు. తర్వాతి దశలో తుళ్లూరు సబ్‌స్టేషన్ నిర్మాణం ప్రారంభించనున్నారు. ఇవన్నీ అందుబాటులోకి వస్తే సుమారు 500 మెగావాట్ల విద్యుత్ సరఫరా సామర్థం ఉన్న నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తుంది.400 కేవీ విటిపిఎస్‌సత్తెనపల్లి, పిజిసిఐఎల్‌నున్న నెల్లూరు మధ్య లైన్ల రీ రూటింగ్ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. రాజధానిలో నిర్మాణాలకు అడ్డుగా ఉన్న ట్రాన్స్‌కో, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌కు చెందిన లైన్లను కలిపి ఒకే టవర్ నుంచి తీసుకెళ్లేలా డిజైన్ చేశారు. ప్రస్తుతం టవర్ల నిర్మాణం చివరి అంకానికి చేరుకుంది. దీంతో రాజధాని ప్రాంతంలో భవిష్యత్తులో రోడ్లకు అడ్డంగా విద్యుత్ తీగలు వెళ్లే అవకాశం ఉండదు.

# సుప్రీం సిజెఐ రావొద్దు..

## హైదరాబాద్ 'నల్సార్' విద్యార్థుల నిరసన

### 450 మంది సంతకాలు చేసి యాజమాన్యానికి లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు9:** హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాం శంగా మారింది. వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సిజెఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన విచారణ సందర్భంగా సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిరసనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సిజెఐ, 'వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు, మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సిజెఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకోత్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సిజెఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్‌లో ఒక సంప్రదాయంగా వస్తోంది. కాగా, సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిఐఎస్ఎస్)లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదావేశారు. ఇప్పుడు నల్సార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.

### సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పార్థసారథి

**ఏలూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 10న సోమవారం కలిదిండి మండలంలో నిర్వహించనున్న'మీ భూమి - మీ హక్కు' పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి సిఎం చంద్రబాబు హాజరుకానున్నారు. ఈనేపథ్యంలో సిఎంఏర్పాట్లనుమంత్రి కొలుసు పార్థసారథి పరిశీలించారు. హెలిప్యాడ్, ప్రజావేదిక, క్యాడర్ సమావేశం, ట్రాన్స్‌పోర్ట్, భోజనాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గారు, ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షుడు, ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ ఎమ్మెల్యే గంటా మురళి, ముఖ్యమంత్రి కార్యక్రమం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొత్త నాగబాబు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

**10-08-2026, సోమవారం**
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
తి.ద్వాదశి రా.8.01, తి.త్రయోదశి తె.4.54
న.ఆరుద్ర మ.12.27,
వ.రా.11.18-రా.12.45
దు.1. మ.12.38-మ.1.29
దు.2. మ.3.11-సా.4.02
రాహు.ఉ.7.30-ఉ.9.00 శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** స్థిరాస్తులను కొనుగోలు చేసే ఆలోచనలు ఫలిస్తాయి. వచ్చిన ధనమును పొదుపు చేయుటకు ప్రయత్నిస్తారు.

**వృషభం :** ఖర్చులను తగ్గించు విషయములో పూర్తిగా వైఫల్యమును పొందుతారు. సోదరి కలయిక. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**మిథునం :** కొన్ని దుబారా ఖర్చులు రహస్య ఋణములు, దానములు తప్పవు. విలువైన సమాచారం వింటారు. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**కర్కాటకం :** కరస్పాండెన్స్‌లు, సాంస్కృతిక కార్యక్రమములు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మందుల వ్యాపారము అనుకూలం.

**సింహం :** ఆర్థికపరమైన అంశాలు కొంత మేర ఆశాజనకంగా ఉంటాయి. వివాహ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**కన్య :** మీకు న్యాయం చేయవలసిన వాళ్ళు సంపూర్ణంగా న్యాయం చేయరు. వృత్తిలో అనుకోని మార్పులు వుంటాయి .

**తుల :** కోర్ట్ సంబంధించిన భూవివాదాలు, స్థిరాస్తులకు సంబంధించిన వివాదాలు ఒక పరిష్కార దశకు చేరుకుంటాయి.

**వృశ్చికం :** కళా, సాంస్కృతిక, ఉద్యోగ రంగాలలోని వారికి పోటీ ఎదురవుతుంది. కళాత్మక వస్తువులను కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు :** ఒకరి జీవితానికి ఆధారం కల్పించి మనశ్శాంతి పొందుతారు. ఆరోగ్య పరంగా జాగ్రత్తలు పాటించాలి.

**మకరం :** ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైల్ మీద అధికార ఆమోద ముద్రలు పడుతాయి. క్రయ విక్రయాలలో లాభాలు.

**కుంభం :** వస్తు భద్రతకు ప్రాముఖ్యం ఇస్తారు. ఇతర భాష పట్ల విదేశాల పట్ల ఆకర్షణ కలుగుతుంది. వస్త్ర లాభం.

**మీనం :** వృత్తి విషయములో కొంత ఓర్పును పాటించుట అవసరం. కార్యాచరణ కోసం యోచన చేస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆదివాసీల అభ్యున్నతే లక్ష్యం

>> నట్టే. సమాజానికి ఏమిచ్చాం, దేశానికి ఏం చేశాం అన్నదే లక్ష్యంగా పనిచేయాలి. ఒకరు ప్రకృతి కోసం, మరొకరు పర్యావరణం కోసం, ఇంకోకరు నీటి సంరక్షణ కోసం పనిచేయాలి. రాష్ట్రానికి, దేశానికి విజన్ ఉన్నట్టే వ్యక్తిగతం గానూ ప్రతి ఒక్కరికీ ఓ విజన్ ఉండాలి. వికసిత్ భారత్ విజన్‌ను ప్రధాని మోడీ చేస్తే, నేను 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపకల్పన చేశాను. జాతీయ జెండా స్ఫూర్తితో కలసికట్టుగా ముందుకు అడుగేద్దాం. వ్యక్తిగతంగా విజయం సాధించటమూ నేషన్ బిల్డింగ్‌లో భాగమే. పనిచేసే ప్రతీ వ్యక్తీ సమాజానికి ఆస్తి. సమాజం కోసం పనిచేయటమే గొప్ప దేశభక్తి, అందరి గెలుపే దేశం గెలుపు" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**అరకు కాఫీని గ్లోబల్ బ్రాండ్‌గా మారుస్తాం**

"భోగాపురంలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం. విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గిరిజన బిడ్డలు ధింసా నృత్యం ఇప్పుడు గిన్నీస్ బుక్ రికార్డు సాధించింది. ఈ రికార్డు సాధించి మన సంస్కృతీ సంప్రదాయాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. పోడు వ్యవసాయం కాదు ఆర్గానిక్ వ్యవసాయంతో గిరిజనులు విలువైన పంటల్ని ఉత్పత్తి చేస్తున్నారు. రాష్ట్రంలోని 27.39 లక్షల మంది గిరిజనుల సమగ్రాభివృద్ధికి రూ.4764 కోట్లను కేటాయించాం. ఐటిడిఎలతో గిరిజన అభివృద్ధి కోసం జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రత్యేకంగా దృష్టి సారించాం. మౌలిక వసతుల కల్పన, ఉపాధి, ఉద్యోగాలు, నైపుణ్య కల్పనపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాం. 2336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్‌లో రోడ్డు కనెక్టివిటీ కల్పిస్తున్నాం. 2027 నాటికి ప్రతీ గిరిజన కుటుంబానికీ సురక్షితమైన తాగునీరు, ఆవాసం కల్పిస్తాం, సోలార్ రూఫ్ టాప్ కూడా ఏర్పాటు చేస్తాం. అడవి తల్లి బాట పేరుతో వెయ్యి కోట్లతో 905 కిలోమీటర్ల రోడ్లు వేశాం. డోలీ మోతలు లేకుండా ఫీడర్ అంబులెన్సులు, 108,104 మొబైల్ మెడికల్ యూనిట్లు ఏర్పాటు చేశాం. అలాగే డిజిటల్ కనెక్టివిటీ కోసం సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నాం. 25 యేళ్ల క్రితమే అరకు కాఫీకి నాంది పలికాం, ఇప్పుడు ప్రపంచ బ్రాండ్‌గా అరకు కాఫీ ఎదిగింది. మరో లక్ష ఎకరాల్లో కాఫీ సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. కాఫీ, మిరియాలు, పసుపు లాంటి వాణిజ్య పంటలకు బ్రాండ్‌గా ఏజెన్సీ ప్రాంతం మారాలి. ప్రధాని మోడీ కూడా ఆస్ట్రేలియా ప్రధానికి అరకు కాఫీనే బహుమతిగా ఇచ్చి ప్రమోట్ చేస్తున్నారు. రాష్ట్రానికి వచ్చిన ప్రతీ అతిథికి అరకు కాఫీని బహుమతిగా ఇస్తూ ప్రోత్సాహం కల్పిస్తున్నాం పార్లమెంటులోనూ అరకు కాఫీ స్టాల్‌ఏర్పాటు చేయించాం. బెస్ట్ గ్లోబల్ బ్రాండ్‌గా దీనిని మారుస్తాం. గిరిజనప్రాంతాల్లోని అటవీ ఉత్పత్తులకు విలువజోడించటం ద్వారా మంచిమార్కెటింగ్ కల్పిస్తాం. సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనా పిల్, తేనె, తాటి బెల్లం ఇలా ఉత్పత్తి నుంచి ప్రాసెసింగ్, బ్రాండింగ్ వరకూ ప్రభుత్వం అండగా ఉంటుంది" అని ముఖ్యమంత్రి వివరించారు.

**ఆదివాసీల సమగ్రాభివృద్ధికి కార్యాచరణ**

"రహదారులు, సురక్షితమైన తాగునీరు లాంటి మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఆదాయ వనరుల పెంపు, నైపుణ్య శిక్షణ లాంటి ఐదు అంశాల్లో ఆదివాసీల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఒక్క ఆదివాసీల కోసమే 3 ప్రత్యేక జిల్లాలు ఏర్పాటు చేసి వారికి ప్రాధాన్యత కల్పించాం. ఎటు చూసినా పచ్చదనం కలిగిన ఈ ప్రాంతాల్లో పర్యాటకాన్ని కూడా గణనీయంగా ప్రోత్సహిస్తాం. నేడు చేసుకున్న 19 ఎంఓయుల ద్వారా 60 వేల మందికి లబ్ది కలుగుతుంది. గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా 1.5 లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందిస్తాం. ఐఐటి, నీట్ లాంటి పోటీ పరీక్షలకు కూడా వారిని సిద్ధం చేసి అందరితో పోటీ పడేలా ప్రోత్సహిస్తాం. జిఒ నెంబరు 3 ద్వారా గిరిజన ప్రాంతాల్లో స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా చేశాం. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ జీవోను కొట్టివేశారు. ప్రత్యామ్నాయం గురించి ఆలోచన చేస్తున్నాం. ఆదివాసీల హక్కులు కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. నాణ్యమైన వైద్య సేవలు అందేలా రూ.250 కోట్లతో పార్వతీపురం, సీతంపేట, రంపచోడవరం, చింతూరు, కేఆర్ పురం, శ్రీశైలం లాంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మాణం పూర్తి చేస్తాం" అని సిఎం చంద్రబాబు వివరించారు.

**స్వర్ణాంధ్ర కోసం కలిసి పని చేద్దాం**

"2047 నాటికి స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధన కోసం మనం అంతా పనిచేయాలి. ఆర్థిక అసమానతలు తగ్గి అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందేలా ప్రణాళికలు చేశాం. సూపర్ సిక్స్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. పి4తో పాటు వివిధ కార్యక్రమాల ద్వారా పేదల్ని ఆదుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నాం. చంద్రబాబు అనే నేను ప్రజల జీవితాలను మార్చి, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తే లక్ష్యం నెరవేరినట్టే. దేశం, రాష్ట్ర అభివృద్ధిలో ప్రతీ పౌరుడూ భాగస్వామి కావాలి. విద్యార్థులకు ఇది అలవాటు చేసేలా ఓ మొక్కను నాటి సంరక్షించేలా గ్రీన్ పాస్‌పోర్టు కార్యక్రమం తెచ్చాం. మన పర్యావరణం కోసం మొక్కలు నాటటంతో పాటు వాటిని సంరక్షించటం కూడా మన బాధ్యత. 80 స్వతంత్ర దినోత్సవంలోగా ప్రతీ పౌరుడూ ఓ సంకల్పం తీసుకోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నా. వచ్చే 21 యేళ్లలో దేశం, రాష్ట్రం అభివృద్ధికి చిరునామాగా మారతాయి"అని పిఎం అన్నారు. అనంతరం అంబేద్కర్ కళావేదికవద్ద ఏర్పాటు చేసిన గిరిజన ఉత్పత్తుల స్టాళ్లను సిఎం పరిశీలిం చారు. పాడేరు, రంపచోడవరం, నల్లమల, అరకు, చింతపల్లి, పార్వతీపురం మన్యం తదితర ప్రాంతాల నుంచి ఉత్పత్తులు తయారు చేసి ప్రదర్శించిన గిరిజన మహిళల్ని

# భారత్ చట్టాలను పాటించాల్సిందే

>> అధికార వర్గాల ప్రకారం, ప్రభుత్వం లేవనెత్తిన ప్రధాన ఆందోళనలలో ఒకటి, దేశం వెలుపల ఉన్న బృందాలకు భారతదేశ సాంస్కృతిక, భాషా వైవిధ్యంపై పరిమిత అవగాహన ఉండటం. కంటెంట్ నియంత్రణ నిర్ణయాల సామర్థ్యాన్ని, కచ్చితత్వాన్ని మెరుగుపరచడానికి, భారతీయ భాషలు, సాంస్కృతికసూ నైపుణ్యాలపై మెరుగైన అవగాహనతో సహా, మెటాకు బలమైన స్థానిక నైపుణ్యం అవసరమని అధికారులు తెలిపారు.

డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లపై బాలల లైంగిక వేధింపుల కంటెంట్ (సిఎస్ఎఎం)ను ఏమాత్రం సహించబోమని ప్రభుత్వం పునరుద్ఘాటిస్తూ, దానిపై కూడా గట్టి వైఖరిని అవలంబించింది. సిఎస్ఎఎం ఉనికి అనేది వర్తించే నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని, అటువంటి కంటెంట్‌ను గుర్తించి తొలగించడానికి మెటా మరింత పటిష్టమైన, చురుకైన భద్రతా చర్యలను అమలు చేస్తుందని భావిస్తున్నట్లు వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో కేవలం హామీలు కాకుండా, కచ్చితమైన చర్యలు అవసరమవుతాయని అధికారులు స్పష్టం చేశారు. చర్చలలో డీప్‌ఫేక్‌కంటెంట్ కూడా ప్రముఖంగా ప్రస్తావనకువచ్చింది. అధీకృత లేదా ధ్రువీకరించబడిన ఖాతాల నుండి ప్రచురించబడిన కంటెంట్‌ను ఆటోమేటెడ్ సిస్టమ్‌ల ద్వారా తప్పుగా డీప్‌ఫేక్‌లుగా వర్గీకరించకూడదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇలాంటి కేసుల సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకుని, కంటెంట్‌ను తొలగించే నిర్ణయం తీసుకునే ముందు దానిని సరిగ్గా పరిశీలించేలా చూసేందుకు "మానవ ప్రమేయం"తో కూడిన సమీక్షా ప్రక్రియను అధికారులు సమర్థించారు. డీప్‌ఫేక్‌గా గుర్తించి, తొలగించిన తర్వాత కూడా ప్లాట్‌ఫారమ్‌పై తిరిగి కనిపించే కృత్రిమంగా రూపొందించిన కంటెంట్ గురించి కూడా ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. తొలగించిన తర్వాత అటువంటి కంటెంట్ పునరావృతం కాకుండా, పునఃపంపిణీ కాకుండా నిరోధించడానికి తీసుకుంటున్న చర్యలను వివరించాలని కోరినట్లు వర్గాలు తెలిపాయి.

# మెడికో ప్రియాంక మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు

## బాధిత కుటుంబానికి రూ. 20 లక్షల ఆర్థిక సాయం

## జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడిన సిఎం

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజమండ్రిలో ఈ నెల 3వ తేదీన యువకులు కారుతో ఢీ కొట్టిన ఘటనలో మెడికో ప్రియాంక ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నాటి ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి చెందిందనే వార్త తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న ఒక వైద్య విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రియాంక ప్రాణాలు కోల్పోయిన ఘటనపై జిల్లా అధికారులతో గతంలోనే ఓసారి జిల్లా అధికారులతో సమీక్షించిన ముఖ్యమంత్రి, ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మరోసారి సిఎం చంద్రబాబు మాట్లాడారు. ప్రియాంక మృతికి కారణమైన నిందితులు ఇప్పటికే అరెస్టై జైల్లో ఉన్నారని ఎస్పీ వివరించగా, నిర్లక్ష్యంతో నిండు ప్రాణం తీసిన వారిపై కఠిన సెక్షన్లతో శిక్షలు పడేలా చూడాలని సిఎం ఆదేశించారు. ప్రియాంకకు ప్రమాదం జరిగిన అనంతరం రాజమండ్రిలో చికిత్స అందించడం, తరువాత కుటుంబ సభ్యులు ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించిన విషయాన్ని అధికారులు వివరించారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం అందించాలని సిఎం అధికారులను ఆదేశించారు.

10-8Pg3exHMNWJQE_10-8Pg3exHMNWJQE.qxd 10/Aug/26 12:08 AM Page 1



## ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనులకు సిఎం శుభాకాంక్షలు

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన సోదర సోదరీమణులందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అడవితో, ప్రకృతితో ముడిపడి ఉన్న గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, వారి విశిష్టమైన జీవన విధానం మన సమాజానికి ఎంతో గర్వకారణమన్నారు. అందుకే ఆదివాసీల విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాలు మెరుగుపరిచి వారి సమగ్ర అభివృద్ధే లక్ష ్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తూ, వారి స్వయం సమృద్ధి, ప్రగతే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందన్నారు.

### గిరిజనుల సంస్కృతిని అందరూ గౌరవించాలి: పవన్ కల్యాణ్

అంతర్జాతీయ గిరిజన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గిరిజనులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. తరతరాలుగా అడవులను ఆవాసంగా చేసుకుని, వాటిని కాపాడుతున్న గిరిజనుల సంస్కృతిని అందరూ గౌరవించాలని కోరారు. ముఖ్యంగా సమాజ సంక్షేమంలో, సంప్రదాయ వైద్యంలో గిరిజన మహిళల సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ గిరిజన దినోత్సవ ఇతివృత్తం ప్రాచీన వైద్య విధానాలు, సంప్రదాయ జ్ఞానం కలిగిన గిరిజన మహిళల ప్రాముఖ్యతను గుర్తుచేస్తోందన్నారు. మాతా శిశు ఆరోగ్యం, సమాజ సంక్షేమంలో గిరిజన మహిళల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. గిరిజన సమాజంతో తనకు ఉన్న బంధం చాలా ప్రత్యేకమైనదని, వారి ప్రేమ, నమ్మకమే తనను వారి సంక్షేమం వైపు మరింత బాధ్యతగా నడిపిస్తున్నాయని పవన్ కల్యాణ్ తెలిపారు. రిజనుల వికాసానికి 'అడవి తల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు రోడ్డు వసతి పెంచడం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించామన్నారు. గిరిజనుల ప్రత్యేక జీవన విధానం, సంస్కృతి దెబ్బతినకుండానే అభివృద్ధి ఫలాలు ప్రతి గిరిజన కుటుంబానికి అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు.

### ఆదివాసీల హక్కుల రక్షణ మన బాధ్యత: మంత్రి లోకేష్

ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనులకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి అంటే ప్రకృతితో కలిసి జీవించే ఒక జీవన తత్వమని లోకేశ్ అన్నారు. పరస్పర సహకారం, మంచితనం, మానవత్వ రూపాలు ఆదివాసీలని లోకేష్ కొనియాడారు. ఆదివాసీల సమగ్ర అభ్యున్నతి తోపాటు వారి సంస్కృతి, హక్కులను పరిరక్షించడం మనందరి బాధ్యతన్నారు.

### నీరు, అడవి, భూమి ఆదివాసీలకు దేవాలయంతో సమానం: మంత్రి సంధ్యారాణి

భూమిపై ఆది నుంచి జీవిస్తున్నది ఆదివాసీలేనని, వారి హక్కులు, విశిష్ట సంస్కృతిని గుర్తుచేసుకునే రోజు ఆగస్టు 9 అని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆమె గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీల జీవిత సూత్రం 'జల్, జంగల్, జమీన్' అని ఆమె అభివర్ణించారు. గిరిజనులకు లబ్ధి చేకూర్చేందుకే నాడు చంద్రబాబు జిఒ 3 తీసుకువచ్చారని మంత్రి గుర్తుచేశారు. వైఎస్సార్సీపీ హయాంలో ఆ జిఒ రద్దయితే, గిరిజనుల ప్రయోజనాల కోసం కనీసం రివ్యూ పిటిషన్ కూడా వేయలేదని మండిపడ్డారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే గిరిజన యువకులను గొడ్డలి పార్టీ రెచ్చగొడుతోందని సంధ్యారాణి ధ్వజమెత్తారు. నీరు, అడవి, భూమి ఆదివాసీలకు దేవాలయంతో సమానమని, అడవిని కాపాడే ఆదివాసీల అభివృద్ధే దేశ అభివృద్ధని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. గిరిజనుల విద్య, ఉద్యోగ వికాసానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

## మహేశ్ బాబుకు సిఎం, డి.సిఎం బర్త్‌డే విషెస్



**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** చలనచిత్ర కథానాయకుడు మహేశ్ బాబు 51వ పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని, ఆయన చేపట్టే అన్ని కార్యక్రమాల్లో విజయం సాధించాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఈ ఏడాది ఆయనకు అద్భుతంగా సాగాలని కోరుకుంటున్నట్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. డిసిఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్ అందిస్తున్న సేవా కార్యక్రమాలు, ముఖ్యంగా పిల్లలకు సహాయం చేయడం స్ఫూర్తిదాయకమని పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ ప్రశంసించింది. టాలీవుడ్ సినీ ప్రముఖుల నుంచి కూడా మహేశ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేశ్ వంటి అగ్ర తారలు ఆయనకు విషెస్ తెలియజేశారు. భారతీయ సినిమాలో అత్యంత అభిమానం పొందిన నటులలో ఒకరిగా మహేశ్ ఎదగడం గర్వంగా ఉందని చిరంజీవి అన్నారు. వెంకటేశ్ అయితే నా చిన్నోడు మహేశ అంటూ ఆప్యాయంగా సంబోధిస్తూ, రాబోయే 'వారణాసి' చిత్రంలోని 'రుద్ర' లుక్‌లో మహేశ్ అదరగొడుతున్నాడని కితాబిచ్చారు. ఈ సినిమాతో మహేశ్ వచ్చే ఏడాది ప్రపంచాన్ని ఏలడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

మహేష్ బాబుకు మంత్రి లోకేష్ బర్త్‌డే విషెస్: సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదినం సందర్భంగా మంత్రి లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఖ్రీఖ్రీ వేదికగా స్పందించిన మంత్రి లోకేష్, 'సూపర్ స్టార్ మహేష్ బాబుకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీకు ఆనందం, మంచి ఆరోగ్యం, కొనసాగే విజయాలు ఉండాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహేష్ బాబు నవ్వుతున్న ఫోటోను కూడా లోకేష్ షేర్ చేశారు.

# గిరిజనుల ఆత్మగౌరవం, అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం

- 18గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాం
- ఐటిడిఎలను బలోపేతం చేస్తున్నాం
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి



**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ డా. బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో ఆదివారం గిరిజన సంక్షేమశాఖ నిర్వహించిన కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ గిరిజనులు ఆత్మగౌరవంతో జీవించేలా వారి సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఒక పండుగలా నిర్వహిస్తున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి కల్పించేందుకు బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు, కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. సుమారు రెండు లక్షల మంది గిరిజన విద్యార్థులకు వసతి గృహాల ద్వారా ఉచిత విద్య అందిస్తున్నామని, మెగా డీఎస్సీ ద్వారా పెద్ద సంఖ్యలో గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభించాయని చెప్పారు. గత ప్రభుత్వం రద్దు చేసిన 18 గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరించి ఐటిడిఎలను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, వైద్య సదుపాయాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో భారీగా నిధులు ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. డోలీ మోతల సమస్యను నివారించేందుకు రహదారులు, ఫీడర్ అంబులెన్సులు, గర్భిణుల వసతి సదుపాయాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంతో పాటు గిరిజనుల సంస్కృతి, కళలకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.


విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు రావడానికి ప్రభుత్వం చేస్తున్న కృషి ఎంతో ఉందన్నారు.

గిరిజన కళ అయిన థింసా నృత్యానికి గిన్నిస్ వరల్డ్ రికార్డు ద్వారా అంతర్జాతీయ గుర్తింపు లభించిందని తెలిపారు. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే నిజమైన స్వర్ణాంధ్ర సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

విజయవాడ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులకు గురుకులాలు, నాణ్యమైన భోజనం, నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఐఏఎస్, గ్రూప్1, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ, వైద్య సదుపాయాలు, మొబైల్ ఆస్పత్రులు, టూవీలర్ అంబులెన్సులు, ఉచిత రేషన్ వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. భవిష్యత్తులో లక్ష ఎకరాల్లో కాఫీ సాగును విస్తరించి గిరిజనుల ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ, గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, వైద్య సదుపాయాలను మెరుగుపరిచినట్లు తెలిపారు. గిరిజన యువత ఉద్యోగ అవకాశాలకు సంబంధించి ప్రభుత్వం న్యాయ నిపుణులతో చర్చించి చట్టబద్ధమైన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం. మల్లికార్జున నాయక్ మాట్లాడుతూ, గిరిజన విద్య కోసం రూ.1,353 కోట్లు కేటాయించి 1.63 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తున్నామని తెలిపారు. డీఎస్సీ ద్వారా 1,916 మంది కొత్త ఉపాధ్యాయులను నియమించి గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామన్నారు. గిరిజన యువతకు ఉచిత సివిల్స్ కోచింగ్, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందిస్తున్నామని, రాబోయే ఐదేళ్లలో లక్ష ఎకరాల్లో కాఫీ సాగు విస్తరణతో పాటు పసుపు, రబ్బర్ హబ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ముందుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇతర ప్రజా ప్రతినిధులు కలిసి అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గిరిజనుల అభివృద్ధికి, గిరిజన ప్రాంతాల్లో చేపట్టే పలు అభివృద్ధి పనులకు అనేక కార్యక్రమాలు నిర్వహించేలా పలు ఒప్పందాలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో కుదుర్చుకున్నారు. కాఫీ పంటను పండిస్తున్న గిరిజన రైతు కొర్రా రాంబాబు, డ్వాక్రా గిరిజన మహిళ రావూరి గాయత్రి ముఖ్యమంత్రి సమక్షంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. భార్గవి, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జీసిసి చైర్మన్ కిడారి శ్రావణ్, ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్ల సునీత, జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీ ్మశ, గిరిజన నాయకులు ఇద్దేశ్రీ, ధన్ను దొర, దారా నాయక్, శ్రీనివాసరెడ్డి, మోజోరి తేజావతి, గంగులయ్య, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

## 163 ఎకరాలలో గిరిజనులకు పట్టాలు పంపిణీ

- గిరిజన ఆశ్రమ పాఠశాలలో 94శాతం ఉత్తీర్ణత
- శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్
- గిరిజన గ్రామాలను అభివృద్ధి చేశాం: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాలు



**కాశీబుగ్గ (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 9 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తుందని, 163 ఎకరాలలో గిరిజనులకు పట్టాలు పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కాశీబుగ్గ రైల్వే గ్రౌండ్‌లో ఆదివారం ఐటిడిఎ సీతంపేట ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని ప్రకృతి వనరులను పర్యాటకంగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 20 మండలాలు ఐటిడిఎ పరిధిలో ఉండగా 291 గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రూ. 179 కోట్లు వ్యయంతో 249 గ్రామాల్లో రోడ్లు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఐటిడిఎ పరిధిలో 268 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, సుమారు 20 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని, ఇటీవల పరీక్షా ఫలితాల్లో ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలు 94.77 శాతం ఉత్తీర్ణత సాధించారని ఇది గొప్ప విషయమన్నారు. అటవీ హక్కుల చట్టం కింద సుమారు 163 ఎకరాల భూమిని గిరిజనులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచిన గిరిజనుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారన్నారు. గిరిజన హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. టెక్కలి జిల్లా ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. యువతను అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. ఏపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు విఠల్ రావు, సీతంపేట ఐటిడిఎ ఎపిఓ చిన్నబాబు, పలాస ఆర్‌డిఓ ఆర్.అప్పలరాజు, డిఆర్‌డిఎ సంచాలకులు ఎన్.కిరణ్‌కుమార్, డిడి. అన్నా దొర, డిప్యూటీ విద్యాశాఖాధికారి పి.నాయుడు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అమెరికాలో మంత్రి లోకేష్.. ఎన్ఆర్ఐ డాక్టర్ రాజా కుమారుడి వివాహానికి హాజరు

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, తన అర్ధాంగి నారా బ్రహ్మణితో కలిసి అమెరికాలో జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరయ్యారు. గ్లోబల్ ఎన్నారై చీఫ్ డాక్టర్ రాజా కుమారుడి వివాహం అమెరికాలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి లోకేశ్ దంపతులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా నూతన వధూవరుల వద్దకు వెళ్లి మంత్రి లోకేశ్, నారా బ్రహ్మణి వారిని మనసారా ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో లోకేశ్ దంపతులు సంప్రదాయ దుస్తులలో కనిపించారు. కార్యక్రమానికి వచ్చిన పలువురితో వారు కాసేపు ముచ్చటించారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## విఆర్‌ఎల సమస్యలపై స్పందించకుంటే ఉద్యమిస్తాం

- ఎపి విఆర్‌ఎ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ సహాయకులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను సెప్టెంబర్ 15 లోపల పరిష్కారానికి చొరవ చూపాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని ఎపి విఆర్ఎ వెల్ఫేర్ అండ్ సర్వీసెస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య ప్రభుత్వానికి అల్టిమేట్ జారీ చేసారు. ఆదివారం దాసరిభవన్‌లో విఆర్ఎ అసోసియేషన్ రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకమునుపు విఆర్‌ఎలకు అనేక హామీలు ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీలను పట్టించుకునే స్థితి లేదని అన్నారు. విఆర్ఏలకు తక్షణం పేస్కేల్ అమలు చేయాలని, అర్హులైన విఆర్‌ఎలకీ విఆర్ఒలుగా ప్రమోషన్ ఇవ్వాలని, నామినీ విఆర్‌ఎలను రెగ్యులర్ చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. గ్రామాలలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే చిరుద్యోగులను ఆదుకోకపోవడం అన్యాయం అన్నారు. దాదాపు 54 శాఖలకు సంబంధించి విధులను ఫుల్ టైం నిర్వహిస్తూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'వేతనం ఇచ్చేది తక్కువ.. పని భారం ఎక్కువ' అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించక పోతే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మది ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శి నెల్లూరు అంకయ్య, భోగేశ్వరయ్య, కోడూరు పుల్లయ్య, బోట్ల నాగసుబ్బయ్య యాదవ్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు పోలీసుల కృషి



**తిరుపతి, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన 'మాన్సూన్ ప్లాంటేషన్ ప్రోగ్రామ్-2026'లో భాగంగా తిరుపతి జిల్లా పోలీసులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆదేశాలతో తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని జీవకోన జీవలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం మార్గదర్శకత్వంలో అలిపిరి సిఐ పివిఎస్ రామకిశోర్ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీవాణి, పోలీసు సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజల సమన్వయంతో 250 మొక్కలను నాటారు. ఇకఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతలచేను రోడ్డులో పోలీసు సిబ్బంది వంద మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం లక్ష ్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో మొత్తం 350 మొక్కలను నాటారు. నాటిన మొక్కలను స్థానిక ప్రజలు, పోలీసు సిబ్బంది సమన్వయంతో సంరక్షి స్తూ, వాటి ఎదుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# 'తిరంగా' మన గౌరవం.. దేశభక్తికి ప్రతీక

- ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపు



**గుంటూరు(విద్య), ఆగస్టు 9 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా గుంటూరులో బిజెపి జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్ర 200 మీటర్ల జాతీయ జెండాతో విజ్ఞాన్ మందిరం దగ్గర నుంచి మార్కెట్ సెంటర్ మీదగా లిబర్టీ, కృష్ణమహల్ థియేటర్ రోడ్డులో నుంచి నాజ్ సెంటర్ వరకు జాతీయ జెండాలతో 'భారత్ మాతాకీ జై, వందేమాతరం' నినాదలతో శోభయాత్ర సాగింది. ఈ తిరంగా ర్యాలీలో ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడుతూ జాతీయ జెండా ప్రతి భారతీయుడి ఆత్మగౌరవానికి, దేశభక్తికి, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను గౌరవించాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని తెలిపారు. తిరంగా కేవలం ఒక జెండా కాదు ఇది మన స్వాతంత్ర్య పోరాటానికి, మన సైనికుల త్యాగాలకు ప్రతీక, 140 కోట్ల భారతీయుల ఐక్యతకు ప్రతీక అని కేంద్రమంత్రి పేమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి 'హర్ ఘర్ తిరంగా - హర్ దిల్ తిరంగా' స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు.

రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ తిరంగా కేవలం ఒక జెండా కాదు ఇది భారతదేశ ఆత్మగౌరవానికి ప్రతీక అని ఈ జెండా కోసం లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను అర్పించారు. ప్రతి భారతీయుడి ఇంటిపై తిరంగా ఎగరాలి, ప్రతి గుండెలో దేశభక్తి వెలగాలి. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా, ప్రతి పౌరుడి జాతీయ బాధ్యతగా స్వీకరించాలి. మన మధ్య భాషలు వేరు కావచ్చు, ప్రాంతాలు వేరు కావచ్చు, సంప్రదాయాలు వేరు కావచ్చు కానీ మనందరినీ కలిపేది జాతీయ పతాకం మాత్రమే అని కులం, మతం, ప్రాంతం, రాజకీయ భేదాలకు అతీతంగా దేశం కోసం ఒక్కటిగా నిలబడాలి అని అన్నారు. తూర్పు ఎమ్మెల్యే నజీర్ మహమ్మద్ మాట్లాడుతూ యువత చేతిలో జాతీయ పతాకం ఉంటే దేశ భవిష్యత్తు భద్రంగా ఉంటుంది. సోషల్ మీడియాలో దేశభక్తి సందేశాలు పంచుకోవడం మాత్రమే కాదు, సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, విద్యా ప్రోత్సాహం, అవినీతి వ్యతిరేక పోరాటం వంటి కార్యక్రమాల్లోనూ యువత ముందుండాలి అని అన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ దేశాన్ని విమర్శించడం సులభం దేశాన్ని నిర్మించడం కష్టం అని అన్నారు.ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించినప్పుడే నిజమైన దేశభక్తి నిరూపితమవుతుంది. మన ఇల్లు శుభ్రంగా ఉంచడం నుంచి, ప్రజా ఆస్తులను కాపాడటం వరకు ప్రతి మంచి పని కూడా దేశ సేవే అని అన్నారు. ఈతిరంగా ర్యాలీలో ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ షేక్ సజీల, తిరంగా ర్యాలీ రాష్ట్ర కన్వీనర్ గుడిసె దేవానంద్, కో కన్వీనర్లు శివారెడ్డి, సాయి లోకేష్, డాక్టర్ మందూరి వెంకటరమణ, బిట్ర శివన్నారాయణ, కొత్తూరు వెంకట సుబ్బారావు, ఈదర శ్రీనివాసరెడ్డి, వెలగలేటి గంగాధర్, పాలపాటి రవికుమార్, ఆవుల నాగేంద్ర యాదవ్, డాక్టర్.గి.జు. రావు తిరంగా యాత్ర జీల్లా కన్వీనర్ డాక్టర్ చరక కుమార్ గౌడ్, కో కన్వీనర్లు క్రిష్టిపాటి నారాయణరెడ్డి, మేడూరి యశ్వంత్, నాయకులు వై.వి.సుబ్బారావు, షేక్ ఫైరోజ్, నడ్డి నాగమల్లేశ్వరి, హరి పావని, భజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, సాధు రామకృష్ణ, కఠారి వాసుదేవ నాయుడు, సురేష్ జైన్, మంత్రి సుగుణ, మేరీ సరోజిని, విమలాదేవి, విజయలక్ష్మి ్మ, దానబోయిన శివయ్య, వీర మణింద్ర, ఆమతి వెంకట రమణ, డాక్టర్ రాధా మాధవి, తుంగ యశ్వంత్, తురక రామారావు, షేక్ రఫీ, అబ్దుల్ ఖుద్దుస్, గౌస్ పీరా, షేక్ ఫర్హానా, అబ్దుల్ రషీద్, కాయితీ ప్రదీప్, కంతేటి బ్రహ్మయ్య, మేకల లక్ష ్మణ్, రావుల రాజశేఖర్, మొవ్వ నరేష్, మల్లాల లక్ష ్మణ్, చింతల పూడి సురేష్, మలిశెట్టి పవన్, పెసల వెంకటేష్,బెహర గాయత్రి, గొర్ల నాగమల్లేశ్వరి, చిరతన గండ్ల భూలక్ష్మి ్మ, లంక రవి, గాలేటి బాబు, సిద్దే సురేష్, నంద కిషోర్, కనసాని శ్రీనివాస రావు, రాజేష్ నాయుడు, అప్పిశెట్టి రంగా, రాచముల్లు భాస్కర్, పోతురాజు వేంకటేశ్వర్లు, శేషగిరి, కామేపల్లి వెంకటేశ్వర్లు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తిరుపతిలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'



**తిరుపతి, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తిరుపతిలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుపతిలోని టాటానగర్, పీకే లేఔట్‌తో పాటు పలు ప్రాంతాల్లో బిజెపి సీనియర్ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు జాతీయ జెండాలను అందజేసి, తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయించారు. ఈ సందర్భంగా గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ, జాతీయ జెండా దేశ సమైక్యతకు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అని అన్నారు. ప్రతి భారతీయుడు త్రివర్ణ పతాకాన్ని అత్యంత గౌరవంతో ఎగురవేసి, స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశభక్తి భావనతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడేలా ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ అభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గుండాల గోపినాథ్, పెరియస్వామి రామ్‌కుమార్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, బిజెపి నాయకులు, స్థానికులు విగ్రహాల కళ్యాణి, సిద్ధమ్మ, కవిత, శారదా, లక్ష ్మయ్య, లోకనాథం, వాసు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

10-8pg4_10-8pg4.qxd 10/Aug/26 12:01 AM Page 1



వార్త

విజయం సాధించగలమనే విశ్వాసం ఉన్నవాళ్లు విజయం సాధించి తీరుతారు.

న- డబ్ల్యు. ఎమర్సన్

# సాగీ సాగని 'సాగు'!


కాస్త ఆలస్యంగానైనా వర్షాలు పడ్డాయి కానీ ఖరీఫ్ సాగుకు అవసరమైన తరుణంలో వానలు కురవకపోవడమొక్కటే తెలుగు రాష్ట్రాల రైతాంగాన్ని వేధిస్తున్న ఒకే ఒక బెంగ. ఎల్‌నినో, దానివెంట సూపర్ ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్‌లో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలో హెచ్చరించి, ఎలా ఎదుర్కోవాలో చెప్పి రైతును ముందస్తు సన్నద్ధ చేయడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ముందు చూపుతోనే వ్యవహరించారని చెప్పాలి. అంతేకాదు రైతాంగాన్ని ఆదుకునే విషయంలో ప్రభుత్వాలు ఏ ఆప్షన్‌ను వదులుకోలేదు. దేవాలయాల్లో వరుణ యాగాలు కూడా మొదలెట్టేశాయి. ఏమైతేనేం ఈసారి వర్షాలు కురిసాయి. వీటితో పంటలు నిలబడతాయానే అనుకోవాలి. 'వరి'కి తగినంత నీరు అందించలేమనే ఉద్దేశంతో ఉభయ రాష్ట్రాలు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారించాలని హితబోధ కూడా చేసింది. మార్కెటింగ్‌లో కూడా వీలైన పరిస్థితులు ప్రత్యామ్నాయపంటకే సానుకూలమని నచ్చచెప్పినా సాంప్రదాయ రైతు 'వరి'కే మొగ్గుచూపాడు. తాజా గణాంకాల ప్రకారం 'వరి' విషయంలో రైతు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. దేవుని మీద భారం పెట్టేసి విత్తునాటేసాడు. ఇప్పుడు కొనసాగుతున్న వానలువరదలై రైతును ఆనందోత్సాహాల మధ్య ముంచుతున్నా, పంటల యాజమాన్యంలో ఎన్నిసమస్యలు ఎదురు చూస్తారో ఇప్పుడిప్పుడే అంచనా వేయలేం. ప్రస్తుతానికైతే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రైతులు వర్షానందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడొస్తున్న వర్షాలతో పూర్తిస్థాయి సాగు నడుస్తుందో లేదో పంట ఉత్పత్తులు సజావుగా బయటపడతాయో లేదో చెప్పేందుకు ఎదురు చూడాల్సిందే. ఈ వర్షాలు ప్రస్తుతానికైతే ఊరటనిస్తున్నాయి. అలా అని 'ఎల్‌నినో' ముప్పు ఉండదని, గట్టెక్కేసినట్లేనని చెప్పే పరిస్థితులు మృగ్యం. వచ్చే రబీ సీజన్‌లో కూడా ఎల్‌నినో ముప్పు ఉంటుందని ఏనాడో శాస్త్రజ్ఞులు విశ్లేషించి చెప్పారు. సకాలంలో నీరు రాక ఎండిపోయిన నేలలు తడిసి ముద్దయ్యాయి. ప్రస్తుతం కళ్లెదుట కనిపిస్తున్న వాన పరిస్థితులతో తెలుగు రాష్ట్రాల రైతుల్లో ఖరీఫ్‌పై ఆశలు చిగురించాయి. అయినా వర్షాల అనిశ్చితితో ఎదుర్కోవాల్సిన కష్టాలు ముందున్నాయి. 2026లో దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలపై ఎల్‌నినో ప్రభావం చెప్పుకోదగినట్లుగానే ఉంటుందని భారత్ వాతావరణ సంస్థ ముందుగానే హెచ్చరించినందున రైతు వర్షాల కోసం ఎదురు చూశాడు. అవి రానే వచ్చాయి. అన్ని చోట్లా సరిపడే వర్షాలు కురిసినట్లు చెప్పుకుంటున్నా నీటి పంపిణీలో ఎగుడుదిగుడుల కారణంగా సాగు పరిస్థితులపై అప్పుడే ఓ నిర్ణయానికి రాలేం. అంటే ఓ ప్రాంతానికి వానవెల్లువ, అదే ప్రాంతంలోని మరో చోట వర్షాభావం ఉంటే సాగు బహుకష్టమే. ఆంధ్రప్రదేశ్‌లో జలాశయాల్లో నీటి నిల్వలను బట్టి ఖరీఫ్‌సాగు పురోగతి ఉంటుంది. జులై చివరి నాటికి ఈ రాష్ట్రంలో వర్షపాత లోటు గణనీయంగా ఉంది. అదే సమయంలో తెలంగాణలో వర్షపాతం లోటుతో సాగు ఆలస్యమైంది. తాజాగా గోదావరి పరివాహక ప్రాంతాల్లో వర్షాల పరిస్థితిని బట్టే తెలంగాణ జలవనరులు దాదాపు అందుబాటులోకి వచ్చాయి. ఉభయ రాష్ట్రాలలో తక్కువ నీటితో సాగయ్యే పంటల మీద కూడా రైతాంగం శ్రద్ధ పెట్టినందుననేలలో తేమను కాపాడుకోవడం, వాననీటిని పొలాల్లో నిల్వ చేసుకోవడంలో రైతు అప్రమత్తంగా ఉండడం అవసరం. ఎన్ని హెచ్చరికలు చేసినా పంటల వైవిధ్యీకరణ నేపథ్యంలో పంటల సాగులో 10శాతంరైతులు అధిక విస్తీర్ణంలో విత్తారు. వరి సేద్యాన్ని ఎవరూ వదిలిపెట్టలేదు. ఉభయ రాష్ట్రాల్లోనూ ప్రస్తుతం ఖరీఫ్ నాట్లు బాగానే పడ్డాయి. కాస్త అటూఇటూగా నాటినా పంటల పెరుగుదలలో ఉన్నాయి. తాజా వర్షాలలో ఉభయ రాష్ట్రాలో సాగులోటు బాగా తగ్గింది. తెలంగాణలో గత ఖరీఫ్ సీజన్ కంటే ఈసారి రాష్ట్రంలో సాగు విస్తీర్ణమైతే పెరిగింది. ఇప్పటి వరకు సాగు విస్తీర్ణంలో అధిక భాగం వరి,పత్తి, మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గుచూపారు. గతంతో పోల్చి చూస్తే పప్పుధాన్యాలు, నూనెగింజలు పంటల విస్తీర్ణం పెరుగుదల చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం సాగు 32.05 లక్షల హెక్టార్లు తెలంగాణ ఖరీఫ్ సాగు సాధారణ విస్తీర్ణం 31.16 లక్షలు. దీర్ఘకాలిక పంట నమూనాలో పత్తి, వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు,వేరుసెనగ, ప్రధానంగా ఉన్నాయి. ఇకపై సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు పంట ఉత్పత్తులు మార్కెట్‌కి చేరే వరకు జాగ్రత్తగా కంటికిరెప్పలా చూసుకోవాలి. ఈసారి నైరుతి రుతుపవనాలు ఉభయ తెలుగు రాష్ట్రాలలో సాధారణం కంటే 8శాతం నుంచి 12 శాతం అధిక వర్షాలు పడినట్లే. ఉద్యాన పంటలకు అతివృష్టి దెబ్బ తగ్గింది. తొలుత ఎల్‌నినో ప్రభావంతో కరవువస్తుందని కంగారు పడ్డాం. కానీ జులైనెలలో అతివృష్టితోఆంధ్రప్రదేశ్‌లో గోదావరి కృష్ణా డెల్టా సాగు సంతృప్తికరమే. రాయలసీమలో చెరువులు నిండక 30 శాతం ఆయకట్టు తగ్గింది. మిర్చికి తొలిరోజుల్లో పూతరాలిపోయి 25శాతం దిగుబడి తగ్గే అవకాశం ఉంది. కోస్తా జిల్లాల్లో విరివిగా పండే అరటి, మామిడి ఈదురుగాలలు కారణంగా చెట్లు నేల కొరిగాయి. ఇక తెలంగాణలో కూరగాయల తోటలు నీట మునిగాయి. ఇవన్నీ అనుకోకుండా వచ్చిన నష్టాలే. వీటన్నిటి నుండి రైతుతేరుకోవడం ఎంతో కష్టం. వర్షాధార పంటలకు భూగర్భజలాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు ఈ వర్షాలు ఏమూలకీ సరిపోవు. నీటి వినియోగ అవసరాలను గుర్తించి నీటి మళ్లింపు ప్రక్రియకు వ్యవసాయ శాఖ మార్గదర్శనం చేయాలి. ప్రస్తుతం నడుస్తున్న పంటల భీమా పథకాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి. అప్పుడే రైతు మనసు తేలికపడుతుంది.

విద్య అనేది శాస్త్రాలను వివరించేందుకే పరిమితం కారాదు. ఒక పరిపూర్ణమైన మానవుని తీర్చిదిద్దే అసలైన విద్య.



రవీంద్రనాథ్ ఠాగూర్

శారీరక సామర్థ్యం ద్వారా మనకు బలం రాదు. అణచిపెట్టలేనంతటి ఆత్మబలం ద్వారానే అది లభిస్తుంది.



మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



## సమగ్ర కార్యాచరణ అవసరం

భారత్‌లో సైబర్ నేరాలు రోజురోజుకూ ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. సుప్రీంకోర్టు ఇటీవల సైబర్ నేరాలనియంత్రణ ప్రభుత్వాలరాజ్యాంగబద్ధమైన బాధ్యత అని స్పష్టంగా పేర్కొనడం అత్యంత సమయోచితమైన పరిణామం. 2024లో దేశవ్యాప్తంగా 65.9లక్షల సైబర్ ఫిర్యా దులు, సుమారు రూ.55,493 కోట్ల ఆర్థిక నష్టం నమోదవడంసమస్య తీవ్రతను తెలియజేస్తోంది. డిజిటల్ పేమెంట్లు, ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు విస్తరిస్తున్న వేళ, భద్రతావ్యవస్థలు కూడా అదే స్థాయిలో బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం మోసగాళ్లు ఫేక్ లింకులు, ఫిషింగ్ సందేశాలు, నకిలీ ఫోన్ కాల్స్, వాట్సాప్ మోసాలు, డిజిటల్ అరెస్ట్, పెట్టుబడి ఆఫర్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు. బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీడబ్బు తిరిగిపొందడం, కేసుల దర్యాప్తు పూర్తవడం చాలా సందర్భాల్లో ఆలస్యమవుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## వరుణ యాగాలు సిగ్గుచేటు!

తెలంగాణలో వర్షాభావం ఏర్పడిందనీ ఈ నెల పదవ తేదీ నాగర్జన సాగర్ వద్ద వరుణ యాగం తల పెట్టడం రేవంత్ రెడ్డి ఇజ్జత్‌ను తగ్గిస్తుంది. పోరాట యోధుడిగా రేవంత్‌కు మంచి పేరుంది. వర్షం పడకపోవటానికి శాస్త్రీయ కారణం చూడాలి. మేఘ మదనం వలన మేఘాలను రప్పించి వాటికి చల్లదనం కలిగిస్తే వర్షం పడుతుంది. అది శాస్త్రీయం. ఈ యాగాలు అన్ని కొంతమంది పూజారులు, పురోహితులకు జీవనాధారమైపోయింది. వాళ్ళుఏది చెబితే దాన్ని నమ్మి ప్రజాధనం దుర్వినియోగం చేయటం తగదు. ఆర్టికల్ 51 హెచ్‌లో వ్రాసుకున్నట్లుగా శాస్త్రీయ భావాలను ప్రభుత్వాలు పెంచాలి. అనాగరికమైన యజ్ఞాలు, యాగాలు చేయటం ప్రభుత్వాలు మానుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం

## తస్మాత్ జాగ్రత్త

రెండున్నరేళ్ల క్రితం తెలంగాణలో కెసిఆర్ ఆ వెంటనే ఎపిలో జగన్ ఢిల్లీలో కేజ్రీవాల్, ఈ మధ్య పినరయి విజయ్, మమత, స్టాలిన్ఎన్నికల్లో పరాజయంపాలై పదవీచ్యుతులు అయ్యారు. వారుచేసిన అవినీతిపనులు, అహంకార ప్రవర్తనే వారి ఈ ఘోర పరాజయానికి కారణం. ఇప్పుడుపాలన చేస్తున్నముఖ్యమంత్రులు తమకి అలాంటి పరాజయ పరిస్థితులు రాకుండా చూసుకోవాలి.

-మిథునం, హైదరాబాద్

## ఉత్తర్వులు సమంజసంగా లేవు!

దశాబ్దాలుగా మనం కావేరీ సంక్షోభాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వేసవిలో, తమిళనాడులో పంటలకు నీరు లేదని చెబుతూ, కావేరీ జలనిర్వహణ అథారిటీ లేదా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నీటిని విడుదల చేస్తున్నారు. మా మూడో పంట కూడా ఎండిపోతోంది, నీటిని విడుదల చేయమని చెప్పే తమిళనాడు ప్రభుత్వానికి, కర్ణాటకలో రెండే పంటలు పండినా అవి ఎండిపోయినా పర్వాలేదనే మనస్తత్వంలా కనిపిస్తుంది. ప్రస్తుతం, వర్షాలు లేకపోవడం వల్ల కర్ణాటక పై కరవు నీడ పడింది. రాబోయేరోజుల్లో ప్రజలు, పశువులు తాగునీటి కొరతను ఎదుర్కొనే అవకాశం ఉంది. ముఖ్యంగా బెంగుళూరు నగరం కూడా రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి ఎదురుక్కొనే పరిస్థితులురావచ్చు అనేకథనాలు పత్రికల్లో వస్తున్నాయి. రెండు రాష్ట్రాల జలవనరుల పరిస్థితి గురించి అథారిటీ కి తెలుసు. అయినప్పటికీ, జలాశయాలలో ఉన్న కొద్దిపాటి నీటి నుండి తమిళనాడుకు నీటిని విడుదలచేయమని ఆదేశించడం సమంజసం కాదు. ఈ ఉత్తర్వులను పునః పరిశీలించాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## భారత్, బంగ్లా స్నేహసంబంధం

ఫ్రాన్స్ మీడియా సంస్థతో ఇచ్చిన ఇంటర్వ్యూ లో బంగ్లా మాజీ ప్రధానిషేక్ హసీనాతిరిగి వెళ్లడం ఒక చర్చనీయాంశం. ఆశ్రిత పక్షపాతం ఉండడం, అవినీతి ఆరోపణలు మూలంగా విద్యార్థుల నిరసన ఎదుర్కోవడం వల్ల భారత్‌కు ఆశ్రయానికి వచ్చిన హసీనాకు భారత్ ఆపన్న హస్తం చాచింది. అయితే దీనివెనుక భారత్, బంగ్లా మధ్య ఉన్న స్నేహ సంబంధాలతో పాటు పాకిస్థాన్ దాష్టీకాలకు వ్యతిరేకంగా భారత్ బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం సంపాదించడంలో 1971లో పాకిస్థాన్‌కి వ్యతిరేకంగా యుద్ధం కూడా చేసింది మర్చిపోకూడదు. భారత్ బంగ్లామధ్య స్నేహ సంబంధాలను ఎంతమాత్రం చెడగొట్టా లేకపోయాయి. భారత్, బంగ్లాదేశ్ మధ్యఉన్నది కేవలం స్నేహ సంబంధాలు మాత్రమే కాదు. ఈ రెండుదేశాల మధ్య ఉన్నది మిశ్రమ సంస్కృతి, లౌకికసంస్కృతి, అని గుర్తుపెట్టుకోవాలి.

- భారత అవినాష్, జనగామ

## మార్పులు జరగటం సహజం

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు, చట్టసభ సభ్యులు ఎప్పుడూ ఒకరే ఉండరు. ఐదు సంవత్సరాలు కాకపోతే 10 సంవత్సరాలు. అదీకాకపోతే 20సంవత్సరాలు. మరి కొందరు 30 సంవత్సరాలు కూడా పదవుల్లో ఉంటారు. ఆ తరువాత మరొకరు వారి స్థానంలోకి వస్తారు. తప్పదు. దీన్ని అర్థం చేసుకుని హుందాగా వ్యవహరించాలి.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# పేరు మారితే మహిళల 'దిశ' మారుతుందా?

**చట్టాలను మార్చడం కంటే అమలు వ్యవస్థను మార్చడం కష్టమైనపని. అందుకే ప్రభుత్వాలు వాస్తవాలను పక్కనపెట్టి చట్టాల పేర్లు మాత్రమే మార్చడంసమస్యకు మూలపరిష్కారం కాదు. దిశబిల్లు వెనక్కి వెళ్లింది. రేపు మరో ప్రభుత్వం మరో పేరుతో ఇంకోచట్టం తీసుకురావచ్చు. కానీ మహిళల జీవితాల్లో భయం తగ్గకపోతే, పోలీస్‌స్టేషన్‌లో అవమానం ఆగకపోతే, కోర్టుల్లో న్యాయం సంవత్సరాల తరబడి నిరీక్షించాల్సి వస్తే, దళిత, ఆదివాసీ, బీసీ, మైనారిటీ, పేదమహిళలపై జరిగేహింస జాతీయ చర్చగా మారకపోతే, ఈ దేశానికి సమస్య చట్టాల కొరత కాదు. రాజకీయ చిత్తశుద్ధి కొరత. పరిపాలనా సంకల్పం కొరత. సామాజిక న్యాయం కొరత. దిశబిల్లు వెనక్కి వెళ్లిందా లేదా అనేది రేపు ఒక పరిపాలనా నమోదుగా మాత్రమే మిగిలిపోవచ్చు. కానీ మహిళల దశ మారిందా లేదా అనేదే ఈ కాలానికి చరిత్ర తీర్పు చెబుతుంది.**



పాపని నాగరాజు

ప్రతి అత్యాచారం తర్వాత ఒక కొత్త చట్టం వస్తోంది. ప్రతికొత్త చట్టం తర్వాత మరో అత్యాచారం కూడా జరుగుతోంది. మారేది చట్టాల పేర్లు మాత్రమే. మహిళల జీవితం కాదు. ప్రజల్లో ఆగ్రహం చెలరేగితే ప్రభుత్వాలు కొత్త చట్టాలను ప్రకటిస్తాయి. మీడియా వాటిని సంచలనంగా చూపిస్తుంది. రాజకీయ పార్టీలుమహిళల భద్రతపై పోటీగా ప్రకటనలు చేస్తాయి. కొద్దిరోజులకు ఆ ఆగ్రహం చల్లారిపోతుంది. చట్టం ఫైళ్లలో పడిపోతుంది. ఇదే చక్రం మళ్లీ తిరుగుతుంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దిశ బిల్లును ఉపసంహరించుకుంది. ఇది ఒక పరిపాలనా నిర్ణయంగా కనిపించవచ్చు. కానీ లోతుగా చూస్తే, అధికార కేంద్రీకరణ, పితృస్వామిక, నిర్లక్ష్యం సామాజిక అసమానతలు ఒకే చోట కలిసిన నిర్ణయంగా కనిపిస్తుంది. అసలు ప్రశ్న దిశ బిల్లు గురించికాదు. దిశ బిల్లు వెనక్కి వెళ్లింది. మహిళల దశ మారిందా? 2019లో హైదరాబాద్‌లో ఒక యువ పశువైద్యురాలిపై జరిగిన సామూహిక అత్యాచారం, హత్య దేశాన్ని కుదిపేసింది. ఆ ఘటనపై వెల్లువెత్తిన ప్రజాఆగ్రహానికి రాజకీయ ప్రతిస్పందనగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దిశ చట్టాన్ని తీసుకొచ్చింది. అత్యాచార కేసులదర్యాప్తు, విచారణను వేగవంతం చేయడం, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడం, కఠిన శిక్షలు అమలు చేయడం వంటి లక్ష్యాలతో ఈ చట్టాన్ని రూపొందించింది. అయితే ఇది ఒక్కసారిగా పుట్టిన ఆలోచన కాదు. 2012లో ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటన తర్వాత దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. దాని ఫలితంగా 2013లో నేరచట్టాల్లో కీలక సవరణలుజరిగాయి. చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టేందుకు పోక్సో చట్టం అమల్లోకి వచ్చింది. ప్రతి దారుణ ఘటన తర్వాత ఒక కొత్త చట్టం వచ్చింది. కానీ ఒక్కసారి కూడా మనం ఒక ప్రశ్నను గంభీరంగా అడగలేదు. ఇప్పటికే ఉన్న చట్టాలు ఎందుకు విఫలమయ్యాయి? చట్టాలు మారాయి. శిక్షలు కఠినమయ్యాయి. నేరాల నిర్వచనాలు విస్తరించాయి. అయినప్పటికీ మహిళలపై హింస తగ్గలేదు. దీనర్థం సమస్య చట్టాల కొరతలో లేదని, చట్టాలను అమలు చేసే వ్యవస్థలోనే ఉందని స్పష్టమవుతోంది. ఇక్కడ మరో వాస్తవాన్ని కూడా గుర్తించాలి. ప్రతి మహిళపై జరిగిన దారుణం ఒకేస్థాయిలో ప్రజాస్పందన పొందదు. ప్రతి బాధితురాలికి ఒకే స్థాయిలో రాజకీయ అండ, మీడియా దృష్టి, సామాజిక సంఘీభావం దక్కదు. నిర్భయ ఘటన దేశ రాజధానిలో జరిగింది. కానీ గ్రామాల్లో, అట్టడుగు వర్గాల్లో, శ్రామిక కుటుంబాల్లో, దళిత, ఆదివాసీ, బీసీ, మైనారిటీ మహిళలపై నిత్యం జరిగే హింసలో ఎక్కువ భాగం జాతీయ చర్చగామారదు. చట్టాలు ప్రజాఆగ్రహం నుంచి పుడతాయి. కానీ ఏఆగ్రహం చట్టంగా మారుతుంది? ఏ బాధ మౌనంగా మిగిలిపోతుంది? అనే ప్రశ్నకు సమాధానం మన సామాజిక నిర్మాణంలోనే దాగి ఉంది. ప్రియాంక రెడ్డి ఒక మహిళ కనుక దేశమంతా స్పందించింది. అదే తీవ్రతతో, అదే వేగంతో, అదే రాజకీయ సంకల్పంతో దళిత, ఆదివాసీ, బీసీ, మైనారిటీ, పేద మహిళలపై జరిగే అత్యాచారాల విషయంలో ఎందుకు స్పందించరు? ఈప్రశ్న తర్వాత అనేక దళిత, బహుజన సంఘాలుకూడా ఇదే అంశాన్ని బహిరంగంగా చర్చించాయి. హత్రాస్‌లో దళిత యువతిపై జరిగిన అత్యాచారం, బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన నిందితుల విడుదల చుట్టూచెలరేగిన వివాదం, మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన ఒకే విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. చట్టం అంద రికీ ఒకటే కావచ్చు. కానీ న్యాయం అందరికీ ఒకే వేగంతో, ఒకే తీవ్రతతో అందడం లేదు. బాధితురాలి కులం, వర్గం, ప్రాంతం, రాజకీయ పరిస్థితి కూడా న్యాయవ్యవస్థ స్పంద నను ప్రభావితం చేస్తున్నాయనే విమర్శలు యాదృచ్ఛికంగా రావడం లేదు. 2019



డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన దిశ చట్టం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపబడింది. అక్కడే అది ఐదేళ్లకు పైగా నిలిచిపోయింది. నేర చట్టాలు ఉమ్మడి జాబితాకు చెందిన అంశం కావడంతో రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి. కేంద్ర హోంశాఖ పలు నిబంధనలపై వివరణలుకోరింది. ఫైళ్లు కదిలాయి. కానీ చట్టం ముందుకు కదల్లేదు. ఈ ఐదేళ్లలో ఎంతమంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు? ఎన్ని కుటుంబాలు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగాయి? ఎంతమంది బాధితులు పోలీస్ స్టేషన్ గుమ్మం దాటలేకపోయారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పే ప్రభుత్వాలు లేవు. చట్టం పెండింగ్‌లో ఉన్నంతకాలం ప్రజలకు ఇచ్చినహామీ కూడా పెండింగ్‌లోనే ఉంది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం చేయడం వరకు తన బాధ్యతను నిర్వర్తించింది. కానీ రాష్ట్రపతి ఆమోదం కోసం అవసరమైన రాజకీయ, న్యాయ పోరాటాన్ని కొనసాగించ లేకపోయింది. మరోవైపు కేంద్రప్రభుత్వం వివరణల పేరుతో ఫైళ్లను నిలిపివేసింది. ఫలితంగా రాజకీయాలు సాగాయి. పరిపాలనా ప్రక్రియ కొనసాగింది. కానీ న్యాయం మాత్రం వేచిచూసింది. ఇప్పుడు ఎందుకు ఉపసంహరించుకున్నారు? భారతీయ శిక్షాస్మృతి, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత అమల్లోకి వచ్చాయని, మహిళలు, చిన్నారుల రక్షణకు అవసరమైన అనేక నిబంధనలు కొత్త కేంద్ర చట్టాల్లోనే ఉన్నాయని చెబుతూ దిశ బిల్లును ఉపసంహరించుకుంది. కానీ ఇక్కడితో చర్చముగియదు. అదే మంత్రివర్గ సమావేశంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చట్టం, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానం, అమరావతి ఐ ప్రాజెక్టు వంటి పెట్టుబడులకు సంబంధించిన నిర్ణయాలు వేగంగా ఆమోదం పొందాయి. మహిళల భద్రతకు సంబంధించిన చట్టంమాత్రం ఐదేళ్లు ఫైళ్లలో తిరిగి చివరకు ఉప సంహరణకు గురైంది. మహిళల భద్రతకు సంబంధించిన చట్టం సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంటుంది. కానీ పెట్టుబడిదారులకు సంబంధించిన నిర్ణయాలు ఒకే సమావేశంలో ఆమోదం పొందుతాయి. ఇది యాదృచ్ఛికం కాదు. పాలక వ్యవస్థకు ఏఅంశాలు అత్యవసరమో, ఏ అంశాలు వేచి ఉండవచ్చో తెలిపే రాజకీయ ప్రాధాన్యతల క్రమం. అభివృద్ధి అంటే పెట్టుబడుల ప్రవాహమేనా? లేక మహిళలు భయం లేకుండా జీవించగల సమాజాన్ని నిర్మించడమూ అభివృద్ధేనా? అనే ప్రశ్నకు ప్రభుత్వం తన నిర్ణయాలతోనే సమాధానం చెబుతోంది. దిశబిల్లును ఉపసంహరించుకున్న ప్రభుత్వం, రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా మరింత సమగ్రంగా రూపొందించిన ప్రత్యామ్నాయ చట్టాన్ని ఇప్పటివరకు తీసుకురాలేదు. 'కొత్త కేంద్ర చట్టాలే సరిపోతాయి' అనడం పరిపాలనా సమాధా నం కావచ్చు. కానీ మహిళల భద్రత విషయంలో రాష్ట్రానికి ఉన్న రాజ్యాంగబద్ధమైన బాధ్యత అక్కడితో ముగిసిపోదు. ప్రతిదారుణ ఘటన తర్వాత చట్టాలను మరింత కఠినతరం చేయాలనే డిమాండ్ వస్తుంది. ప్రతి ప్రభుత్వం కూడా అదే మార్గాన్ని ఎంచుకుంటుంది. కానీ చరిత్రమరో వాస్తవాన్ని చెబుతోంది. నేరాలను ఆపేది శిక్ష తీవ్రతకాదు. నేరం చేసినవాడు తప్పకుండా పట్టుబడతాడనే భయం. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరుగుతుందనే విశ్వాసం. విచారణఆలస్యం కాదనే నమ్మకం. శిక్ష తప్పదనే పరిపాలనా సామర్థ్యం. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడానికే రోజులు పట్టినా, ఫోరెన్సిక్ నివేదికలు నెలలతరబడి ఆలస్యమైనా, ప్రత్యేక కోర్టులు తగినంత లేక కేసులు సంవత్సరాల పాటు పెండింగ్‌లో ఉన్నా, అత్యంత కఠినమైన చట్టం కూడా పుస్తకాలకే పరిమితమవుతుంది. చట్టాలను మార్చడం కంటే అమలు వ్యవస్థను మార్చడం కష్టమైనపని. అందుకే ప్రభుత్వాలు వాస్తవాలను పక్కనపెట్టి చట్టాల పేర్లు మాత్రమే మార్చడం సమస్యకు మూలపరిష్కారం కాదు. దిశ బిల్లు వెనక్కివెళ్లింది. రేపుమరో ప్రభుత్వం మరోపేరుతో ఇంకోచట్టం తీసుకురావచ్చు. కానీ మహిళల జీవితాల్లోభయం తగ్గకపోతే, పోలీస్‌స్టేషన్‌లో అవమానం ఆగకపోతే, కోర్టుల్లో న్యాయం సంవత్సరాల తరబడి నిరీక్షించాల్సి వస్తే, దళిత, ఆదివాసీ, బీసీ, మైనారిటీ, పేద మహిళలపై జరిగే హింస జాతీయ చర్చగా మారకపోతే, ఈ దేశానికి సమస్య చట్టాల కొరతకాదు. రాజకీయ చిత్తశుద్ధి కొరత, పరిపాలనా సంకల్పం కొరత, సామాజిక న్యాయం కొరత. దిశ బిల్లు వెనక్కి వెళ్లిందా లేదాఅనేది రేపు ఒక పరిపాలనా నమోదుగా మాత్రమే మిగిలిపోవచ్చు. కానీ మహిళల దశ మారిందా

# మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలకు అంతం లేదా?

కామిడి సతీష్ రెడ్డి


ఉభయ తెలుగు రాష్ట్రాలలో మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలు శృతి మించిపోతున్నాయి. గతంలో పలువురు పేద మహిళల ప్రాణాలు బలిగొన్న మైక్రో ఫైనాన్స్‌లు మళ్లీ విజృంభిస్తున్నాయి. పేద కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా పతనం చేస్తూ వారి పాలిట శాపంగా మారిన మైక్రో ఫైనాన్స్‌లను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం నిషేధించింది. తిరిగి పుంజుకున్న మైక్రో ఫైనాన్స్‌లు ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుంటూ పడగ విప్పుతున్నాయి. తీసుకున్న రుణాన్ని ప్రతీవారం చెల్లించాల్సిన మైక్రోఫైనాన్స్‌ల ఊబిలో పేదవర్గాలు కూరుకుపోతున్నాయి. మరోసారి పాత దుర్ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు. సమభావన సంఘాలు, స్త్రీనిధి, ముద్ర తదితర రూపకాలలో ప్రభుత్వం రుణాలను అందిస్తున్నప్పటికీ పలువురు మహిళలు తక్షణ ఆర్థిక అవసరాల కోసం మైక్రో ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. కానీ తిరిగి చెల్లింపులో ఇబ్బందులకు గురవుతూ మానసిక, ఆర్థిక క్షోభకు గురవుతుండగా నెలవారీగా చెల్లించాల్సిన బ్యాంకు లింకేజీ రుణాలను చెల్లించలేకపోతున్నారు. దీంతో మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలను ప్రారంభంలోనే నియంత్రించాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. భారత బ్యాంకింగ్ వ్యవస్థలో రుణాల చెల్లింపులో మహిళా సంఘాలే అగ్రగామిగాఉంటున్నాయి. ఏ ఒక్క సభ్యురాలు రుణ వాయిదాల చెల్లింపులో ఆలస్యం చేసినా మిగతా సభ్యులు బాధ్యత వహిస్తూ ఆ మహిళతో రుణ వాయిదా చెల్లింపచేయడమో లేదా తామే భరించడమో చేస్తున్నారు. దీంతో మహిళా సంఘాల రికవరి సుమారు 100 శాతంగా ఉంటోంది. దీంతో మహిళల ఆర్థిక అవసరాలు, రుణాల చెల్లింపులో నిజాయితీని ఆసరాగా చేసుకుంటూ పలు మైక్రోఫైనాన్స్‌లు విజృంభిస్తున్నాయి. ఆర్‌బీఐ అనుమతులు, నిబంధనల మేరకే మైక్రో రుణాల మంజూరు ప్రక్రియను నిర్వహిస్తున్నామంటూ మైక్రోఫైనాన్స్‌ల ఏజెంట్లు పట్టణాలలోని బస్తీలు, గ్రామాల్లో ఇల్లిల్లు తిరుగుతున్నారు. 10మందితో సంఘాలు ఏర్పాటు చేయిం చి రుణ మంజూరు తంతును పూర్తిచేసి వారంవారం రుణ వాయిదాలను వసూలు చేస్తున్నారు. మొదటి విడతగా ఒక్కో సభ్యురాలికి రూ.30వేల మైక్రోరుణం మంజూరు చేస్తూ క్రమేపీ రుణ పరపతిని పెంచుతున్నారు. అంతేకాక ఆస్తులపై మార్టిగేజీ లోన్‌లు కూడా ఇస్తున్నారు. దీంతోపలు వురు మహిళలు సంఘాలుగా ఏర్పడిన స్తోమతకు మించి మైక్రో రుణాలను స్వీకరిస్తూ చెల్లించలేక చతకిలా పడుతున్నారు. రుణ వాయిదా చెల్లించే రోజున ఇంటికి తాళం పెట్టి వెళ్తున్న సందర్భాలు, ఫోన్‌లో అందుబాటులోఉండని పరిస్థితులు పెరుగుతున్నాయి. దీంతో సంఘం మిగతా సభ్యులు, మైక్రో ఫైనాన్స్ ప్రతినిధులు సభ్యురాళ్ల ఇంటి ముందు గొడవలు చేస్తున్నారు. గతంలో రుణగ్రహీతలు అయిన సభ్యురాళ్లు మరణిస్తే రుణచెల్లింపు జరిపే వరకు అంత్యక్రియలు నిర్వహించకుండా అడ్డుకున్న పరిస్థితులు ఉండేవి. మహిళలతో పాటు పురుషులు కూడా సంఘాలుగా ఏర్పడి మైక్రోరుణాలు పొందుతుండటంతో ఆయా కుటుంబాలపై ఆర్థికభారం మరింత పెరుగుతోంది. ప్రభుత్వం మైక్రో ఫైనాన్స్‌లపై చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో లింకేజీ రుణాల బకాయిలు పెరగడంతో పాటు పలువురు మహిళల జీవితాల్లో మైక్రో రుణాలు తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు వీని మీద ఆంక్షలు విధించాలి. •

# పాదచారుల భద్రత అభివృద్ధికి సంకేతం



డాక్టర్ ఎ. భాగ్యరాజ్

ఒక దేశం, ఒక నాగరిక సమాజం, ఒక నగరం ఎంత వెడల్పైన రోడ్లు కలిగి ఉందో కాదు, పాదచారులు ఎంత సురక్షితంగా, గౌరవంగా నడవగలుగుతున్నారో అదే నిజమైన అభివృద్ధికి కొలమానం. దానిలో భాగంగా పాదచారులభద్రత అనేది ఒక అభివృద్ధి చెందిన దేశానికి అత్యంత ముఖ్యమైన ప్రమాణాల్లో ఒకటి. రహదారులు కేవలం వాహనాల కోసం కాదు, నడిచే ప్రజల కోసం కూడా సమానంగా ఉండాలి. సుప్రీంకోర్టు కూడా సురక్షితమైన ఫుట్పాత్పై నడవడం అనేది జీవించే హక్కు (ఆర్టికల్ 21)లో భాగమని పేర్కొంటూ కేంద్ర, రాష్ట్రాలు పాదచారుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పాదచారుల మార్గం లేని ప్రాంతంలో పాఠశాలకు నడు చుకుంటూ వెళ్తుండగా ట్యాంకర్ ఢీకొని మరణించిన ఐదేళ్ల బాలుడికి సంబంధించిన ఒక కేసులో జూన్ 19, 2026 న తీర్పు నుండి ఉద్భవించింది. ఆగస్టు 3న, 2026, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం, అదనపు సొలిసిటర్‌జనరల్ ఆదేశాలను పాటించేలా చూడాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు ఒక ఉత్తర్వు జారీచేసింది. ఆక్రమణలకు గురికాని, పూర్తిగా వేరుచేసిన స్థలాన్ని ప్రతి రహదారి ప్రక్కన పాదచారుల కోసం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. రహదారి ఉందంటే పాదచారుల నడకదారి కూడా అందులో ఉన్నట్టే కదా, దీనికోసం పెద్దఎత్తున డబ్బులు ఖర్చుపెట్టి, భారీగా నిర్మాణాలు ఏమి చేయనక్కర్లేదు కదా, రహదారి నుంచి నడకస్థలాన్ని వేరుచేసే ఏర్పాటు ఉంటేసరిపోతుంది, ఆ స్థలం దురాక్రమణకు గురి కాలేదని చెప్పడానికి చిన్న తాడు అక్కడ కట్టినా సరిపోతుంది కదా అని బెంచ్ (జస్టిస్‌పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం) వ్యాఖ్యానించడం శుభపరిమాణం. పాదచారులు కదిలేవాహనాల మధ్య చిక్కుకుపోతామనే భయం లేకుండా నిర్భయంగా నడిచేందుకు అన్ని చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో పట్టణాభివృద్ధి విభాగాలు, మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, పంచాయతీల యంత్రాంగాలదే బాధ్యత అని, బాధితులకు ఈ వ్యవస్థల నుంచి పరిహారం కోరే పూర్తి హక్కు ఉందని స్పష్టం చేసింది. పాదచారుల మార్గాలపై నడిచే ప్రాథమిక హక్కు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ) ఆర్టికల్ 19(1)(డి) (భారతదేశ భూభాగం అంతటా స్వేచ్ఛగాసంచరించే హక్కు) లో అంతర్లీనంగా ఉంది. నడవడం అనేది ఈ స్వేచ్ఛలలో అంతర్భాగం కాబట్టి, ఈ హక్కు ఆర్టికల్ 19(1)(ఎ) (భావ ప్రకటనా స్వేచ్ఛ), ఆర్టికల్ 19(1)(బి) (సమావేశం), ఆర్టికల్ 19(1)(సి) (సంఘం ఏర్పాటు) అంశాలను కూడా తనలో ఇముడ్చుకుంది అని వెలువరించింది. ఈ తీర్పు పట్టణాభివృద్ధి సంస్థలు, పురపాలక సంఘాలు, పురపాలక సంఘాలు



పంచాయతీలపై పాదచారుల మౌలిక సదుపాయాలను సృష్టించడం, నిర్వహించడం పరిరక్షించడం అనే అనుబంధ బాధ్యతను విధిస్తుంది. పాదచారుల హక్కులను పరిరక్షించ డానికి, జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి ఒక నిర్దిష్ట చట్టాన్ని రూపొందించాలని, అలాగే ఒక నియంత్రణ సంస్థ ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని కోరింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాదాచారుల భద్రత, సార్వత్రిక ప్రాప్యత పాలసీ2026 అనే విధానంతో రోడ్లపై నడిచే ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కులను రక్షించ డానికి వారి భద్రతను నిర్ధారించడానికి తీసుకువచ్చిన ఒక చారిత్రాత్మక పాలసీకి ఆమోదం తెలిపింది. ఈ పాలసీ ముఖ్య ప్రాముఖ్యత, ఉద్దేశాలు భారతదేశంలో ఏటా వేలాది మంది పాదాచారులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పో తున్నారు. ఈ పాలసీ ద్వారా వాహనదారుల కంటే రోడ్డుపై నడిచే వారికే మొదటి ప్రాధాన్యత లభిస్తుంది. రోడ్డు ప్రమా దాల నివారణ భద్రతకు ప్రాధాన్యతనిస్తుంది. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించడానికి రోడ్లపై శాస్త్రీయంగా భద్రతా తనిఖీలు నిర్వహిస్తారు. ఆక్రమణలు లేని ఫుట్పాత్లు స్పష్టమైన విభజనకు అవకాశముంటుంది. ఫుట్పాత్లను ఆక్రమించి దుకాణాలు పెట్టడం, వాహనాలు పార్కింగ్ చేయడం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటారు. నడిచే దారి ఎల్లప్పుడూ ఖాళీగా ఉండేలా చూస్తారు. ఈ పాలసీ కేవలం సాధారణ ప్రజలకే కాకుండా దివ్యాంగులు, వృద్ధులు గర్భిణీ స్త్రీలకు కూడా సురక్షితంగా నడిచేలా అందరికీ వీలు కల్పి స్తుంది. ఫుట్పాత్లపై వీల్చైర్లు వెళ్లేందుకు వీలుగా రాంప్లు, అంధులు నడవడానికి వీలుగా స్పర్శ మార్గాలు ఏర్పాటు చేయబడతాయి. స్థానిక మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలు తమ పరిధిలోని ఫుట్పాత్లను సంరక్షించాల్సి ఉంటుంది. ఒకవేళ నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగితే పౌరు లు కోర్టుల ద్వారా నష్టపరిహారం పొందే హక్కు ఉంటుంది. కాబట్టి నిఘా, జవాబుదారీతనం అధికారులదే బాధ్యత. పాదాచారుల మార్గాల్లో భద్రత కోసం నిఘా కెమెరాలు, స్మార్ట్ క్రాసింగ్లను ఏర్పాటు చేస్తారు. సురక్షితమైన దారులు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలు స్వల్ప దూరాలకు నడవడానికి ఇష్టపడతారు. నడక పెరగడం వల్ల వాహనాల వాడకం తగ్గి, పట్టణాలలో వాయుకాలుష్యం, ట్రాఫిక్ జామ్లు తగ్గుతాయి. మొత్తంగా చెప్పాలంటే, పాదాచారుల పాలసీ 2026 అనేది కేవలం రోడ్ల నిర్మాణానికి సంబంధించింది కాదు, ఇది నగరాలను యంత్రాల కోసం కాకుండా, మనుషుల కోసంమార్చే ఒక గొప్ప సంస్కరణ. నియమాలు ఉన్నప్పటికీ ప్రజలు, స్థానిక సంస్థలు, ట్రాఫిక్‌శాఖ, రోడ్లుభవనాల శాఖల మధ్య సమన్వయం లోపం ఎక్కువగా, అమలు లోపం ఉంది. యూరప్లో చాలాదేశాలు (నెదర్లాండ్స్, డెన్మార్క్, జర్మనీ, స్వీడన్, ఫ్రాన్స్ మొదలైనవి) పాదచారులకు ప్రాధాన్యం ఇచ్చే నగర రూపకల్పనను అనుసరిస్తున్నాయి. మన దేశంలో కూడా ప్రతి 200-300 మీటర్లకు సురక్షిత క్రాసింగ్ ఏర్పాటు చేయాలి. పాఠశాలలు, ఆసుపత్రుల వద్ద వేగ పరిమితిని 30కి.మీ./గం.కు పరిమితంచేయాలి. పట్టణ స్థానిక సంస్థల పనితీరును 'పాదచారుల భద్రత' ఆధారంగా కూడా అంచనా

గుంటూరు వార్త

# వివాహిత పై హత్యాయత్నం

-అడ్డొచ్చిన భర్త,తోడికోడలికి తీవ్రగాయాలు. -రక్షణ కావాలంటున్న బాధితురాలు.



**తెనాలి ఆగస్ట్9(ప్రభాతవార్త):** కత్తులు,కర్రలతో వివాహితపై మూకుమ్మడిగా దాడికి పాల్పడిన ఘటన శనివారం తెల్లవారుజామున రేపల్లె మండలం,బేతపూడి గ్రామంలో చోటుచేసుకుంది.తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితిరాలు పొదిలి రాజ్యలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం,గత మూడు నెలల క్రితం తన కుమారుడు వివాహం జరిగిందని ఆరోజున వేడుకలో తనకు నచ్చిన పాటలు పెట్టపెదని బేతపూడి డేవిడ్ తన కుటుంబ సభ్యులతో గొడవకు దిగాడు.గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని తనకు బుద్ధిచెప్పారు.అది మనసులో పెట్టుకున్న డేవిడ్ తరచు రాత్రి సమయాల్లో,మేము ఇళ్లల్లో లేని సమయాల్లో కోడిగుడ్లు,ఇసుక ,ఇటుకరాళ్లతో ఇంటిపైకి దాడిచేస్తున్నాడు.అది తప్పని ఖండించినందునే చంపాలన్నా ఉద్దేశ్యంతో అర్ధరాత్రి రెండు గంటల సమయంలో డేవిడ్ కొంతమంది యువకులు బేతపూడి ప్రశాంత్,బేతపూడి నాగబాబు,బేతపూడి నాని,బేతపూడి రవి బాబు,అద్దేపల్లి గోవింద్,అద్దేపల్లి రత్నబాబుల కలసి దాడి చేశారు.నాకు తలకు బలమైన గాయం అవ్వగా శస్త్రచికిత్స చేశారని,తన భర్తకు,తోడికోడలకు గాయలవ్వగా తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నామని తెలిపారు.పోలీసులు నిందితుల నుంచి మాకు రక్షణ కల్పించాలని బాధితురాలు రాజ్యలక్ష్మి కోరారు.మాపై దాడికి పాల్పడుతున్నారని పలుసార్ల పోలీసులకు పిర్యాదు చేయగా పోలీసులు పట్టించుకోలేదని వాపోయారు.మాకు ప్రాణ హాని ఉందని మమ్మల్ని కాపాడాలని అన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

..కమిషనర్ కె.మయూర్ అశోక్



**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 9 (ప్రభాతవార్త) :** గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. జీఎంసి విభాగాధిపతులతో కలిసి ప్రజల నుండి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ వెల్లడించారు.

# ప్రపంచ ఆదివాసి దినోత్సవంలో పాల్గొన్న రాష్ట్రీయ మహాజన సమితి



**గుంటూరు విద్య ఆగస్టు 9 (ప్రభాతవార్త) :** జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణం శంకరన్ హాలులో జరిగిన అంతర్జాతీయ(ప్రపంచ ఆదివాసీ)ఆదివాసీ దినోత్సవం కార్యక్రమం సందర్భంగా ఆదివాసీ యానాది బిడ్డలతో రాష్ట్రీయ మహాజన సమితి(ఆర్ ఎం ఎస్ )అధ్యక్షులు కంభం. ఆనంద్ కుమార్ మరియు ఇతర యానాది సంఘ నాయకులు పాల్గొన్నారు. జై ఆదివాసీ జై యానాది జైభీమ్ అంటూ నినాదాలు పలికారు.

# రోడ్డు ప్రమాదంలో డీసీపీ కుమార్తె మృతి



**గుంటూరు క్రైమ్,ఆగస్టు9,ప్రభాతవార్త:** గుంటూరు సమీపంలోని ఏటుకూరు బైపాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం కుమార్తె షేక్ అసిఫా (24) మృతి చెందారు.మృతురాలు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎంఎస్‌సి సైకాలజీ కోర్స్ ఫైనల్ ఇయర్ చదువుతుంది.విజయవాడ నుంచి చీరాల బీచ్ కు వెళ్తుండగా కారు ప్రమాదానికి గురైంది.కారులో ఐదుగురు ప్రయాణిస్తుండగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి క్షతగాత్రులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.కుమార్తె మృతివార్త విని షిరీన్ బేగం తీవ్ర దిగ్భ్రాంతికి గురై స్పృహ కోల్పోయినట్లు సమాచారం.

# తిరంగా మన గౌరవం..దేశభక్తికి ప్రతీక..

## -ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి -కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

**గుంటూరు విద్య ఆగస్టు 9 ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా గుంటూరులో బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్ర 200 మీటర్ల జాతీయ జెండాతో విజ్ఞాన్ మందిరం దగ్గర నుంచి మార్కెట్ సెంటర్ మీదుగా లిబర్టీ, కృష్ణమహల్ థియేటర్ రోడ్డు లో నుంచి నాజ్ సెంటర్ వరకు జాతీయ జెండాలతో భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో శోభాయాత్ర ప్రదర్శన చేయడం జరిగింది. ఈ తిరంగా ర్యాలీలో ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడుతూ జాతీయ జెండా ప్రతి భారతీయుడి ఆత్మగౌరవానికి, దేశభక్తికి, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. స్వాతంత్ర్యం



కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను గౌరవించాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని తెలిపారు. తిరంగా కేవలం ఒక జెండా కాదు ఇది మన స్వాతంత్ర్య పోరాటానికి , మన సైనికుల త్యాగాలకు ప్రతీక, 140 కోట్ల భారతీయుల ఐక్యతకు ప్రతీక అని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి "హర్ ఘర్ తిరంగా – హర్ దిల్ తిరంగా" స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు.

**రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ**

తిరంగా కేవలం ఒక జెండా కాదు ఇది భారతదేశ ఆత్మగౌరవానికి ప్రతీక అని ఈ జెండా కోసం లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను అర్పించారు. ప్రతి భారతీయుడి ఇంటిపై తిరంగా ఎగరాలి, ప్రతి గుండెలో దేశభక్తి వెలగాలి. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా, ప్రతి పౌరుడి జాతీయ బాధ్యతగా స్వీకరించాలి. మన మధ్య భాషలు వేరు కావచ్చు, ప్రాంతాలు వేరు కావచ్చు, సంప్రదాయాలు వేరు కావచ్చు కానీ మనందరినీ కలిపేది జాతీయ పతాకం మాత్రమే అని కులం, మతం, ప్రాంతం, రాజకీయ భేదాలకు అతీతంగా దేశం కోసం ఒక్కటిగా నిలబడాలి అని అన్నారు.

**తూర్పు ఎమ్మెల్యే నజీర్ మహమ్మద్ మాట్లాడుతూ**

యువత చేతిలో జాతీయ పతాకం ఉంటే దేశ భవిష్యత్తు భద్రంగా ఉంటుంది. సోషల్ మీడియాలో దేశభక్తి సందేశాలు పంచుకోవడం మాత్రమే కాదు సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, విద్యా ప్రోత్సాహం, అవినీతి వ్యతిరేక పోరాటం వంటి కార్యక్రమాల్లోనూ యువత ముందుండాలి అని అన్నారు.

**పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ**

దేశాన్ని విమర్శించడం సులభం దేశాన్ని నిర్మించడం కష్టం అని అన్నారు.ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించినప్పుడే నిజమైన దేశభక్తి నిరూపితమవుతుంది. మన ఇల్లు శుభ్రంగా ఉంచడం నుంచి, ప్రజా ఆస్తులను కాపాడటం వరకు ప్రతి మంచి పని కూడా దేశ సేవే అని అన్నారు

**ఈతిరంగా ర్యాలీలో** ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ , జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు,మాజీ డిప్యూటీ మేయర్ షేక్ సజీల, తిరంగా ర్యాలీ రాష్ట్ర కన్వీనర్ గుడిసె దేవానంద్, కో కన్వీనర్లు శివారెడ్డి, సాయి లోకేష్, డాక్టర్ మండూరి వెంకట రమణ, బిట్ర శివన్నారాయణ, కొత్తూరు వెంకట సుబ్బారావు, ఈదర శ్రీనివాసరెడ్డి, వెలగలేటి గంగాధర్, పాలపాటి రవికుమార్, ఆవుల నాగేంద్ర యాదవ్, డాక్టర్.గి. జు. రావు తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ డాక్టర్ చరక కుమార్ గౌడ్, కో కన్వీనర్లు క్రిష్టిపాటి నారాయణరెడ్డి, మేడూరి యశ్వంత్ , నాయకులు వై. వి. సుబ్బారావు, షేక్ ఫైరోజ్, నడ్డి నాగమల్లేశ్వరి, హరి పావని, భజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, సాధు రామకృష్ణ, కఠారి వాసుదేవ నాయుడు, సురేష్ జైన్, మంత్రి సుగుణ, మేరీ సరోజిని, విమలాదేవి, విజయలక్ష్మి ్మ, దానబోయిన శివయ్య, వీర మణింద్ర, ఆమతి వెంకట రమణ, డాక్టర్ రాధా మాధవి, తుంగ యశ్వంత్, తురక రామారావు, షేక్ రఫీ, అబ్దుల్ ఖుద్దుస్, గౌస్ పీరా, షేక్ ఫర్హానా, అబ్దుల్ రషీద్, కాయితీ ప్రదీప్, కంతేటి బ్రహ్మయ్య, మేకల లక్ష్మణ్, రావుల రాజశేఖర్, మొవ్వ నరేష్, మల్లాల లక్ష్మణ్, చింతల పూడి సురేష్, మలిశెట్టి పవన్, పెసల వెంకటేష్,బెహర గాయత్రి, గొర్ల నాగమల్లేశ్వరి, చిరతన గండ్ల భూలక్ష్మి, లంక రవి, గాలేటి బాబు, సిద్దే సురేష్, నంద కిషోర్, కనసాని శ్రీనివాస రావు, రాజేష్ నాయుడు, అప్పిశెట్టి రంగా, రాచముల్లు భాస్కర్, పోతురాజు వేంకటేశ్వర్లు, శేషగిరి, కామేపల్లి వెంకటేశ్వర్లు , ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఐఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌లో గుంటూరు వైద్య కళాశాల సత్తా

## సమష్టి కృషితో మరింత ఉన్నత స్థానానికి చేరుకుంటాం: ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి

## జాతీయ స్థాయిలో 50వ స్థానం.. దేశంలోని అగ్రశ్రేణి 10 వైద్య కళాశాలల్లో చోటే లక్ష్యం

**గుంటూరు మెడికల్,ఆగస్టు 9,(ప్రభాతవార్త)**

ప్రతిష్ఠాత్మక ఐఐఆర్‌ఎఫ్ వైద్య కళాశాలల ర్యాంకింగ్స్–2026లో గుంటూరు వైద్య కళాశాల జాతీయ స్థాయిలో 50వ స్థానాన్ని సాధించింది. దేశవ్యాప్తంగా 144 ప్రముఖ వైద్య కళాశాలలను పరిగణనలోకి తీసుకుని ప్రకటించిన ఈ ర్యాంకింగ్స్‌లో గుంటూరు వైద్య కళాశాలకు 50వ స్థానం లభించడం పట్ల కళాశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.న్యూఢిల్లీ అఖిల భారత వైద్య విజ్ఞాన



గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి (ఫైల్ ఫోటో)

సంస్థ మొదటి స్థానాన్ని కొనసాగించిన ఈ ర్యాంకింగ్స్‌లో గుంటూరు వైద్య కళాశాల జాతీయ స్థాయిలో 50వ స్థానాన్ని దక్కించుకుంది. ఈ ర్యాంకింగ్స్‌కు సంబంధించిన వివరాలను ప్రముఖ వైద్య, ఆరోగ్య వార్తా వేదిక కూడా ప్రచురించింది.ఈ సందర్భంగా గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ కళాశాలకు లభించిన గుర్తింపు అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది, పరిపాలనా సిబ్బంది, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సిబ్బంది సమష్టి కృషికి నిదర్శనమని తెలిపారు."జాతీయ స్థాయిలో 50వ స్థానం సాధించడం మనందరికీ ఆనందకరమైన విషయం. అయితే దీనిని ప్రారంభ విజయంగా మాత్రమే భావిస్తున్నాం. గుంటూరు వైద్య కళాశాలకు గొప్ప చరిత్ర, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, విస్తృతమైన వైద్య అనుభవం, మరింత ఉన్నత స్థాయికి ఎదగగల సామర్థ్యం ఉన్నాయి. దేశంలోని అగ్రశ్రేణి పది వైద్య కళాశాలల్లో గుంటూరు వైద్య కళాశాలకు స్థానం కల్పించడమే మా లక్ష్యం" అని డాక్టర్ సుందరాచారి తెలిపారు.వైద్య విద్యా ప్రమాణాలను మరింత పెంచడం, పరిశోధనలను ప్రోత్సహించడం, శాస్త్రీయ వ్యాసాల ప్రచురణకు ప్రాధాన్యం ఇవ్వడం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, రోగులకు అందించే వైద్య సేవలను మరింత మెరుగుపరచడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.విద్యార్థులు, అధ్యాపకుల్లో విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు పరిశోధనా కార్యకలాపాలను విస్తృతం చేయనున్నట్లు పేర్కొన్నారు. సమష్టి కృషి, పద్ధతిబద్ధమైన ప్రణాళిక, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితే గుంటూరు వైద్య కళాశాల జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానాన్ని సాధించి, అగ్రశ్రేణి పది కళాశాలల్లో చోటు సంపాదించగలదనే విశ్వాసం ఉందన్నారు.ఈ సందర్భంగా గుంటూరు వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చెందిన అధ్యాపకులు, వైద్యులు, పీజీ, యూజీ విద్యార్థులు, నర్సింగ్, పరిపాలనా, సహాయక సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు. కళాశాలను దేశంలోని అగ్రశ్రేణి వైద్య విద్యాసంస్థల్లో ఒకటిగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలు

**గుంటూరు విద్య ఆగస్టు 9 ప్రభాతవార్త :**



గుంటూరు నగరంలోని అమరావతి రోడ్డులో ఉన్న ఖీఏ కన్వెన్షన్‌ఖి వేదికగా 10వ యూసీమాస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి అబాకస్ మరియు మెంటల్ అర్థమెటిక్ పోటీలు ఘనంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో యూసీమాస్ విజయవంతంగా 10 సంవత్సరాల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న మైలురాయికి గుర్తుగా ఈ వేడుకను నిర్వహించినట్లు శ్రీరైనా టెక్నాలజీస్ ఛైర్మన్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి పురస్కారాలను అందజేసి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లల్లో అభ్యాస సామర్థ్యాలను, జ్ఞాపకశక్తిని మరియు మేధో వికాసాన్ని పెంపొందించడమే ఇటువంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన 2,000 మందికి పైగా చిన్నారులు ఈ పోటీలలో పాల్గొని తమ అద్భుతమైన ఏకాగ్రత, వేగం మరియు మానసిక గణిత నైపుణ్యాలను ప్రదర్శించారని తెలిపారు. అదేవిధంగా యూసీమాస్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన 300 మందికి పైగా విద్యార్థులకు వేదికపై ఘనంగా గ్రాడ్యుయేషన్ పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివా ది స్కూల్ డైరెక్టర్ కె.ఎస్.రావు, యూసిమాస్ సభ్యులు స్నేహల్ కారియా, బాలాజీ రాజగోపాల్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రెక్టార్ శివరాం ప్రసాద్‌కు ఎడ్యుకేషనల్ లీడర్‌షిప్ అవార్డు

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్9, ప్రభాతవార్త:** ఏఎన్‌యు రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఎడ్యుకేషనల్ లీడర్‌షిప్ అవార్డును అందుకున్నారు. ఫ్యూచర్ స్కిల్స్ ఫౌండేషన్ నిర్వహించిన క్వాలిటీ థాట్ కార్యక్రమంలో సిబిఐ మాజీ జేడి లక్ష్మీనారాయణ చేతులమీదుగా శివరాం ప్రసాద్ ఈ అవార్డును అందుకున్నారు. కామర్స్ విభాగాధిపతిగా శివరాం ప్రసాద్ సాఫ్ట్‌వేర్ కంపెనీలను, బ్యాంకింగ్, మేనేజ్‌మెంట్ రంగాల నిపుణులను ఆహ్వానించి విద్యార్థుల్లో నిరంతరం నైపుణ్యాల పెంపుకోసం శిక్షణా తరగతులు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యా రంగంలో అనేక రకాల సేవలను శివరాంప్రసాద్ అందిస్తున్నారు. బోధన, పరిశోధన రంగాలలో శివరాంకు ప్రత్యేక స్థానం ఉంది. అవార్డు అందుకున్న సందర్భంగా వీసి ఆచార్య గంగాధరరావు, రిజిస్ట్రార్ సింహాచలం, కోఆర్డినేటర్‌లు, డైరెక్టర్‌లు ఆయనకు అభినందనలు తెలియజేశారు.



# ఇంప్రూవ్‌డ్ వర్సిటీల్లో ఏఎన్‌యుకు 5స్థానం

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్9, ప్రభాతవార్త:**



ఏఎన్‌యుకు ప్రతిష్టాత్మక ఇండియా టుడే సర్వే సంస్థ నిర్వహించిన సర్వేలో దేశ వ్యాప్తంగా 5వ స్థానం లభించింది. దేశంలో 2026 జనరల్ గవర్నమెంట్ యూనివర్సిటీలలో మోస్ట్ ఇంప్రూవ్‌డ్ కేటగిరిలో 5వ స్థానం పొందింది. అలాగే ఓవరాల్ కేటగిరిలో 10వ స్థానంలో నిలిచింది. గడిచిన 5ఏళ్ళ కాలంలో సాధించిన ప్రగతిని పరిగణలోకి తీసుకుని ర్యాంకుల కేటాయించింది. ఈ సందర్భంగా వీసి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలంలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధి నలుదిశలు వ్యాపించిందని పేర్కొన్నారు. 50 ఏళ్ళ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించుకుంటున్న సందర్భంలో వర్సిటీ దేశంలోనే 5వ స్థానంలో నిలవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

# కేంద్రం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

-భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల

**పొన్నూరు, ఆగస్టు 9,ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర



అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. వచ్చే నెల ఒకటో తేదీన ఢిల్లీలో జరిగే మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు కార్మిక సంఘాల నాయకులు, సభ్యులు, సానుభూతి పరులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఏఐటియుసి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమా వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి లేబర్ కోడ్‌లను రద్దు చేయించే విధంగా ఆలోచన చేయాలన్నారు. ఆరేటి రామారావు మాట్లాడుతూ ప్రమాదంలో చనిపోయిన కార్మికుల కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారం ఇచ్చి మాట నిలబెట్టుకోవాలన్నారు. కార్మికుని కుమార్తె వివాహానికి రూ.50వేలు ఇస్తామని చెప్పి ప్రస్తుతం ఇప్పుడు రూ.20వేలు ఇవ్వడం సరికాదన్నారు. సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించి అమలు చేయాలన్నారు. ఛలో ఢిల్లీ ద్వారా సమస్యల పరిష్కారం చేసుకొనేందుకు కార్మికులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుమ్మడి రోశయ్య, రాజవరపు శివాజీగణేష్, మందపాటి వీరేంద్రబాబు, మేకల సురేంద్ర, మల్లెల నాగరాజు, మాకాని పాండురంగారావు తదితరులున్నారు.

# ఘనంగా నషాముక్త్ యువ జిల్లా స్థాయి పోటీలు

**గుంటూరు కల్చరల్,ఆగష్టు 9,ప్రభాతవార్త :** మేరా యువ భారత్ గుంటూరు జిల్లా అధ్వర్యంలో నషా ముక్త్ యువ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు.విశదల ఎన్నారై ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల్లో జరిగిన ఈ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు.సంగీతం,నృత్యం,రీల్ షార్ట్ ఫిల్మ్,నుక్కడ్ నాటక్,కవిత్వం,డిబేట్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు.కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డోలా సంజయ్ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి,తమ శక్తి సామర్థ్యాలను దేశ సేవకై వాడాలన్నారు.మేరా యువ భారత్ జిల్లా ఉప సంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ నషా ముక్త్ యువ కార్యక్రమాల ద్వారా యువతలో మాదకద్రవ్యాలపై అవగాహన కలిగిఉండాలన్నారు.ఎన్నారై కాలేజ్ డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవికుమార్,ఎన్నారై ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొగ్రామ్ ఆఫీసర్ షేక్ లాల్ జాన్ భాషా కార్యక్రమ నిర్వహణలో సహకరించగా పోటీలకు శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ,తాడేపల్లి గూడెం ప్రొఫెసర్ డీన్ (రిసెర్చ్ డెవలప్‌మెంట్) డాక్టర్ బిళ్ళా కిరణ్‌కుమార్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు,ఫేస్ సొసైటీ సెక్రటరీ పారుపల్లి రమేష్,తదితరులు పాల్గొని యువతను ప్రోత్సహించారు.అనంతరం జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

# విశ్రాంతి సైనికుల సమస్యల పరిష్కారంలో ఏపీ ప్రభుత్వం విఫలం!



**మంగళగిరి, ఆగస్టు 9, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారా మిలటరీ విశ్రాంత సైనికుల సమస్యలను పరిష్కరించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ చంద్రకుమార్ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారా మిలిటరీ విశ్రాంత సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని జాతీయ రహదారి వద్ద గల తెనాలి ఫ్లైఓవర్ ప్రక్కన సాయి ప్రియ రెసిడెన్సి నందు ఆదివారం ఉదయం నిర్వహించారు. సమావేశానికి విశ్రాంత సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర సెక్రెటరీ కే చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. చంద్రకుమార్ మాట్లాడుతూ విశ్రాంత సైనికుల సమస్యలను పరిష్కరిస్తామంటూ చంద్రబాబు నాయుడు లోకేష్ పవన్ కళ్యాణ్ లు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్మీతో సమానంగా తాము కూడా విధులు నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. అయినప్పటికీ తమకు ఏ విధమైన సంక్షేమం లేదని అన్నారు. ఇంటి పన్నులు మినహాయిస్తామంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆపరేషన్ సిందూర్ సమయంలో హామీ ఇచ్చారని ఇప్పుడు మర్చిపోయారని ఇదేమి న్యాయం అంటూ ప్రశ్నించారు. మాట ఇవ్వడం ఎందుకు తప్పడం ఎందుకని నిలదీశారు. ఏపీలో రిటైర్ అయిన వారికి ఉద్యోగాలు లేవని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన సైనికులు తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాలకు వెళ్లి ఉద్యోగాలు చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఇన్స్పెక్టర్ కె.వి.ఆర్ మూర్తి మాట్లాడుతూ దశాబ్ద కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలను పట్టించుకోవటం లేదని విమర్శించారు. మాజీ సైనిక ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఉచితవైద్య సదుపాయాన్ని కల్పించాలని అన్నారు. ఇకనైనా స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చంద్రకుమార్, ఉపాధ్యక్షులు భరత్ రెడ్డి, కోశాధికారి ఎంకే ప్రసాద్, సంయుక్త కార్యదర్శి రామారావు, గౌరవ సభ్యులు కే వి. ఈ మూర్తి, సలహాదారులు హరిబాబు, మాజీ అధ్యక్షులు ఆర్ శ్రీనివాసరావు, రిటైర్డ్ బిఎస్ఎఫ్ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సాంప్రదాయ కళలు దేవాలయాలకు అలంకారాలు

**గుంటూరు కల్చరల్,ఆగష్టు 9,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర సృజనాత్మక మరియు సంస్కృతి సమితి వారి సౌజన్యంతో నృత్యకిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ నిర్వహణలో జరుగుతున్న కూచిపూడి నృత్యోత్సవాల్లో భాగంగా కాకుటూరి పద్మావతి రచించి,శ్రీవల్లి శర్మ సంగీతం సమకూర్చిన కేంద్ర నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ మద్దాలి ఉషా గాయత్రి నృత్య దర్శకత్వంలో నృత్య కిన్నెర శిష్యబృందం,హైదరాబాద్ వారి శ్రీ అలమేలు మంగ చరితం కూచిపూడి నృత్య రూపకం అలరించింది.అనంతరం హంసధ్వని కూచిపూడి నృత్యాలయం శిష్యబృందం విజయవాడ వారి కూచిపూడి నృత్యమాలిక సిహెచ్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కనుల పండువగా జరిగింది.తొలుత జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణ మోహన్,సభాధ్యక్షులు ప్రముఖ ఆడిటర్ రామరాజు శ్రీనివాస్ రావు,ఆత్మీయ అతిధిగా ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు.ముఖ్యఅతిధి మాట్లాడుతూ కూచిపూడి నృత్యకళ ఆంధ్రరాష్ట్రానికి గర్వకారణమన్నారు.అనేకమంది నాట్యాచార్యులు దేశ,విదేశాల్లో ఖండాంతరాల్లో కూచిపూడి నృత్య వైభవాన్ని చాటారన్నారు.సంస్కృతి సాంప్రదాయాలపై మక్కువ పెంచుకునే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు.ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న నృత్య కిన్నెర వారిని అభినందించారు.ఈ సందర్భంగా అలమేలుమంగ చరితం,కూచిపూడి నృత్యమాలిక ప్రదర్శించిన కళాకారులను అభినందించి సత్కరించారు.సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఆర్.ప్రభాకరరావు,నిర్వాహకులు పి.విజయ్‌కుమార్,కోశాధికారి కె.వి.సుబ్బారావు తదితరులు



## అరవపల్లిలో రెండేళ్ల నమ్మకం అభివృద్ధిసంక్షేమం

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 9 ప్రభాతవార్త :** నరసరావుపేట మండలం అరవపల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా"రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి-సంక్షేమం" డోర్ టు డోర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. గత రెండేళ్లలో అరవుపల్లి గ్రామంలో సుమారు రూ.2 కోట్లకు పైగా నిధులతో వివిధ అభివృద్ధి పనులు జరిగినట్లు



తెలిపారు.తమకు అందుతున్న సంక్షేమ పథకాలపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజలకు వివరించేందుకు ఇంటింటికీ వెళ్తున్నామని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో గ్రామంలో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ములకలూరులో మట్టి తవ్వకాలనఅరికట్టాలి

డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

**నరసరావుపేట, ఆగస్టు 9 ప్రభాతవార్త ::** ములకలూరు గ్రామంలో అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకాలను తక్షణమే అరికట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. "గుడ్ మార్నింగ్ నరసరావుపేట" కార్యక్రమంలో భాగంగా గ్రామాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ.. టీడీపీ నేతల కనుసన్నల్లో సుమారు 60 ఎకరాల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ, దేవుని మాన్యం, డీకే పట్టా భూముల్లోనూ అనుమతులు లేకుండా లోతైన గుంతలు తవ్వుతున్నారని పేర్కొన్నారు.రాత్రింబవళ్లు టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల్లోనూమ ట్టితవ్వకాలుజరుగుతున్నాయని తెలిపారు. ములకలూరు గ్రామ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని, కలెక్టర్ వెంటనే గ్రామాన్ని సందర్శించి అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టాలని



కోరారు. లేనిపక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని గోపిరెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మహేష్ బాబు జన్మదిన వేడుకలు

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 9 ప్రభాతవార్త::**

అమ్మ-నాన్నల ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ది. టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ-మహేష్ బాబు యువశక్తి ఆధ్వర్యంలో సూపర్ స్టార్ మహేష్ బాబు 51వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు ఎం.డి. ఫారూఖ్ బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి



ఆంధ్రప్రదేశ్ బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి వృద్ధులకు, చిన్నారులకు పంపిణీ చేశారు. అనంతరం అభిమానుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ మహేష్ బాబు తన సేవా కార్యక్రమాలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని, ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షి ంచారు. ఫారూఖ్ బాబు మాట్లాడుతూ . భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.కార్యక్రమంలో జిలాని మాలిక్, అభిమానులు, వృద్ధాశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## బట్లూరు ఏసమ్మను పరామర్శించిన డాక్టర్ గజ్జల

**సత్తెనపల్లి (ఆగస్టు 9, ప్రభాతవార్త):**

సత్తెనపల్లి రూరల్ మండలం బట్లూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు బట్లూరు చిన్న కోటేశ్వరరావు గారి సతీమణి ఏసమ్మను నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పరామర్శించారు. ఇటీవల ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఏసమ్మ తలకు గాయమై చికిత్స పొందిన విషయం తెలుసుకున్న డాక్టర్ గజ్జల ఆమె నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి ంచారు.



ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి చిలక జైపాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

### హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యే

**నరసరావుపేట, ఆగస్టు 9 ప్రభాతవార్త :**

పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ కృతిక శుక్లా, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, శ్రీ పంత్ సేవాలాల్ మహారాజ్, ఏకలవ్య, చెంచులక్ష్మి ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు, హక్కులను పరిరక్షి ంచడంతో పాటు వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పల్నాడు జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో



31 విద్యాసంస్థల్లో 3,996 మంది విద్యార్థులు విద్య, వసతి పొందు తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ ఆదివాసీలు విదా ్యప రంగా, ఆర్థికంగా అభివృద్ధి చెంది సమాజ ంలో సమానంగా ఎదగాలన్న లక్ష ్యంతో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. విదేశీ విద్య, వ్యాపార ప్రోత్సాహం, క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమాల ద్వారా గిరిజనులకు ఆర్థిక సహాయం, పశువుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.ఎత్తిపోతల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు రూపొందించిన పాము కాటును నివారించే అల్ట్రాసౌండ్ బూట్ల ప్రాజెక్టు జాతీయస్థాయిలో ఎంపిక కావడం విశేషమన్నారు.కారెంపూడి, వినుకొండ ప్రభుత్వ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలకు రూ.10 కోట్లతో నూతన భవనాలు నిర్మించి ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, మెమొంటోలు అందజేసి, ఆదివాసీ నాయకులను ఘనంగా సత్కరించారు.

# మార్పు కోసం సీపీఐ ప్రజా పోరు యాత్ర

**సత్తెనపల్లి (ఆగస్టు 9, ప్రభాతవార్త):** దేశంలో మార్పు రావాలని, పాలనా విధానాల్లో మార్పు తీసుకురావాలని, శ్రమజీవులకు న్యాయం జరిగే వరకు ఎర్రజెండా పోరాటం కొనసాగుతుందని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సెప్టెంబర్ 1న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న "చలో ఢిల్లీ సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం సత్తెనపల్లి నియోజకవర్గంలో ప్రజా పోరు యాత్ర నిర్వహించారు.ముప్పాళ్ల మండలంలోని ఇరుగుపాలెం, మాదల, చాగంటివారిపాలెం, ముప్పాళ్ల, గోళ్లపాడు గ్రామాల్లో సభలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. నకరికల్లు మండలంలోని కల్లకుంట, చీమలమర్రి, చల్లగుండ్ల, నకరికల్లు, త్రిపురాంతకం ప్రాంతాల్లో, రాజుపాలెం మండలంలోని శ్రీనివాస్‌నగర్, నెమలిపురి, కొండమోడు, అనుపాలెం, బెల్లంకొండ రోడ్డు, రాజుపాలెం, రెడ్డిగూడెం ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. సత్తెనపల్లి మండలంలోని ధూళిపాళ్ల, ఎన్నాదేవి, సత్తెనపల్లి పట్టణంతో పాటు లెనిన్‌నగర్, రంగాకాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, అచ్చంపేట రోడ్డు, పార్క్ రోడ్డు, చెంచుకాలనీ, వడ్డవల్లి తదితర ప్రాంతాల్లో సీపీఐ జీపు జాత నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు యు. రాము మాట్లాడుతూ నిత్యావసర ధరలు, విద్యా, వైద్య రంగాల్లో మార్పు రావాల్సి న అవసరం ఉందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే పాలనా విధానాల్లో మార్పు రావాలని అన్నారు. ప్రజలంతా సీపీఐ పోరాటాల్లో




భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.సీపీఐ సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి మునునూరి రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు.కార్యక్రమంలో సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు కంచేటి పెద్దబ్బాయి, నియోజకవర్గ నాయకులు పొన్నూరు రోశయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, నరసింహారావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కే. శ్రీనివాస్, కే. రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

### చీఫ్‌విప్ జీ.వీ

**వినుకొండ,ఆగస్ట్9,ప్రభాతవార్త:** పేదలకు అందాల్సి న రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసిన,బ్లాక్ మార్కెట్‌కు తరలించినా,రీసైక్లింగ్ చేసిన సంబంధిత వ్యక్తులపై,రేషన్ షాపు డీలర్లపై కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వినుకొండ నియోజకవర్గం లో లబ్ధిదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా సకాలంలో నాణ్యమైన రేషన్ అందుతుందన్నారు. గతంలో కొన్ని గ్రామాల్లో రేషన్ పంపిణీ యంత్రాలు మొరాయించి బియ్యం సరఫరాలో ఆలస్యం కాగా వెంటనే సమస్యను పరిష్కరించి లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు. రేషన్ సరఫరా లో ఎక్కడ అలసత్వం చోటు చేసుకున్న తన దృష్టికి రాగానే వెంటనే పరిష్కరించడం జరిగిందన్నారు. వినుకొండ నియోజకవర్గంలో ప్రతినెల సకాలంలో కార్డుదారులకు రేషన్ సరఫరా యథావిధిగా జరుగుతుందని వివరించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా పై కొందరు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, రాజకీయ లబ్ధి కోసమే ఇటువంటి దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు రేషన్ ఇవ్వకుండా ఇచ్చినట్లుగా యంత్రాల్లో వేలిముద్రలు వేయించుకొని బియ్యం ఇవ్వకుండా దౌర్జన్యం చేయటం జరిగిందన్నారు. వైసిపి హయాంలో జరిగిన అవినీతి అక్రమాలు జరగకుండా కూటమి ప్రభుత్వం పౌరసరఫరాలను పకడ్బందీగా నిర్వహించి రేషన్ సరఫరా పారదర్శకంగా జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. రేషన్ పంపిణీలో ఎటువంటి అక్రమాలు జరగకుండా నిరోధించడానికి నిరంతరం కూటమి ప్రభుత్వం తనిఖీలు చేయిస్తుందని వివరించారు. వినుకొండ నియోజకవర్గంలో రేషన్ ఇవ్వకపోతే ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని చీఫ్ విప్ కోరారు. రేషన్ సరఫరాలో అక్రమాలకు పాల్పడితే డీలర్ షిప్ తొలగించడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. రాజకీయ లబ్ధి కోసం కొందరు సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

### న్యాయవాదులకు మానసిక ఉల్లాసం..

# శారీరక దారుఢ్యానికి క్రీడలు

**సత్తెనపల్లి (ఆగస్టు 9, ప్రభాతవార్త):** న్యాయవాదులు మానసిక ఒత్తిడిని తగ్గించుకొని శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరి అజయ్‌కుమార్ అన్నారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాల కోసం శనివారం, ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో న్యాయవాదుల నుంచి రెండు జట్లు, న్యాయవాద గుమస్తాలతో ఒక జట్టు ఏర్పాటయ్యాయి. ఎస్‌బీపీ లయన్స్ జట్టుకు పొత్తూరి హరిమణికంఠ కెప్టెన్‌గా, ఎస్‌బీపీ రోకర్స్ జట్టుకు న్యాయవాది సాయి శ్రవణ్ కెప్టెన్‌గా, న్యాయవాద గుమస్తాల జట్టుకు గుమస్తాల సంఘం అధ్యక్షులు మర్రి నరసింహారావు కెప్టెన్‌గా వ్యవహరించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో ఎస్‌బీపీ లయన్స్ జట్టు విజేతగా, ఎస్‌బీపీ రోకర్స్ జట్టు రన్నరప్‌గా నిలిచాయి.విజేత జట్టు కెప్టెన్ పొత్తూరి హరిమణికంఠకు షీల్డ్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరి అజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు చలువాది చిన సత్యనారాయణ, అనుమోలు జయరాం, అంకాళ్ల వెంకటేశ్వర్లు, మారూరి లింగారెడ్డి తదితరులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.



## నూతన వస్త్ర బహూకరణ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గజ్జల



**సత్తెనపల్లి (ఆగస్టు 9, ప్రభాతవార్త):** సత్తెనపల్లి రూరల్ మండలం ఫణిదం గ్రామంలో కూచిపూడి రాజేష్, శశిరేఖ దంపతుల కుమారుడు అజయ్‌కుమార్, కుమార్తె బ్యూలా స్టెల్లా జాయ్‌ల నూతన వస్త్ర బహూకరణ కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సా ర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర డాక్టర్స్ సెల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ గుంటూరు జానీ, రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి చిలక జైపాల్, పంచుమర్తి అప్పారావు, షేక్ నబీ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రిన్స్ మహేష్‌బాబు పుట్టిన రోజు వేడుకలు

**వినుకొండ,ఆగస్ట్9,ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని కుట్టు మిషన్లు పంపిణీ చేయడం జరిగిందని సామాజిక కార్యకర్త, సీనియర్ కౌన్సిలర్ పివి సురేష్ బాబు తెలిపారు. ప్రిన్స్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా వినుకొండ సురేష్ మహల్ లో సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ సంయుక్తంగా పీవీ సురేష్ బాబు ఆధ్వర్యంలో మహేష్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. ముందుగా కేక్ కట్ చేసి అభిమానులకు, ప్రజలకు పంచారు. ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీవీ సురేష్ బాబు మాట్లాడుతూ మహిళలు ఇంట్లో నుండే ఉపాధి పొందుతూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారని, అటువంటి పేద మహిళలకు కుట్టు మిషన్ ఇవ్వడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు సహకారంతో పట్టణంలోని నరసరావుపేట రోడ్డు లో సూపర్ స్టార్ కృష్ణ కాంస్య విగ్రహం త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు పీవీ సురేష్ బాబు తెలిపారు. కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తులం శ్రీను,బాందు,నేపాల్,జాబీర్, లింగ,చక్రి, వీరాంజీ,లక్ష్మీనారాయణ, రవి, గుంటూరు మస్తాన్ వలి, శివరామయ్య, బొంకూరి తదితరులు పాల్గొన్నారు.


## శావల్యాపురం మండలంలో బీజేపీలో చేరికలు...

**ావల్యాపురం,ఆగస్ట్9,ప్రభాతవార్త:** మండలంలోని గుర్రంవారిపాలెంలో భారతీయ జనతా పార్టీ మండల కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షులు యెల్లూరి శశికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో బీజేపీ విధానాలు,పార్టీ కార్యక్రమాలకు ఆకర్షితులై సుమారు 50 మంది బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి జిల్లా అధ్యక్షులు యెల్లూరి శశికుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

10 5.qxd:10 5.qxd 01/01/2001 09:33 Page 1



పల్నాడు జిల్లా వార్త



## ఘనంగా మహేష్ బాబు జన్మదిన వేడుకలు



**కారంపూడి అగస్టు 9, ప్రభాతవార్త :** కారంపూడిమండల కేంద్రమైన కారంపూడి లోని బస్టాండ్ సెంటర్లో సూపర్ స్టార్ మహేష్ బాబు 51 జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో కేకును కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ బాబు ఫ్యాన్స్ సభ్యులు మాట్లాడుతూ 5000 మందికి ఉచితంగా గుండె ఆపరేషన్ చేయించి న ఘనత ఆయనదేనన్నారు. మహేష్ బాబు నిరుపేదలను అన్ని విధాలుగా ఆదుకుంటున్న వ్యక్తిని అన్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు, పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ బాబు ఫ్యాన్స్ మండల అధ్యక్షుడు గణిత అమరయ్య, బొంకురి నాగేశ్వరరావు, శంకరయ్య, షేక్ నన్నేసా, సంగినిడి బాలకృష్ణ, జక్కా నరసింహారావు, కటికల శ్రీనివాసరావు, పిట్టల పెద్ద వెంకయ్య, లింగయ్య, పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

## మన ప్రాచీన చరిత్రకు సంస్కృతి సాంప్రదాయాలకు నిలువటద్దం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం




**రెంటచింతల ప్రభాతవార్త ఆగస్టు 09:** మండల కేంద్రమైన రెంటచింతల లో ఘనంగా అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం నిర్వహించారు. గిరిజన గురుకుల హాస్టల్ విద్యార్థులు సాంస్కృతిక, సాంప్రదాయ వేషధారణ, ఆదివాసి కళా నృత్యాలతో జనులను ఆకట్టుకున్నారు. పాఠశాలలో అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్, బోర్సా ముండ చిత్రపటాలకు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యావేత్త నారాయణపురం శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమంలో గిరిజన నేతలు విదేశీ శక్తుల నుంచి మాతృభూమిని విడిపించడం కోసం చేసిన త్యాగాలను వివరించారు. డప్పు వాయిద్యాలతో పురవీధులలో వివిధ గిరిజన సాంప్రదాయాలను పాటిస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.మోహన్, వైస్ ప్రిన్సిపల్ భాగ్యమేరి, ఉపాధ్యాయులు కృష్ణా నాయక్, ఎంఎల్ఆర్ ఫౌండేషన్ మేనేజర్ కళ్యాణ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

**దుర్గి, ఆగస్టు 9, ప్రభాతవార్త.** రాబోయే ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా దుర్గి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లందరినీ బైండోవర్ చేస్తున్నట్లు ఎస్.ఐ. బి. గోపాల్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు దుర్గి ఎస్సై ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, చట్టాలను గౌరవించాలని సూచించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా, గొడవలు, బెదిరింపులు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్లు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకుని, మంచి ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని, కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షి ంచారు. సమాజంలో మంచి పౌరులుగా గౌరవప్రదంగా జీవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దుర్గి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు



**మాచర్ల టౌన్ ఆగస్టు 9 ప్రభాతవార్త:**ఫైల్ నేమ్:ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలిమాచర్లలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలుప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాచర్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకులు యెనుముల మురళీధర్‌రెడ్డి పాల్గొని ఆదివాసీలకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో మరింత అభివృద్ధి సాధించేలా కృషి చేయాల్సిన అవసరాన్ని నాయకులు వివరించారు. ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగానికి చెందిన రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నరసరావుపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడిగా అత్తులూరి సుబ్బారావు..



**నరసరావుపేట టౌన్, ఆగస్టు 9 ప్రభాతవార్త** ;నరసరావుపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నూతన అధ్యక్షుడిగా అత్తులూరి సుబ్బారావు (సుబ్బు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. గత కమిటీ రెండేళ్ల పదవీకాలం పూర్తవుతున్న సందర్భంగా ఛాంబర్ పెద్దలు, వివిధ వ్యాపార సంఘాల ప్రతినిధులు, సభ్యుల సమక్షంలో నూతన అధ్యక్షుడిగా అత్తులూరి సుబ్బారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2026-2028 కాలానికి ఆయన అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావుకు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ప్రముఖులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్తా, కపలవాయి రమేష్ చంద్ర దత్, ఊరా భాస్కరరావు, పచ్చిపులుసు సతీష్ లు అభినందనలు తెలిపారు. ఛాంబర్ పెద్దలు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, సభ్యులు సుబ్బారావును ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారుల సమస్యల పరిష్కారానికి, నరసరావుపేట వాణిజ్య అభివృద్ధికి ఛాంబర్ మరింత కృషి చేయాలని వారు ఆకాంక్షి ంచారు.

## కన్నా లక్ష్మీనారాయణను కలిసిన కేంద్ర మంత్రి పెమ్మసాని



**సత్తెనపల్లి:అగస్టు 9, ప్రభాతవార్త :** గుంటూరు పట్టణంలోని కన్నావారి తోటలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, శాసనసభ్యులు శ్రీ కన్నా లక్ష్మీ నారాయణ గారి నివాసంలో కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.


# సాగునీరు కోసం రైతన్నలు ఎదురుచూపు

**జలాశయానికి పెరుగుతున్న నీటిమట్టం**

**వరి పంట సాగు చేసేందుకు**

**పొలాలు సిద్ధం**

**కారంపూడి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది**



**కారంపూడి అగస్టు 9, ప్రభాతవార్త :** పంటలు సాగు చేయడానికి రైతులు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. మండలంలో సుమారు12 వేల 500 హెక్టార్ల సాగు భూమి ఉంది. ఇప్పటికే రైతులు 2000 హెక్టార్లలో పత్తి పంట సాగు చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పత్తి పంట ఓ దశలో ఉండగా, కొందరు రైతులు బోర్ల కింద సాగు చేశారు. ఇప్పటికే రైతులు పత్తిని కూడా తీస్తున్నారు. వరి పంట సాగు చేసేందుకు సాగునీటి కోసం రైతన్నలు ఎదురుచూపులు చూస్తున్నారు. ఇప్పటికే డెల్టా ప్రాంతంలో వరి పంట సాగు చేస్తున్నారు. సాగర్ కుడి కాలువ ఆయు కట్టు రైతులు మాత్రం సాగర్ జలాల కోసం జలవనుల శాఖ అధికారులు ఎప్పుడు విడుదల చేస్తారా అని ఆశగా చూస్తున్నారు. ఇప్పటికే వరి పంట సాగు చేసేందుకు రైతులు తమ పొలాలను సిద్ధం చేసుకున్నారు. నీరు విడుదల చేస్తే నారు ముళ్ళు వేసుకొని వరి పంట సాగు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ప్రతి ఏటా ఆగస్టు మాసంలో సాగర్ నీటిని విడుదల చేసేవారు ఏడాది సరైన వర్షాలు లేకపోవడం, ఋతుపవనాలు కూడా ముఖం చాటేసాయి. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు ఆల్మట్టి, జూరాల జలాశయాల నుండి శ్రీశైలంకు నీటిని విడుదల చేశారు. శ్రీశైలం నుండి దిగువకు నీటిని విడుదల చేయటంతో సాగర్ జలాశయానికి మీరు చేరింది. సాగర్ జలాశయం నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం516 అడుగులు ఉన్నట్లు తెలుస్తుంది. ఎగువ నుండి నీరు పూర్తిస్థాయిలో వస్తే సాగర్ జలాశయం నిండు కుండల మారనుంది. సాగర్ ఆయు కట్టు కింద ఆరు లక్షల ఎకరాల భూమి సాగులో ఉంది. పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల రైతులు సాగర్ నీరు విడుదల చేస్తే వరి పంటను సాగు చేయనున్నారు. గత ఏడాది రెండు పంటలు పండించిన రైతులు ఆశాజనకంగా దిగుబడి వచ్చింది. జలవనరుల శాఖ అధికారులు, కూటమి ప్రభుత్వం నీరు విడుదల చేస్తే వరి పంట సాగు చేయనున్నారు.

## కృత్రిమ చేతులతో కొత్త జీవితం

**నరసరావుపేట, ఆగస్టు 9 ప్రభాతవార్త ::** ప్రాణదానం ట్రస్ట్, ఇనాలి ఫౌండేషన్-పూణే వారి సహకారంతో స్థానిక రామిరెడ్డిపేటలోని రాధా సుందర కళ్యాణ మండపంలో ఉచిత ఎలక్ట్రానిక్ కృత్రిమ చేతుల పంపిణీ శిబిరం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల పాల్గొని లబ్ధిదారులకు కృత్రిమ చేతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేతులు కోల్పోయిన దివ్యాంగులకు ఎలక్ట్రానిక్ కృత్రిమ చేతులు అమర్చి వారి జీవితాల్లో నూతన అధ్యాయానికి బాటలు వేస్తున్న ప్రాణదానం ట్రస్ట్ సేవలను అభినందించారు. సంస్థ గౌరవ అధ్యక్షులు, పూర్వ కెమిస్ట్ అండ్ డగ్గిస్ట్ అసోసియేషన్ ఉమ్మడి రాష్ట్ర నాయకులు, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.పి. రంగారావు మాట్లాడుతూ సంస్థను స్ఫూర్తిగా తీసుకుని మరిం త మంది దాతలు, స్వచ్ఛంద సంస్థలు దివ్యాంగుల కోసం ముందుకు రావా లని పిలుపునిచ్చారు. కృత్రిమ చేయి నాణ్యత, ఫిట్టింగ్, వినియోగంపై నిర్వాహకులు లబ్ధిదారులకు పూర్తి అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఇవి సుమారు పదేళ్ల వరకు పనిచేస్తాయని వివరించారు. అయితే వేడి ప్రదేశాలు, మంటలు, ఓవెన్ల సమీపంలో వీటిని వినియోగించరాదని సూచించారు.

రెండు రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో సుమారు 200 మందికి కృత్రిమ చేత ులు అమర్చనున్నట్లు నిర్వాహకులు కిరణ్ తెలిపారు. కరెంట్ షాక్‌తో చేయి కోల్పోయిన హైదరాబాద్‌కు చెందిన ఐదో తరగతి విద్యార్థి అవినాష్‌కు



కృత్రిమ చేయి అమర్చారు. అనంతరం ఆ చేతితో కలెక్టర్ కృతిక శుక్లకు వాటర్ బాటిల్ అందించి షేక్‌హ్యాండ్ ఇచ్చాడు. కృత్రిమ చేయి అమర్చడంతో ఎంతో సంత ోషంగా ఉందని అవినాష్ పేర్కొన్నాడు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ ఆర్. సూర్యనారాయణ సింగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బ రాయ గుప్తా, ఇనాలి ఫౌండేషన్ సీఎస్ఆర్ విభాగానికి చెందిన షమ్మీ లక్రా, రోటరీ క్లబ్ పూణే డౌన్‌టౌన్‌కు చెందిన ప్రదీప్ మునుట్ తదితరులు పాల్గొన్నారు.

## దర్శనమిచ్చిన కావటి అంకమ్మతల్లి



**యడ్లపాడు, అగస్టు 9, ప్రభాతవార్త :** ఎడ్లపాడు గ్రామంలోని కావటి అంకమ్మతల్లి ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు అదివారం నిర్వహించారు. ఆలయ పూజారి రమేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, శాకంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని ఆషాఢ మాస సారెను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.

## ఘనంగా అమరావతి ఛాంపియన్‌షిప్-2026



**నరసరావుపేట టౌన్, ఆగస్టు 9ప్రభాతవార్త ::** వాగ్దేవి డిగ్రీ కాలేజీ (అటానమస్) గ్రౌండ్‌లో అమరావతి ఛాంపియన్‌షిప్-2026 కబడ్డీ, ఖోఖో పోటీలు పార్లమెంటరీ నియోజకవర్గ జట్ల ఎంపిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, డీఎస్పీ యం. హనుమంతరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ కడియాల హిందూజాలు హాజరై ప్రారంభించారు. కబడ్డీ అండర్-17, అండర్-23, ఖోఖో అండర్-23 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల నుంచి కబడ్డీ అండర్-17కు ఒక జట్టు, కబడ్డీ అండర్-23కు ఒక జట్టు, ఖోఖో అండర్-23కు ఒక జట్టును పార్లమెంటరీ నియోజకవర్గం తరఫున ఎంపిక చేశారు. ఈ క్రీడా పోటీలను డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఆఫీసర్ నరసింహారెడ్డి పర్యవేక్షి ంచారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రిన్సిపల్ కపిలవాయి రాజేంద్ర ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. క్రీడలతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, పెంపొందుతాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండంట్ రాయల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఫిజికల్ డైరెక్టర్ మెరిసిన్ బాబు, కృష్ణంరాజు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓ గూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్ బాబు, పాశం

## రూ.55 కోట్లతో ఎంసీహెచ్ బ్లాక్‌కు శంకుస్థాపనకు ఏర్పాట్లు

**బాబునరసరావుపేట టౌన్, ఆగస్టు 9 ప్రభాతవార్త::** ఈ నెల 11న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జిల్లా ఆసుపత్రినిసందర్శించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. ఆదివారం లింగంగుంట్లలోని ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే డా. అరవింద బాబు ఆదివారం సందర్శించారు. ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి, మౌలిక వసతుల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసరావుపేట ప్రభుత్వ పాత ఏరియా ఆసుపత్రిలో నాబార్డు నిధులతో సుమారు రూ.55 కోట్ల వ్యయంతో ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించి 11వ తేదీన ప్రకటించే అవకాశం ఉందన్నారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్, డయాలసిస్ యూనిట్, నియోనేటల్ యూనిట్, హైటెక్ ల్యాబ్, ఫిజియోథెరపీ యూనిట్‌లను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 350 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రారంభించే కార్యక్రమాన్ని నరసరావుపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఆసుపత్రిలో మౌలిక వసతుల విస్తరణతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. హాస్పటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, కూటమి నాయకులు కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు వెంట ఉన్నారు.



## బీజేపీ పదాధికారుల కీలక భేటీ

**కమిటీల పటిష్టతపై గోగినేని దిశానిర్దేశం**

**సత్తెనపల్లి (ఆగస్టు 9, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలోని తాడువాయి భవన్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షులు కందకట్ల శంకర్రావు ఆధ్వర్యంలో పట్టణ పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పల్నాడు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు గోగినేని వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



ఈ సందర్భంగా గోగినేని వెంకటరమణ మాట్లాడుతూ మండల కమిటీలు, మోర్చా కమిటీలు, శక్తి కేంద్ర ప్రముఖుల బాధ్యతలు, కార్యాచరణపై పలు ఆచరణాత్మక సూచనలు, సలహాలు అందించారు. పార్టీ సంస్థాగత బలోపేతానికి పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సత్తెనపల్లి మాజీ ఇన్‌చార్జి

# ముట్లూరులో ఇంటింటికి తెదేపా

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు 9, (ప్రభాతవార్త) :** మండలంలోని మేజర్ పంచాయతీ గ్రామం ముట్లూరు సౌత్ లో ఆదివారం టిడిపి రెండేళ్ల నమ్మకంఅభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాన్ని ఎంపిటిసి సభ్యులు గోగినేని కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో టిడిపి నేతలు నిర్వహించారు. సౌత్ లో రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి



సభ్యులు కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ..ప్రజల విశ్వాసంతో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే 2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో రాష్ట్ర ఐటీ విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపు మేరకు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందని చెప్పారు. ఇప్పటికే పలు సంక్షేమ పథకాలను అమలులోకి తీసుకొచ్చిందని తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన ప్రతి విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేసినట్లు పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా ఎన్నికల హామీలన్నింటినీ నెరవేర్చే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 90శాతం అమలుచేసి చూపించిందని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. ప్రభుత్వం అందించే పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ రాష్ట్రం మరియు గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నదని చెప్పారు.ఇక్కడ స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూసేందుకు ప్రభుత్వం జీవో 30 అమలు చేస్తుందని తెలియజేశారు. 2019లో గ్రామంలో టిడిపి వెనుకబడిన 2024 ఎన్నికల్లో గ్రామ ప్రజలు విశ్వాసం మంచి మెజారిటీ లభించిందని గుర్తు చేశారు. గత వైఎస్సార్ వైసిపి పాలనను, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు పోల్చి చూడాలని, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామంలో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా నిరసన తెలిపే హక్కు ఉందని, కానీ అసత్య ప్రచారాలు చేయటం సరికాదని వైసిపి నేతలను ఉద్దేశించి విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. వైసిపి నేతలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు, నిరసన ర్యాలీలు అర్థంపర్థం లేనివని విమర్శించారు. కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ లీడర్ గొట్టిముక్కల సుబ్బారావు, తోకల విజయ్ చంద్ర, గద్దం రామకృష్ణ, చిగురుపాటి అశోక్, సబ్బినేని మోహనకృష్ణ, అయినంపూడి సురేష్ బాబు, ఉయ్యూరు కోటేశ్వరరావు, మేడికొండూరు కిషోర్, పూనాటి శివరామయ్య, మాజీ వార్డ్ నంబర్లు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువత, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు ప్రత్తిపాడులో జరిగే వైకాపా నిరసన ర్యాలీని విజయవంతం చేయండి



**ప్రత్తిపాడు, ఆగస్టు 9, ప్రభాతవార్త :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, అద్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రంలో నేడు భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ..డీఎస్సీ 2025 నిర్వహణలో జరిగిన అక్రమాలపై బాధ్యత వహిస్తూ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలనే డిమాండ్ తో వైసీపీ ఆదేశాల మేరకు భారీ నిరసన ర్యాలీని నేటి ఉదయం 10 గంటలకు చేపట్టినట్లు తెలియజేశారు. ప్రత్తిపాడు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దగల భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి మల్లయపాలెం రోడ్డులో గల దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైయస్. రాజశేఖరరెడ్డి విగ్రహం వరకు విద్యార్థులు నిరుద్యోగ యువతతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.కావున ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ, మండల పార్టీ అధ్యక్షులు మరియు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ మరియు మండల, గ్రామ, డివిజన్ స్థాయిలో వివిధ హోదాల్లో ఉన్నవారు మరియు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# కిట్స్,కిట్స్ అక్షరలో నూరు శాతం సీట్లు భర్తీ



**ప్రత్తిపాడు, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్ 2026 మండల పరిధిలోని యనమదల గ్రామం వద్దనున్న కిట్స్ అక్షర, వట్టిచెరుకూరు మండలంలోని వింజనంపాడు గ్రామం వద్దనున్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలలో నూరుశాతం సీట్లుభర్తీ అయినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, సెక్రటరీ మాట్లాడుతూ..మొదటి కౌన్సిలింగ్ లోనే నూరుశాతం సీట్లు భర్తీచేసి కిట్స్, కిట్స్ అక్షర ఇంజనీరింగ్ కళాశాలలు మరో మైలురాయి సాధించాయని వివరించారు. ఆదివారం విడుదల చేసిన ఈ ఏపీ సెట్ 2026లో తల్లిదండ్రులు మరియు విద్యార్థుల నుంచి లభించిన విశేష ఆదరణతో డిపార్ట్మెంట్ల వారీగా అన్నిసీట్లు నింపబడినట్లు తెలిపారు. కిట్స్, కిట్స్ అక్షర్ ఇంజనీరింగ్ కళాశాలలపై నమ్మకం ఉంచి తమ పిల్లల భవిష్యత్తు కోసం ఈ కళాశాలలనే ఎంపిక చేసుకున్న తల్లిదండ్రులు మరియు విద్యార్థులందరికీ కళాశాల యాజమాన్యం తరపున హృదయపూర్వక అభినందనలు తెలిపారు. 2008లో స్థాపించబడిన కళాశాల ప్రస్తుతం నాక్, ఆటోనమస్, ఎన్బీఏ కళాశాలలుగా కొనసాగుతున్నాయని, విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య, ఆధునిక వసతులు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం మరియు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిందని వెల్లడించారు. కిట్స్ అక్షర డైరెక్టర్ గోగినేని సాంబశివరావు, ప్రిన్సిపాల్ డా.కె.రామకోటయ్య, కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు మాట్లాడుతూ..కిట్స్, కిట్స్ అక్షర ఇంజనీరింగ్ కళాశాలలలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన, నాణ్యమైన విద్య బోధించడం జరుగుతుందని వివరించారు. త్వరలోనే మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థులకు తరగతులు ప్రారంభిస్తామని తెలియజేశారు.

# భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఆషాఢ మాసం సారె సమర్పణ

**పొన్నూరు, ఆగస్టు 9,ప్రభాతవార్త:** జై దుర్గా...జైజై దుర్గా....జై కనకదుర్గమ్మ అమ్మవారికీ జై...అనే భక్తుల నినాదాలతో స్వర్ణపురి పట్టణం ఆదివారం మార్మోగిపోయింది. స్థానిక జిబీసి రోడ్డు



మార్జిన్‌లో వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ఆషాఢమాసం సారెను అత్యంత భక్తిశ్రద్ధలతో మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఊరేగింపుకు ముందు మహిళల కోలాటాలు, చెక్కభజనలను భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆషాఢ మాసంలో అమ్మవారికి సారె సమర్పించడం వల్ల సర్వసుఖాలు, సుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వర్ణపురి పట్టణ పురవీధుల్లో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళా భక్తురాలు అమ్మవారి విగ్రహాన్ని శిరస్సుపై ధరించి గ్రామంలో ఊరేగించారు. చీర, జాకెట్, వడిబియ్యం, పసుపు, కుంకుమ, గాజులు, పూలు, తమలపాకులు, వక్కలు, పండ్లు, చలిమిడి, కొబ్బరికాయలు, స్వీట్లు, హాట్, ఎండుకొబ్బరి చిప్పలు, పంచదార చిలుకలు తదిరాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లెములలో తీసుకొని మహిళాభక్తులు ఊరేగింపుగా వెళ్ళి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయం కుంకుమ పూజలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు తీర్థ, ప్రసాద వినియోగం జరిగింది.

# వేజళ్ళవారిలంకలో కాపర్ వైర్ చోరీ

**రేపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త:** రేపల్లె మండలంలోని వేజళ్ళవారిలంక పంట పొలాల్లో ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ అపహరణకు గురైంది.కాపర్ వైర్ విలువ రూ.4 లక్షలు ఉంటుందని రేపల్లె విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామ్ సుధాకర్ బాబు ఆదివారం తెలిపారు.కాపర్ వైర్ చోరీ వ్యవహారంపై రేపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు.

# గంజాయి, ఫోక్సో చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం

**నగరం, ఆగష్టు 9, ప్రభాతవార్త:** గంజాయి, ఫోక్సో చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని రేపల్లె డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ అన్నారు. బాపట్ల జిల్లా ఎస్పీ ఆదేశాలతో



ఆదివారం స్థానిక మండల పరిధిలోని అల్లపర్రు అగ్రహారంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్డెన్ సెర్చ్ లో భాగంగా ప్రతి ఇంటిని సోదా చేసి సరైన పత్రాలు లేని 34 ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. గంజాయి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని, గంజాయి గురించి సమాచారం ఎవరికైనా తెలసిన ఎడల మీ దగ్గరలో ఉన్న పోలీస్ వారికి సమాచారం తెలపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి,సంక్షేమం టిడిపి రెండు కళ్ళు

## -అంజుమన్ కమిటి అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్

**పొన్నూరు, ఆగస్టు 9,ప్రభాతవార్త:** అభివృద్ధి-సంక్షేమం తెలుగుదేశం పార్టీకి రెండు కళ్ళు అని అంజుమన్ కమిటి అధ్యక్షుడు, టిడిపి నాయకుడు, న్యాయవాది మగ్బుల్‌బేగ్ అన్నారు.



స్థానిక 17వ వార్డులో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మగ్బుల్‌బేగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందంటే అది ఒక్క తెలుగుదేశం పార్టీ ఘనతేనన్నారు. మాజీ కౌన్సిలర్ పిన్నమనేని కోటేశ్వరరావు మాట్లాడుతూ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా టిడిపి నిలిచిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం సర్వనాశనం అయిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని తట్టుకోలేక ప్రభుత్వంపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా మళ్ళీ కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కొండవీటి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి నాగేశ్వరరావు, బిల్డర్ వంశీ దీపక్ తదితరులున్నారు.


# కష్టపడి,ఇష్టపడి చదివితే సత్ఫలితాలు

## -ఎజిఎంసి జోనల్ పర్సన్ షేక్ యాసిన్‌బాబా

**పొన్నూరు, ఆగస్టు 9,ప్రభాతవార్త:** ఇష్టపడి-కష్టపడి చదివితే విద్యార్థులు సత్ఫలితాలను పొందవచ్చని ఎజిఎంసి జోన్-3 పర్సన్ షేక్ యాసిన్‌బాబా అన్నారు. పదోతరగతిలో టాపర్‌గా నిలిచిన షేక్ జిలాని ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన పలువురికి ఆదర్శంగా నిలిచినట్లు యాసిన్‌బాబా తెలిపారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రుల, పెద్దల సూచనలను సలహాలను పాటించడం ద్వారా ఉన్నతులుగా ఎదగవచ్చన్నారు.ప్రభుత్వ ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం అంటే తమ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లేనన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఫ్రెండ్స్ ట్యూషన్ పాయింట్ డైరెక్టర్ ఇర్షాద్ బేగ్ తదితరులున్నారు.



# భట్టిప్రోలు బిజెపి అధ్యక్షునిగా శ్రీనివాసరావు



**భట్టి ప్రోలు(రేపల్లె), ఆగస్టు 9, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ భట్టి ప్రోలు మండల అధ్యక్షునిగా మురుగుడు శ్రీనివాసరావు నియమితులయ్యారు.బిజెపి బాపట్ల జిల్లా అధ్యక్షుడు ముప్వల వెంకటరమణరావు నియామక పత్రం పంపినట్లు శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు.మండలంలో భారతీయ జనతాపార్టీని బలోపేతం చేస్తానని చెప్పారు.మండల,గ్రామ కమిటీల నియామకానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# చెవి, ముక్కు, గొంతు సమస్యలను అశ్రద్ధ చేయొద్దు

## - ఇ.ఎన్.టి. వైద్య నిపుణులు డాక్టర్ సి.హెచ్. నీలిమ

**గుంటూరు మెడికల్ ఆగస్టు 9(ప్రభాతవార్త ):** పిల్లల్లో తరచుగా ఎదురయ్యే చెవి, ముక్కు, గొంతు సమస్యలను అశ్రద్ధ చేయకుండా తొలి దశలోనే వైద్యులను సంప్రదించాలని ఇ.ఎన్.టి. వైద్య నిపుణులు డాక్టర్ సి.హెచ్. నీలిమ సూచించారు. ఆదివారం సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఎస్.హెచ్.ఓ. రక్తపోటు, మధుమేహ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. వయోవృద్ధుల్లో వినికిడి సమస్యలు ఆత్మన్యూనతకు దారితీస్తున్నాయని, వినికిడి పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచన మేరకు వినికిడి పరికరాలు ఉపయోగిస్తే జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. చెవి సమస్యలకు సొంత వైద్యం చేసుకోరాదని, చుక్కల మందులు, నిరోధక మందులను వైద్యుల సూచన మేరకే వాడాలని సూచించారు. అధిక శబ్దాల వల్ల శాశ్వత వినికిడి లోపం ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

టాన్సిల్స్, సైనసైటిస్, చెవుల్లో శబ్దాలు వంటి సమస్యలపై అవగాహన కల్పించి, ఉచిత పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి ఎస్.హెచ్.ఓ. వ్యవస్థాపకులు డా. టి. సేవకుమార్ అధ్యక్షత వహించారు.

మానవత వైద్య శిబిరాల చైర్మన్ టి. ధనుంజయరెడ్డి మాట్లాడుతూ నివారణ వైద్యం కంటే మేలైన మార్గమని అన్నారు. ప్రతినెలా రెండో ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పి. నిర్మలరాణి, డాక్టర్ చల్లా చైతన్య, చావా శివాజీ, లక్ష్మీ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాది పై దాడికి నిరసనగా విధుల బహిష్కరణకు పిలుపు

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 9(ప్రభాతవార్త):** తెనాలి బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాది షేక్ ఖాదర్ హుస్సేన్ పై ఆదివారం జరిగిన అమానుష దాడిని తెనాలి బార్ అసోసియేషన్ తీవ్రంగా




ఖండిస్తోంది.వివరాల్లోకి వెళితే ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో న్యాయవాది ఖాదర్ హుస్సేన్, కఠెవరం గ్రామంలోని తమ ఇంటి నుండి తెనాలికి వస్తుండగా, తెనాలి మాజీ ఎంపీపీ ధర్మరాజు చెన్నకేశవులు (అలియాస్ చెన్నయ్య) ఆయనను దారిలో అడ్డుకుని, అత్యంత నీచమైన పదజాలంతో దూషించారు. అంతటితో ఆగకుండా, తదనంతరం చెన్నకేశవులు తనతో పాటు సుమారు 50 మంది అనుచరులతో కలిసి న్యాయవాది ఇంటిపై దాడికి దిగారు. ఇంటి పరిసరాలను ధ్వంసం చేస్తూ, వారి కుటుంబ సభ్యులను తీవ్ర భయాందోళనలకు గురిచేసి, న్యాయవాదిని హత్య చేస్తామని బెదిరింపులకు పాల్పడి హత్యాయత్నం చేసారు. సమాజంలో న్యాయం కోసం పోరాడే ఒక న్యాయవాదిపై మరియు వారి కుటుంబంపై గుండాలతో కలిసి ఇటువంటి దాడులకు తెగబడటం అత్యంత హేయమైన చర్య. ఈ దాడికి పాల్పడిన ధర్మరాజు చెన్నకేశవులు మరియు ఆయన అనుచరులపై పోలీసులు తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెనాలి బార్ అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది.ఈ అక్రమ దాడికి నిరసనగా మరియు న్యాయవాదుల రక్షణను కాపాడాలని కోరుతూ సోమవారం, తెనాలి బార్ అసోసియేషన్ సభ్యులందరూ కోర్టు విధులను పూర్తిగా బహిష్కరించాలని పిలుపునిస్తున్నామని,తెనాలి బార్ అసోసియేషన్ సభ్యులందరూ ఏకతాటిపై నిలిచి, ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరుచున్నామని బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

# హాస్టల్ విద్యార్థులకు అండగా రోటరీక్లబ్ సభ్యులు

**తెనాలి ఆగస్ట్9(ప్రభాతవార్త):** మనకున్న దాంట్లో పేదలకు సహాయ సహకారాలందిస్తే భగవంతుడు మనల్ని ఆశీర్వదిస్తాడన్న విషయం ప్రతి ఒక్కరూ గమనించాలని,ఆంధ్రా ప్యారిస్ తెనాలి రోటరీ క్లబ్ గవర్నర్ స్పెషల్ రిప్రజెంటేటివ్ ఈదర వెంకట పూర్ణచంద్ పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ,మైనేని రత్న ప్రసాద్ అధ్యక్షతన ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ తెనాలి రోటరీ క్లబ్ ఆఫ్ ఆంధ్రా ప్యారిస్ తెనాలి వారి సంయుక్త ఆధ్వర్యంలో అమృతలూరు మండల పరిధిలోని మోపర్రు గ్రామంలో ఉన్న ఏఆర్సి హాస్టల్ విద్యార్థుల శ్రేయస్సు కోరి,ప్యాపర్రు గ్రామంలో ఇందిరా ప్రియదర్శిని బ్యాక్వర్డ్ మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం నిర్వాహకులు పల్లెకొండ రాజు, వేములపల్లి శ్రీధర్ లకు దుప్పట్ల పంపిణీ



కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎవరూ కూడా పేదవాడిగా జన్మించరు, కానీ మనం జన్మించాక చక్కగా విద్య అన్నభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగి మనం కూడా మన తోటి వారికి సహాయ సహకారాలందించాలన్నారు.ఈ వసతి గృహం లోని విద్యార్థులకు చక్కని విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకుల్ని చేయాలనే తాపత్రయంతో పరితపించిపోతున్న నిర్వాహకులు రాజు కుటుంబ సభ్యులు అభినందనీయులన్నారు. మానవసేవే మాధవసేవ అనే లక్ష్యంతో ఇలాంటి లోని అనాధ పిల్లలకు చేయూతనివ్వడం ఆనందదాయకమని, భవిష్యత్తులో కూడా మా రోటరీ క్లబ్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.దాతలు అందించే సహాయ సహకారాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు,కనగాల మధుసూదన్ ప్రసాద్, యర్రగుంట్ల మహేష్ బాబు, మున్నంగిశ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ, భీమవరపు శ్రీనివాసరెడ్డి,జాస్తి వినోద లక్ష్మి,గాజుల విజయ సారథి, కల్లూరి శివరామకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

## - ఎస్ఐ ప్రసాద్

**కొల్లిపర,అగష్టు 9 ప్రభాతవార్త:** మైనర్లకు వాహనాలు అప్పగించవద్దని చెబుతూ..మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఐ ప్రసాద్ హెచ్చరించారు.ఆదివారం మండల పరిధిలోని



దావులూరు,తూములూరు.చివలూరు తదితర గ్రామాల్లో ఎస్ఐ తన సిబ్బందితో కలసి వాహనాలను తనిఖీ చేసారు.డ్రైవింగ్ లైసెన్స్ ను..ఆర్సీ బుక్..ఇన్సూరెన్స్ ను తనిఖీ చేసారు.ఈ సందర్భంగా ఎస్ఐ ప్రసాద్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు.వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

# ప్రజలపై ఆర్థికభారం ఆందోళనకరం: రమేష్‌బాబు

**రేపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నదని భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత కన్నెగంటి రమేష్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు.ఆదివారం రేపల్లె పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో సెప్టెంబరు 1న ఢిల్లీలో జరిగే ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గోడపత్రికలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ యువతకు 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు ఓటర్లకు ఇచ్చిన హామీని నరేంద్రమోడీ నెరవేర్చలేక పోయారని అన్నారు.అభివృద్ధి పేరుతో ఆదాని,అంబానీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దోచిపెడుతున్నాయని ఆరోపించారు.నిత్యావసర ధరలను నియంత్రించాలని,సార్వత్రిక విద్య,వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని కోరారు.ఛలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మికులు,రైతులు,నిరుద్యోగులు తరలిరావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ,సిపిఐ నాయకులు పి.నాగాంజనేయులు,చెరుకూరి లక్ష్మణరావు,సురేష్ పాల్గొన్నారు.




# నేరస్తులపై నిరంతర నిఘా

## వన్ టౌన్ సీఐ రాంబాబు

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 9(ప్రభాతవార్త):** నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘాఉంటుందని తెనాలి వన్ టౌన్ సిఐ సిహెచ్.రాంబాబు పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు,ఆదివారం వన్ టౌన్ పరిధిలోని రౌడీషీటర్లకు, నేరచరిత్ర కలిగిన వారికి పోలీసులు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. నేరాలకు దూరంగా ఉంటూ చట్టబద్ధమైన జీవితం కొనసాగించుకోవాలని నేరాలకు పాల్పడినట్లయితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాంబాబు హెచ్చరించారు. సమాజంలో నేరస్తులకు, నేర స్వభావం కలిగిన వ్యక్తులకు చోటు లేదని, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిని నేర రహిత ప్రాంతంగా తీర్చిదిద్దటానికి పోలీసులకు ప్రజల సహకారం ఉండాలని సిఐ పేర్కొన్నారు.




# మంచినీటి సరఫరాకి ఆటంకం



**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 9(ప్రభాతవార్త):** పురపాలక సంఘ పరిధిలోని ఈ దిగువ తెలిపిన వార్డు ప్రజలకు తెలియచేయుట ఏమనగా గాంధీ పార్క్ లో ఎంఎస్ పైప్ లైన్ ఇంటరకనెక్షన్ కలుపుతున్న కారణంగా సోమవారం సాయంత్రం, గాంధీ పార్క్ ఓల్డ్ ట్యాంక్ పరిధిలోగల 4,7,8,9,10,11,12,16 వార్డులకు మంచినీటి సరఫరా నిలిపివేయడం జరుగుతున్నది మరియు అదే విధంగా సోమవారం ఉదయం యాదవిధిగా మంచి నీటి సరఫరా జరుగుతుంది. కావున పైన తెలిపిన వార్డుల ప్రజలందరూ తెనాలి పురపాలక సంఘానికి సహకరించవలసిందిగా మున్సిపల్ అధికారులు సూచించారు.

# వల్లభనేనికి ఇంటర్నేషనల్ బ్రూక్లిన్ అవార్డు

**రేపల్లె, ఆగస్టు 9, ప్రభాతవార్త:** నగరం మండలంలోని సజ్జావారిపాలెంకు



చెందిన కళాకారుడు వల్లభనేని సత్యసాయిబాబు గుంటూరులో జరిగిన చిత్రకళా వీధి కార్య క్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా "ఇంటర్నేషనల్ బ్రూక్లిన్ అవార్డు" అందుకున్నారు.ఈ సందర్భంగా సత్యసాయిబాబు మాట్లాడుతూ ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడం సంతోషకరంగా ఉందని చెప్పారు.

# అబాకస్‌లో సత్తా చాటిన స్వర్ణపురి విద్యార్థులు

**పొన్నూరు, ఆగస్టు 9,ప్రభాతవార్త:** 10వ రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో తొమ్మిది మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని సంస్థ డైరెక్టర్ సాయిచంద్ తెలిపారు. గుంటూరులో జరిగిన ఈ పోటీల్లో స్వర్ణపురి పట్టణానికి చెందిన యుసిఎంఎస్ సెంటర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచినట్లు చెప్పారు. బొమ్మిశెట్టి డాలర్ నక్షత్ర, బోడపూడి అవ్యక్త్, తోట వివిఎస్ఎస్ కార్తికేయ, వెల్లంపల్లి ఎల్ఎన్ఎస్ సుదీప్తి, జాస్మిన్ పఠాన్, తాళ్ళూరి హితిక్ష, వివిన్, రత్న బొల్లెద్దు, చెరిత్ అర్హన్ బొల్లెద్దు, షేక్ ఫహీమ అఫ్సా ఉత్తమ ప్రతిభ కనబరచినవారిలో ఉన్నారు. బొమ్మిశెట్టి డాలర్ నక్షత్రకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్‌తో ప్రత్యేకంగా సత్కరించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులు, వార్డు పెద్దలు అభినందించారు.



10-8Pg5_10-8Pg5.qxd 10/Aug/26 12:03 AM Page 1



# 'జెన్‌జెడ్'ను తప్పదారిపట్టించారు..

## నీట్ లీకేజీలపై తొలిసారి గళం విప్పిన కేంద్ర మాజీ మంత్రి ధర్మేంద్రప్రధాన్

## భారత్‌ను 'విశ్వగురు'గా నిలబెట్టేది యువతే



**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన అంశంపై సీనియర్ బీజేపీ నాయకుడు, సంబల్‌పూర్ ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్ ఎట్టకేలకు నోరు విప్పారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో జరిగిన నిరసనల సందర్భంగా జెన్‌జెడ్ యువతను కొందరు తప్పుదోవ పట్టించారని, ఆ పరిణామాల వల్లే తాను పదవిని వీడాల్సి వచ్చిందని వెల్లడించారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవడంతో గతనెల 25న ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజీనామా తర్వాత దాదాపు రెండువారాలకు జీఎం యూనివర్సిటీలో విద్యార్థులు,అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆయన తొలిసారిగా ఈ బహిరంగ ప్రకటన చేశారు. జెన్‌జెడ్ యువత మన పిల్లలలాంటి వారని, కొందరు వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రధాన్ ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశంలో ఏటా కనీసం రెండు కోట్ల మంది పిల్లలు జన్మిస్తున్నారని, గత పదేళ్లలో 20 కోట్ల మంది పురుడు పోసుకున్నాని పేర్కొన్నారు. వారి అంచనాలు, ఆకాంక్షలు వేరని, రాబోయే రోజుల్లో వారే భారత్‌ను విశ్వగురుగా నిలబెడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తనకు పదవి ముఖ్యంకాదని, అందుకే స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీని కలిసి రాజీనామా సమర్పించినట్లు వివరించారు.మరొక సభలో మాట్లాడుతూ ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతా దళ్ అధినేత నవీన్ పట్నాయక్‌పై ధర్మేంద్ర ప్రధాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేడీ కార్యకర్తలు చేపట్టిన నిరసనలు, ధర్మేంద్ర ప్రధాన్ గో బ్యాక్‌నినాదాలకు తాను భయపడేది లేదని స్పష్టం చేశారు.ఎయిర్‌పోర్టు వద్ద బీజేడీ యువజన విభాగం చేసిన ఆందోళనలను ప్రస్తావిస్తూ తాను ఒక రైతు బిడ్డనని, వెనక్కి పొమ్మన్నా మళ్లీ వస్తూనే ఉంటానని వ్యాఖ్యానించారు. నవీన్ పట్నాయక్ యువతను రెచ్చగొట్టి తనపైకి పంపుతున్నారని, తనను ఒడిశా ప్రజలకు ఒక అవమానంగా, చెడు వ్యక్తిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎప్పుడైనా ఒడిశా ప్రజలు తలదించుకునే పనిచేశానా అని సభను ప్రశ్నించగా, ప్రజలనుంచి లేదని పెద్ద ఎత్తున స్పందన వచ్చింది.రాష్ట్రానికి పెద్దగా గౌరవం తేలేకపోయినా, తన ప్రవర్తనతో ఎప్పుడూ ఒడిశా ప్రతిష్టను దిగజార్చలేదని ప్రధాన్ స్పష్టం చేశారు. పన్నెండేళ్ల క్రితం జగన్నాథ స్వామి, సంబల్‌పూర్ ఆరాధ్య దైవం మా సమలేశ్వరి దేవి ఆశీస్సులతోనే తాను కేంద్ర మంత్రిని అయ్యానని గుర్తు చేసుకున్నారు. విచిత్ర మేమిటంటే బీజేడీ ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ లీడర్ ప్రసన్న ఆచార్య సమక్షంలోనే ప్రధాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# వెస్ట్‌బ్యాంక్‌తో పాలస్తీనా ఏర్పాటును తిరస్కరించిన నెతన్యాహు



**జెరూసలెం, ఆగస్టు 9:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికను ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ తిరస్కరించారు. ఆయన గాజా లేదా వెస్ట్ బ్యాంక్‌తో పాలస్తీనా దేశం ఏర్పాటును తోసిపుచ్చారు. 15 అంశాల గాజా పీస్ ప్లాన్‌ను ఆదివారం తిరస్కరించారు. ట్రంపునకు ఇది ఎదురుదెబ్బగా మారింది. తాను ప్రధానిగా ఉన్నంత కాలం, పాలస్తీనా దేశం ఉండదు అని నెతన్యాహూ అన్నట్లు ఇజ్రాయిల్ మీడియా నివేదించింది. గాజా ప్లాన్‌ను తిరస్కరించడంతో పాటు హమాస్ పూర్తిగా నిరాయుధమయ్యే వరకు ఇజ్రాయిల్ గాజా నుంచి వెళ్లేదే లేదని తేల్చి చెప్పారు. ఈ రోడ్ మ్యాప్‌ను ట్రంప్ కీలక మైలురాయి, గొప్ప పురోగత్తిగా అభివర్ణించిన వారం రోజుల తర్వాత నెతన్యాహూ నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. ఇదిలా ఉంటే, ఈ ప్రణాళికకు హమాస్ అంగీకరించింది. శాంతి ప్రణాళిక అమలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావాలని హమాస్ కోరింది. ఈ ప్రణాళికలో భాగంగా తదుపరి దశకు వెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ట్రంప్ బోర్డ్ ఆఫ్ పీస్‌కు హమాస్ సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు, ఇజ్రాయిల్ తీరుపై ముస్లిం దేశాలు విమర్శలు చేస్తున్నాయి. వారం రోజుల క్రితం యూఏఈతో పాటు ఏడు ముస్లిం దేశాలు సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ సైనిక చర్యను తీవ్రంగా విమర్శించాయి. ఇజ్రాయిల్ చర్యలు గాజా యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ రూపొందించిన శాంతి ప్రణాళికకు విఘాతం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి.



## రాహుల్ ప్రయాగరాజ్ పర్యటనపై కేంద్రమంత్రి ఫైర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రయాగ్‌రాజ్ పర్యటనపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ ప్రయాగ్‌రాజ్ వెళ్లే బదులు రాంచీకి వెళ్లి ఉండాల్సిందని ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. రాహుల్ ఓపెద్ద తప్పు చేశారని, అయితే మనుషులన్నాక తప్పులు చేయడం సహజమే నంటూ వ్యాఖ్యానించారు. అంతకుముందు మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంపై సోషల్ మీడియాలో వీరిద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది.ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్)తో మహిళా రిజర్వేషన్లను ముడిపెట్టడంపై కేంద్రం, విపక్షాల మధ్య నడుస్తున్న వివాదం నేపథ్యంలో ఈ చర్చ జరిగింది.మహిళల భావ ప్రకటన స్వేచ్ఛపై రాహుల్ గాంధీ షేర్‌చేసిన ఒక వీడియోపై రిజిజు స్పందిస్తూ,ఆయన మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరడంతో ఈ రగడ మొదలైంది.దీనికి ప్రతిగా, అసలు మహిళా రిజర్వేషన్ చట్టాన్ని నియోజకవర్గాల పునర్విభజనతో ఎందుకు లంకె పెడుతున్నారంటూ రాహుల్ గాంధీ నిలదీశారు. ప్రయాగ్‌రాజ్ చేరుకున్న రాహుల్ గాంధీ అక్కడి ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వంపై,దాని విధానాలపై విరుచుకుపడ్డారు.కేంద్రం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్లే దేశంలో నేడు యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆరోపించారు. తన ప్రసంగంలో ప్రధానంగా మూడు అంశాలపై మాట్లాడాలనుకుంటున్నట్లు రాహుల్ తెలిపారు. అవి – బాధ, డేటా, సంపద. యువత పడుతున్న బాధలు, వారు ఉత్పత్తి చేస్తున్న డేటా గురించి తాను మాట్లాడుతున్నానని, అయితే అసలు సమస్య ఏమిటంటే.. యువతకు చెందాల్సిన సంపద ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల కారణంగా వారికి అందడం లేదని అన్నారు.



# పేపర్ లీక్ ఆందోళనపై దిగివచ్చిన జార్ఖండ్ సర్కార్

## పరీక్షల రద్దుకు సుముఖమని తెలిపిన మంత్రి

**రాంచి, ఆగస్టు 9:** పేపర్ లీక్‌పై విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి జార్ఖండ్ సర్కార్ దిగొచ్చింది. సోమవారం జార్ఖండ్ అసెంబ్లీ ముట్టడికి విద్యార్థులు పిలుపునిచ్చారు. ఆదివారం మరోసారి విద్యార్థులు, ప్రభుత్వం మధ్య జరిగిన చర్చలు కొలిక్కి రాలేదు. అయినప్పటికీ జెపిఎస్‌సి జెఎస్ ఎస్‌సిజడ్ పరీక్షల రద్దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, సీబీఐ దర్యాప్తుపై హామీ ఇచ్చేంత వరకు రాజీ ప్రసక్తే లేదని విద్యార్థి నాయకులు తేల్చి చెప్పారు. విద్యార్థులతో జరిగిన చర్చల నేపథ్యంలో ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. 14వ జెపిఎస్‌సి పరీక్షను రద్దు చేయడం, పరీక్షల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై దర్యాప్తు చేయడం, నియామక ప్రక్రియలో సంస్కరణలు తీసుకురావడం వంటి ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుకు తెచ్చింది. ఈ ప్రతిపాదనల్ని విద్యార్థులు పట్టించుకోవడం లేదు. సీబీఐ దర్యాప్తు లేకుండా చేసే ఇతర దర్యాప్తులు చేయడం, సీజీఎల్ పరీక్షను రద్దు చేయకపోవడం తమ ప్రధాన సమస్యల్ని పరిష్కరించవని విద్యార్థులు స్పష్టం చేశారు. విద్యార్థులు చేస్తు డిమాండ్లలో 99 శాతం అంశాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు మంత్రి సుదివ్య కుమార్ సోను తెలిపారు. మూడు రోజుల చర్చల తర్వాత 14వ జెపిఎస్‌సిపరీక్షతో పాటు 202325 బ్యాక్‌లాగ్ నియామకాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై రెండు దిశల్లో దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్రిమినల్ అంశాలను రాష్ట్ర సీఐడీ దర్యాప్తు చేస్తుందని, అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై ఈడీ దర్యాప్తు కోరుతామని మంత్రి తెలిపారు. నిందితులపై 90 రోజుల్లో ఛార్జిషీట్ దాఖలు చేసేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది. భవిష్యత్ నియామకాలపై నిపుణులతో కూడిన కమిటీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది.

# జేడీ వాన్స్‌తో ప్రధాని మోడీ ఫోన్ చర్చలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** భారత ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భారత్‌అమెరికా మధ్య ఉన్న సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా జేడీ వాన్స్, ఆయన భార్య ఉషా వాన్స్‌కు ఇటీవల కుమారుడు జన్మించినందుకు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. వాన్స్ కుటుంబ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఫోన్ సంభాషణ అనంతరం ప్రధాని మోడీ సోషల్ మీడియా వేదికఎక్స్‌లో స్పందించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నుంచి ఫోన్ కాల్ అందుకుంది. భారత్‌అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కీలక రంగాల్లో మరింత లోతుగా తీసుకెళ్లే మార్గాలపై చర్చించాం. ఆయనకు, సెకండ్ లేడీ ఉషా వాన్స్‌కు కుమారుడు జన్మించిన సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలియజేశాను. మొత్తం కుటుంబానికి శుభాకాంక్షలని మోడీ పేర్కొన్నారు. ఈ ఫోన్ సంభాషణకు కొద్ది రోజుల ముందు భారత్‌లో విదేశీ విరాళాలకు సంబంధించిన ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ చట్టంలో ప్రతిపాదిత సవరణలపై అమెరికా చట్టసభ్యుడు రైలీ మూర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్జీవోలు, ట్రస్టులు, విద్యా సంస్థలు, మత సంస్థలు విదేశాల నుంచి స్వీకరించే విరాళాలకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు తీసుకురావడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మార్పులు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతిపాదిత మార్పుల ద్వారా భారత ప్రభుత్వం చర్చిలు, మతపరమైన స్వచ్ఛంద సంస్థలపై నియంత్రణ సాధించే అవకాశం ఉందని రైలీ మూర్ ఆరోపించారు. దీనిని క్రైస్తవులపై స్పష్ట మైన దాడిగా అభివర్ణించారు. మరోవైపు భారత్‌అమెరికా ఆర్థిక సంబంధాలు కూడా కీలక దశలో ఉన్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కల్పించే రష్యా ఆంక్షల బిల్లును అమెరికా సెనేట్ శుక్రవారం ఆమోదిం చింది. ఈ బిల్లులో రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం ఉంది. రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో భారత్ కూడా ఉండటంతో ఈ పరిణామం న్యూఢిల్లీకి ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ బిల్లు చట్టంగా మారాలంటే అమెరికా ప్రతినిధుల సభలో కూడా ఆమోదం పొందాల్సి ఉంది. ఇదే సమయంలో భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయి.

## పాక్‌లో లష్కర్ కమాండర్ అనుమానాస్పద మృతి

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** పాకిస్తాన్‌లో ఐఎస్ఐ ప్రేరేపిత ఉగ్రవాదుల హత్యలు, అనుమానాస్పద మరణాలు కొనసాగుతూనే వున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో దారుణాలకు పాల్పడుతూ పాక్‌లో తలదాచు కుంటున్న లష్కర్ ఏ తయ్యిబా, హిజ్బుల్ ముజహిద్దీన్ వంటి సంస్థల ఉగ్రవాదులు గడచిన నాటుగేళ్ల కాలంలో 30 మందికి పైగా హత్యకు గురవడం పాక్‌లో సంచలనం రేపింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇస్లామాబాద్‌లోని కుబా మసీదు వద్ద లష్కర్ ఓ తయ్యిబా ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా వున్న జమాత్ ఉద్ దవా సీనియర్ కమాండర్ ఖారీ సయ్యిద్ అబ్దుల్ అజీజ్ వున్నట్లుండి కుప్పకూలి పోయాడు. అంతకు ముందు సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో ఇతను భోజనం చేసినట్లు సన్నిహితులు చెబుతున్నారు. కుప్పకూలగానే అజీజ్‌ను సహచరులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను చనిపోయాడు. అజీజ్ విష ప్రయోగంవల్ల మరణించి వుంటాడని అనుమానిస్తున్నారు. 30ఏళ్ల అజీజ్ ఇస్లామాబాద్‌కు చెందిన వాడుగా పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఇతనిపై జమ్మూ కాశ్మీర్‌లో అనేక కేసులున్నాయి. కాగా జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడులకు పాల్పడే ఉగ్రవాదుల కు అజీజ్ అటు ఆక్రమిత పాక్ ఇటు కాశ్మీర్‌లోని అటవీ ప్రాంతంలో షెల్టర్లు అందించే వాడు. తప్పుడు పత్రాలతో ఉగ్రవాదులను భారత్‌లో పంపించేవాడు. ఇందుకోసం నీలం వ్యాలీ, ముజఫరాబాద్ మార్గాన్ని ఎంచుకునే వాడు. ఇదే సమయంలో ఎన్‌కౌంటర్లలో మరణించిన ఉగ్రవాదుల కుటుంబాలకు ఆర్థిక సహాయం కూడా అజీజ్ అందించేవాడు.



# చైనాను వణికిస్తున్న 'డాల్ఫిన్' తుఫాన్

## షాంఘైలో 'జనజీవనం అస్తవ్యస్తం

### 1,300కు పైగా విమాన సర్వీసులు రద్దు

**బీజింగ్, ఆగస్టు 9:** పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన అత్యంత తీవ్రమైన 'డాల్ఫిన్' తుఫాన్ చైనా తూర్పు తీరాన్ని అతలాకుతలం చేస్తోంది. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులతో దూసుకొస్తున్న ఈ తుపాను దెబ్బకు దేశ వాణిజ్య రాజధాని షాంఘై సహా పలు ప్రధాన నగరాలు స్తంభించిపోయాయి. చైనా ప్రభుత్వం ఇప్పటికే బ్లూ అలర్ట్ జారీ చేసి, సహాయక చర్యలను ముమ్మరం చేసింది. తుఫాన్ ప్రభావం షాంఘై, జెజియాంగ్ ప్రావిన్సులపై తీవ్రంగా పడింది. ముందుజాగ్రత్త చర్యగా షాంఘైలోని హాంకియావో, పుడాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఆదివారం నాటికి 1,300కు పైగా విమాన సర్వీసులను రద్దు చేశారు. ఇది మొత్తం రాకపోకల్లో 60 శాతానికి సమానం. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు, జెజియాంగ్, షాంఘై ఓడరేవులను పూర్తిగా ఖాళీ చేయించడంతో పాటు యాంగ్జీ నదీ పరీవాహక ప్రాంతంలో నడిచే పలు రైళ్లు, పడవల సేవలను కూడా నిలిపివేశారు. భారీ వర్షాలు, వరదల ముప్పు పొంచి ఉండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. జెజియాంగ్ ప్రావిన్స్‌లోని తైజౌ నగరం, షాంఘై పరిసర లోతట్టు ప్రాంతాల నుంచి సుమారు 3.90 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తీర ప్రాంతాల్లోని పాఠశాలలు, వ్యాపార సంస్థలు, పర్యాటక కేంద్రాలకు సెలవులు ప్రకటించారు. చైనా తీరాన్ని తాకడానికి ముందే ఈ డాల్ఫిన్ తుఫాన్ జపాన్‌లోని ఒకినావా దీవులు, తైవాన్ ఉత్తర ప్రాంతాల్లో కుండపోత వర్షాలతో బీభత్సం సృష్టించింది. రానున్న రోజుల్లో ప్రభావిత ప్రాంతాల్లో 200 నుంచి 400 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఈ దశాబ్దంలోనే ఇది అత్యంత ప్రమాదకరమైన తుపానుల్లో ఒకటిగా పరిణమించే ప్రమాదం ఉందని చైనా వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

## పెళ్లయిన ఏడేళ్లలోపు వేధింపులతో భార్య మరణిస్తే

# అది వరకట్న హత్యే: అలహాబాద్ హైకోర్టు తీర్పు

**లక్నో, ఆగస్టు 9:** వివాహితల అనుమానాస్పద మరణాలు, వరకట్న వేధింపుల కేసులకు సంబంధించి అలహాబాద్ హైకోర్టు అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. పెళ్లయిన ఏడేళ్లలోపు ఎవరైనా మహిళ అత్తగారింట్లో అసహజ రీతిలో మరణిస్తే ఆమెపై కట్నం కోసం వేధింపులు జరిగినట్లు ఆధారాలు ఉన్నట్లయితే దానిని 'వరకట్న హత్య'గానే పరిగణించవచ్చుని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇలాంటి తీవ్రమైన కేసుల్లో సదరు మహిళ మృతికి భర్త లేదా అత్తింటి వారి ప్రమేయానికి సంబంధించి ప్రత్యక్ష సాక్ష్యాలు గానీ, ఆధారాలు గానీ ప్రత్యేకంగా చూపించాల్సిన అవసరం లేదని ధర్మాసనం



వ్యాఖ్యానించింది. వరకట్న హత్యకు సంబంధించిన ఒక అప్పీలు పిటిషన్‌పై విచారణ జరుపుతున్న సందర్భంగా అలహాబాద్ హైకోర్టు ఈ కీలకమైన విషయాలను వెల్లడించింది. 2010లో ఓ మహిళ అత్తగారింట్లోనే అనుమానాస్పద స్థితిలో మరణించింది. అయితే అది పూర్తిగా వరకట్న హత్యేనంటూ పుట్టింటి వాళ్లు ఆమె భర్త సందీప్ సింగ్ హోరాపై కేసు పెట్టారు. ఈక్రమంలోనే విచారణ జరిపిన దిగువ కోర్టు అతడిని దోషిగా తేలుస్తూ 2018లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దీనిని సవాలు చేస్తూ అతడు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాడు. అయితే బాధితురాలు తన అత్తగారింట్లోనే అనుమానాస్పద స్థితిలో అసహజ మరణానికి గురైందని, ఆమె మృతి వెనుక వరకట్న వేధింపుల కోణం ఉందని హైకోర్టు కూడా ప్రాథమికంగా అంగీకరించింది. అయితే ఈ కేసులో దిగువ కోర్టు విధించిన జీవిత ఖైదు శిక్షపై హైకోర్టు జడ్జి కీలకమైన అభిప్రా యాన్ని వ్యక్తం చేశారు. దోషిగా తేలిన భర్త సందీప్ సింగ్ హోరాకు ఏకంగా యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించడానికి గల బలమైన కారణాలను లేదా ప్రత్యేకమైన పరిస్థితులను దిగువ కోర్టు తన తీర్పులో సహేతుకంగా పేర్కొన లేకపోయిందని జడ్జి అభిప్రాయపడ్డారు. చట్ట ప్రకారం అత్యంత అరుదైన కేసుల్లో మాత్రమే జీవిత ఖైదు లేదా యావజ్జీవ కఠిన కారాగారాన్ని విధించాల్సి ఉంటుందని కోర్టు తెలిపింది. అం తేకాకుండా ఈ ఘటన జరిగి 16యేళ్లు కావడం, నిందితుడి వయస్సు ప్రస్తుతం దాదాపు 40 యేళ్లకు చేరడం, గడచిన 7యేళ్లకు పైగా అతడు జైలులోనే గడపడం, అలాగే అతడి ప్రవర్తనపై ఎలాంటి ప్రతికూల నివేదికలు లేకపోవడాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ క్రమంలోనే హైకోర్టు నిందితుడి జీవిత ఖైదు ను 10యేళ్లకు తగ్గిస్తూ ఇప్పటికే అనుభవించిన జైలు కాలాన్ని అందులో మినహాయించాలని ఆదే శించింది. అయితే ఐపిసి సెక్షన్లు 498ఎ, 406, వరకట్న నిరోధక చట్టంలోని సెక్షన్లు 3, 4 కింద అతడిపై ఉన్న దోష నిర్ధారణను హైకోర్టు మార్చ కుండా యథాతథంగా ఉంచింది.

# బెయిల్ కోసం క్షుద్రపూజలు

## ఛత్తీస్‌గఢ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఫొటోతో 'తంత్ర పూజ'

### నిందితుడు అరెస్ట్, ఫొటో, నిమ్మకాయలు, కుంకుమ, చేప స్వాధీనం



**రాయ్‌పూర్, ఆగస్టు 9:** ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఫొటోను ఉపయోగించి 'తంత్ర పూజ' నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని బిలాస్‌పూర్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తన బంధువుకు బెయిల్ ఇప్పించే ప్రయత్నంలో భాగంగా అతను ఈ పని చేసినట్లు అధికారులు తెలిపారు. శనివారం మధ్య రాత్రి వేళ సిపాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవ్రి గ్రామంలోని శ్మశానవాటికలో ఈ ఘటన జరిగింది. నిందితుడిని రిషికేశ్ కుమార్‌గా గుర్తించారు. అతను మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి ఈ పూజ నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి వేళ నలుగురు వ్యక్తులు అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడటం గమనించిన గ్రామస్తులు వారిని నిలదీశారు. ఆ తర్వాత ముగ్గురు వ్యక్తులు పారిపోగా, కుమార్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు బిలాస్‌పూర్ ఎస్పీ రజనీష్ సింగ్ తెలిపారు. విచారణలో, కత్తిపోట్ల కేసులో తన బంధువు ప్రియాన్షు బోలే మరికొందరితో కలిసి పోలీసుల అదుపులో ఉన్నాడని నిందితుడు పోలీసులకు చెప్పాడు. విచారణ కోసం కుమార్‌ను అదుపులోకి తీసుకున్న తర్వాత, పోలీ సులు శ్మశాన వాటిక నుండి పూజకు సంబంధించిన కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో చేప, నిమ్మకాయలు, కుంకుమ, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రమేష్ సిన్హా, మరో ఇద్దరు వ్యక్తుల ఫోటోలు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఫోటోలలో ఒకటి ప్రియాన్షు బోలేది కాగా, మరొకటి కత్తిపోట్ల కేసులోని బాధి తుడిది. శ్మశానవాటికకు వెళ్లే ముందు, బెయిల్ పొందడానికి పూజ చేయవచ్చుని చెప్పిన ఒక 'తంత్రిక' వీడియోను తాము చూశామని కుమార్ పోలీసులకు చెప్పాడు. ఈ వ్యవహారంలో తదుపరి విచారణ జరుగుతోందని ఎస్పీ పేర్కొన్నారు.

## రూ.40,185 కోట్ల పిఎంఎల్ఎ కేసులో

# ఆర్‌కామ్‌పై ఇడి చార్జిషీట్ దాఖలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:**మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద రిలయన్స్ కమ్యూ నికేషన్స్ లిమిటెడ్‌పై ఇడి అనుబంధ చార్జిషీట్‌ను ప్రత్యేక కోర్టులో దాఖలు చేసినట్లు ఆదివారం విడుదల చేసిన అధికారిక ప్రకటనలో పేర్కొంది. మార్చి 27నాటి మొదటి ప్రాసిక్యూషన్ ఫిర్యాదుకు కొనసాగింపుగా శనివారం ఈ అనుబంధ ప్రాసిక్యూషన్ ఫిర్యాదును దాఖలు చేశారు. రిల యన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్), రిలయన్స్ టెలికాం లిమిటెడ్ (ఆర్‌టిఎల్), గౌతమ్ భైలాల్ దోషి, సతీష్ సేథ్, అమితాబ్ ఝున్‌ఝున్‌వాలా, మరియు ఇతరులను పిఎంఎల్ఎ, 2002లోని సెక్షన్ 4 కింద శిక్షార్హమైన సెక్షన్ 3, సెక్షన్ 3తో కలిపి సెక్షన్ 70 కింద నేరాలకు నిందితులుగా చేర్చినట్లు ఆ ప్రకటన తెలిపింది. నేర కార్యకలాపాల ద్వారా వచ్చిన సొమ్మును రూ. 40,185.55కోట్లుగా నిర్ధారించారు. ఇది, రుణ గ్రహీత సంస్థలు కన్సార్టియం బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, బాండ్‌హోల్డర్లకు చెల్లించడంలో విఫలమైన మొత్తం బకాయి. నిధుల సమీకరణ, వినియోగం, దాచిపెట్టడం, ప్రదర్శించడంలో నిందితుల విభిన్న పాత్రలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో భాగంగా, 1 బిలియన్ డాలర్ల ఫారిన్ కరెన్సీ కన్వర్టిబుల్ బాండ్ల (ఎఫ్‌సిసిబి) ద్వారా వచ్చిన సొమ్మును తుది వినియోగానికి సంబంధించి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం కూడా ఉంది.

న్యాయ నిర్ణయాధికార సంస్థ జప్తు చేసి, ధ్రువీకరించిన రూ. 8,078.06 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేయాలని కోరారు. ఈ ఆస్తులలో న్యూఢిల్లీ, నవీ ముంబై, భువనేశ్వర్, చెన్నై, పుణెలలోని లీజు, స్థిరాస్తులు ఉన్నాయి.

# సంక్షిప్త వార్తలు

## సౌదీ అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి



**రియాద్, ఆగస్టు 9:** సౌదీ అరేబియాలోని జజాన్‌లో ఉన్న అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి చేసినట్లు హౌతీలు ప్రకటించారు. ఈ దాడికి తామే కారణమని హౌతీ సైనిక ప్రతినిధి బ్రిగేడి యర్ జనరల్ యహ్యా సరీ తెలిపారు. తమ గగనతలంలో సౌదీడ్రోన్ల చొరబాటుకు ప్రతిస్పం దనగానే దాడి చేసినట్లు వెల్లడించారు. సౌదీ 'మినిస్ట్రీ ఆఫ్ ఎనర్జీ' కూడా ఆదివారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం జరిగినట్లు ధ్రువీకరించింది. అయితే అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది.

## మమత కారుపై రాళ్లు రువ్విన నిరసనకారులు



**కోల్‌కత్తా, ఆగస్టు 9:** పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో మాజీ సీఎం, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రికి నిరసనసెగ ఎదురైంది. ఆమె ప్రయాణిస్తున్న కారుపై ఆందోళనకారులు దాడిచేశారు. తమపై గుర్తుతెలియని దుండగులు ఇటుకలు, రాళ్లతో దాడిచేశారని, ఈ దాడిలో ప్రాణాలు పోయేవే అని మమత ఆరోపించారు. ఈ దాడిని రాష్ట్ర బీజేపీ ఖండించింది. ఈ హింసాకాండలో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. పోలీస్ కస్టడీలో టీఎంసీ పార్టీ కార్యకర్త మరణించాడని ఆ పార్టీ బెంగాల్‌లో తీవ్ర నిరసన తెలుపుతోంది.

## బారామతి ఎయిర్‌ఫీల్డ్‌లోనే కుప్పకూలిన మరో విమానం



**బారామతి, ఆగస్టు 9:** మహారాష్ట్ర బారామతి ఎయిర్ ఫీల్డ్‌లో మరో విమానం కుప్పకూలింది. ఆది వారం ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన ట్రైనింగ్ విమానం రన్‌వే దాటి వెళ్లింది. మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదం జరిగిన 7 నెలల తర్వాత మరో ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనలో విమానం దెబ్బతిన్నప్పటికీ, పైలట్ సురక్షితంగా బయట పడ్డాడు. ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

## బియ్యం స్కాంలో బిజెపి సర్కార్: సౌరభ్ భరద్వాజ్




**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వంపై ఆమ్ ఆద్మీ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. రూ.22,000 కోట్ల విలువైన రైస్ స్కాంకు బీజేపీ ప్రభుత్వం సిద్ధమైందని ఆరోపించింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ ఈ మేరకు ఎక్స్ ఖాతాలో ఆదివారం దీనికి సంబంధించిన ఆరోపణలు చేశారు. పేదప్రజలకు అందించాల్సిన బియ్యాన్ని, దారి మళ్లించి, భారీ స్కాంకు బీజేపీ సర్కార్ తెరతీసిందని విమర్శించారు.

## నకిలీ గుర్తింపులతో 25 పెళ్లిళ్లు: బిజెపి ఎమ్మెల్యే ఆక్రోశం



**లక్నో,ఆగస్టు 9:** నకిలీ గుర్తింపులతో 25 వివాహాలు చేసుకుని అనేక మంది మహిళలను మోసం చేసిన ఒక వ్యక్తికి తన కుమార్తెను ఇచ్చి వివాహం చేసేలా తమను మోసగించారని బీజేపీ ఎమ్మెల్యే ఆరోపించారు. ఆయన ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. కేసు నమోదు చేయడంతో పాటు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని సేవత నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే జ్ఞాన్ తివారీ ఆగస్ట్ 6న సోషల్ మీడియాలో ఒక వీడియోను పోస్ట్ చేశారు. 2024లో మిశ్రిఖ్‌లోని చంద్రవాల్ ప్రాంతానికి చెందిన అనుజ్ త్రివేది కుమారుడు ప్రఖర్ త్రివేదితో తన కుమార్తె ప్రజ్ఞ పెళ్లి జరిగినట్లు తెలిపారు.

## ఉధృతమవుతున్న కెనడా కార్చిచ్చు



**టొరంటో, ఆగస్టు 9:** కెనడాలో కార్చిచ్చు విజృంభిస్తోంది. దీంతో కెనడా ప్రభుత్వం బ్రిటీష్ కొలంబియాలో ఎమర్జెన్సీ ప్రకటించింది. ఈ ప్రాంతంలోని 20వేల మందిని సురక్షిత ప్రాంతాలకు వెంటనే తరలివెళ్లాలని ఆదేశించింది. బాధితుల్ని రక్షించే సహాయక చర్యల్ని కొనసాగిస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 100 అడుగులు ఎత్తులో మంటలు ఎగసిపడుతున్నాయి.

MN 10 final:MN 10 final 01/01/2001 09:18 Page 1



## యువతకు అవకాశాలు.. గుంటూరు అభివృద్ధికి మరో అడుగు

### హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు

**గుంటూరు విద్య, ఆగస్టు 9 ప్రభాతవార్త :** వ్యాపార ఉపాధి రంగాలలో యువతకు అవకాశాలు కల్పించడం ద్వారా గుంటూరు అభివృద్ధికి మరో అడుగు పడుతుందని బిజెపి రాష్ట్ర నాయకులు హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అన్నారు. బండ్లమూడి గార్డెన్స్ లో జరుగుతున్న



బీ2 ఎక్స్పో-2026 కార్యక్రమంలో భాగంగా జూపూడి రంగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు . ఎక్స్పోలో భాగంగా వ్యాపార ప్రదర్శనలు, పారిశ్రామిక చర్చలకు మాత్రమే పరిమితం కాకుండా.. సమాజ సేవకు తమ జీవితాలను అంకితం చేసిన మహనీయులను స్మరించుకోవడం ద్వారా బీ2 ఎక్స్పో నిర్వాహకులు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆగస్టు 7, 8, 9 తేదీల్లో నిర్వహించిన ఈ ఎక్స్పో చివరి రోజు కార్యక్రమం అధ్యక్షుడు కొమ్మమూరు శ్రీధర్ బాబు, కార్యదర్శి భీమవరపు హేమంత్ కుమార్, కన్వీనర్ రవిశంకర్ ఆధ్వర్యంలో జరిగింది. ..ఈ ధృతి బీ2 ఎక్స్పో కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ,హిందూ ఫార్మసీ కాలేజ్ చైర్మన్ జూపూడి రంగరాజు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఎక్స్పో ద్వారా గుంటూరులోని పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, చిన్న మరియు మధ్యతరహా సంస్థలకు తమ ఉత్పత్తులు, సేవలను పరిచయం చేసుకునేందుకు మంచి వేదిక లభించింది. స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించడం యువతలో వ్యాపార ఆలోచనలను పెంచడం కొత్త అవకాశాలు, ఉపాధిని సృష్టించడం గుంటూరును మరింత ఆర్థికంగా బలోపేతం చేయడం లక్ష్యాల్లో భాగం. ఇలాంటి కార్యక్రమాలు రాబోవు రోజుల్లో మరిన్ని జరగాలని, గుంటూరులోని వ్యాపారవేత్తలు, మహిళా పారిశ్రామికవేత్తలు, యువ ఎంటర్ప్రెన్యూర్లు మరింతగా ఎదగాలని కోరుకుంటున్నామని తెలిపారు... వ్యాపారానికి వేదిక సేవకు విలువ... మూడు రోజుల బీ2 ఎక్స్పో ముగింపు రోజున నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా వ్యాపారం, పారిశ్రామిక అభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని నిర్వాహకులు చాటి చెప్పారు. వ్యాపార విజయాన్ని మాత్రమే కాకుండా సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఆలోచన కూడా పారిశ్రామికవేత్తలు, యువతలో పెరగాలని ఈ కార్యక్రమం ద్వారా నిర్వాహకులు సందేశాన్ని అందించారు. ..శ్రీధర్ బాబు హేమంత్ సారథ్యంలో ప్రారంభమైన బీ2 ఎక్స్పో చివరి రోజు కార్యక్రమంలో.. కన్వీనర్ రవిశంకర్ ఏవి రమణమూర్తి వీరకుమార్ బద్రి కోటేశ్వరరావు బ్లూ క్రాస్ కుమార్ డాక్టర్ రమణ అన్నంరాజు వంశీ ఇతర కమిటీ సభ్యులు మరియు డాక్టర్ కాకాని పృథ్వీరాజు డాక్టర్ విజయభాస్కర్ సుందర్ రామశర్మ, బైరిశెట్టి మల్లికార్జునరావు, డాక్టర్ దీవి జయరాం ఎల్చురి వెంకటేశ్వర్లు ఆడిటర్ బ్రహ్మం ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## న్యాయపోరాటంలో నెగ్గలేనని తెలిసే..

### జగన్ వీధిపోరాటాలతో రాజకీయ డ్రామా మొదలెట్టాడు : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఆగస్టు 9 ప్రభాతవార్త :** న్యాయస్థానాలు చీవాట్లు పెట్టినా... ప్రభుత్వం, అధికారులు స్పష్టమైన వివరణ ఇచ్చినా మెగా డీఎస్సీపై జగన్ వైఖరి పాడిందే పాటరా అన్నతీరుగా ఉంది. జగన్ మెగా డీఎస్సీ అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకోసం వినియోగించుకుంటూ, యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాడు. నిరసన దీక్షల పేరుతో ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించడం ముమ్మాటికీ వైసీపీ రాజకీయ డ్రామానే. న్యాయపోరాటాలు చేయడానికి సరైన ఆధారాలు లేనందునే జగన్.. వైసీపీ నేతలు చివరకు వీధిపోరాటాలకు దిగారు. రాష్ట్ర యువత జీవితాలు బాగుపడటం.. వారికి బంగారు భవిష్యత్ లభించడం జగన్ కు ఏ కోశానా ఇష్టం లేదు. తాను అధికారంలో ఉన్నప్పుడు జాబ్ క్యాలెండర్ , మెగా డీఎస్సీ పేరుతో యువతని మోసగించిన జగన్... చివరకు గంజాయి, మాదకద్రవ్యాలకు బానిసల్ని చేశాడు. ప్రపంచం గర్వించే ఏపీ యువత మేథస్సును, నాలుగ్గోడల్లో మగ్గిపోయేలా చేశాడు. యువతలో చైతన్యం ఉంటే... తన అవినీతి పాలన సాగదన్న దురాలోచనతోనే జగన్, వారి జీవితాల్ని మత్తులో ముంచేశాడు. డీఎస్సీలో అర్హులకు అన్యాయం జరిగిందంటున్న జగన్... వారి పక్షాన అసెంబ్లీలో మాట్లాడగలడా? చంద్రబాబు, లోకేశ్ లు పెట్టుబడులు, ఉద్యోగ నోటిఫికేషన్లతో యువతకు మంచి భవిష్యత్ అందించే ఆలోచనలు చేస్తుంటే... జగన్ వారిని రాజకీయపావులుగా వాడుకోవాలని చూస్తున్నాడు. చంద్రబాబు ఏఐ, క్వాంటమ్ రంగాల్లో రాష్ట్ర యువతకు శిక్షణ అందిస్తుంటే... జగన్ వారి చేతికి గొడ్డళ్ళు, కత్తులిచ్చి రప్పా రప్పా రాజకీయం



చేయించేందుకు ఆరాటపడుతున్నాడు. ఆకలి, అవసరాల కోసం ఏపీ యువత ఎప్పుడూ తన మోచేతి నీళ్లు తాగుతూ, తన కింద బతకాలన్నదే జగన్ దుర్మార్గపు ఆలోచన. పారదర్శకంగా జరిగిన మెగా డీఎస్సీలో అక్రమాలని గగ్గోలు పెట్టడం. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల్ని అడ్డుకోవడం, పెట్టుబడిదారులకు తప్పుడు సమాచారమివ్వడం వంటి జగన్ దుశ్చర్యలు దానిలో భాగమే. కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో తప్పులు జరిగాయి.. అర్హులకు అన్యాయం జరిగిందని నిరూపించే ఆధారాలుంటే.. జగన్ వాటిని అసెంబ్లీలో బహిర్గతం చేయాలి. ఎంపిక చేసుకున్న మీడియా ముందు ప్రభుత్వంపై బురద జల్లకుండా.. చట్టసభలో గొంతెత్తి.. వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలి." అని ప్రత్తిపాటి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## వైద్యరంగంలో నూతన అధ్యాయానికి రోబోటిక్ శస్త్రచికిత్సలు

### క్లిష్టమైన శస్త్రచికిత్సలను సైతం సులభంగా నిర్వహించే అవకాశం..

**గుంటూరు మెడికల్, ఆగస్టు 9 (ప్రభాత వార్త):** వైద్యరంగంలో రోబోటిక్ శస్త్రచికిత్సలు నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టాయని, కొంత ఆర్థిక భారం ఉన్నప్పటికీ వైద్యులు, రోగులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని హైదరాబాద్ యశోద ఆసుపత్రుల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ వై. శ్రీమన్నారాయణ తెలిపారు. శనివారం సాయంత్రం జీఎంఏ హాల్లో ఐఎంఏ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరంతర వైద్య విద్యా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రోబో సహకారంతో అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలను సైతం సులభంగా, సమర్థవంతంగా నిర్వహించవచ్చున్నారు. క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ వై. యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశం ఉందన్నారు. కొన్ని రకాల క్యాన్సర్లలో శస్త్రచికిత్సతో పాటు మందులు, హార్మోన్, రోగనిరోధక చికిత్సలు మెరుగైన ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. యశోద ఆసుపత్రుల



మూత్రవ్యవస్థ నిపుణులు డాక్టర్ ఆమంచర్ల కౌశిక్ మాట్లాడుతూ మూత్రాశయం, మూత్రపిండాలు, ప్రోస్టేట్ శస్త్రచికిత్సల్లో రోబోటిక్ విధానం ఎంతో ఉపయోగకరమన్నారు. క్లిష్టమైన ప్రాంతాల్లోనూ రోబో సహాయంతో ఖచ్చితత్వంతో శస్త్రచికిత్సలు నిర్వహించవచ్చున్నారు. కార్యక్రమానికి ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షులు డాక్టర్ టి. సేవకుమార్ అధ్యక్షత వహించారు. అనంతరం వక్తలకు ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ ఉపాధ్యక్షులు డాక్టర్ మోపర్తి శివప్రసాద్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ సి. హెచ్. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి గరుడ అవార్డు పోటీలకు ఎంపికైన గోరంట్ల శింగర కొండయ్య చౌదరి

**చిలకలూరిపేట,ఆగస్టు 9 ప్రభాతవార్త :** తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో నిర్వహించు టీటీడీ సాంస్కృతిక విభాగం అయిన శ్రీ వెంకటేశ్వర నాట్య కళా పరిషత్ మరియూ ధర్మప్రచార పరిషత్ వారి సౌజన్యంతో ప్రతీ ఏటా నిర్వహించే ప్రతిష్టాత్మక జాతీయ గరుడ అవార్డు పోటీలకు చిలకలూరిపేట నియోజకవర్గం కు చెందిన ప్రముఖ పౌరాణిక కళాకారుడు, రాష్ట్ర తెలుగుదేశం సాంస్కృతిక విభాగం కార్యదర్శి అయిన గోరంట్ల శింగర కొండయ్య చౌదరి మరోమారు ఎంపిక కావడం జరిగింది. సోమవారం తిరుపతి పట్టణంలోని మహతి ఆడిటరియంలో జరగనున్న ఈ పోటీలలో శ్రీ కృష్ణ మహాప్రస్థానం లోని శ్రీ కృష్ణుడి ఏకపాత్రాభినయాన్ని శింగర కొండయ్య అభినయించనున్నారు. ప్రతిష్టాత్మక గరుడ అవార్డు పోటీలకు శింగర కొండయ్య ఎంపిక కావడం పట్ల నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయాలు, మాజీ మంత్రివర్యులు, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు, చిట్టిపోతు మస్తానయ్య, పేర్ని వీరనారాయణ, తేలప్రోలు వీరయ్య చౌదరి, బొల్లేపల్లి సత్యనారాయణ తదితరులు తమ హర్షాన్ని వ్యక్తం చేయడం జరిగింది.



## సంక్షేమం,అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**చిలకలూరిపేట,ఆగస్టు 9 ప్రభాతవార్త :**
చిలకలూరిపేట మండలం, పసుమర్రు:చిలకలూరిపేట మండలంలోని పసుమర్రు గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రెండేళ్ల పాలన కార్యక్రమాన్ని ఘనంగా



నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఆడక స్వాములు గారు, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు గారు, చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా గారు, చిలకలూరిపేట మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్ గారు, కో క్లస్టర్ ఇంచార్జీ గద్దె పున్నయ్య చౌదరి గారు, క్లస్టర్ ఇంచార్జీ గంజి శ్రీనివాసరావు గారు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బడుగు జాకబ్ రాజు గారు, యూనిట్ ఇంచార్జీ చెన్నంశెట్టి సాంబశివరావు గారు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జాలాది సుబ్బారావు గారు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొడవలి శ్రీనివాసరావు గారు, పార్టీ నాయకులు గడిపూడి దశరథ రామయ్య గారు, మర్రి శ్రీనివాసరావు గారు, పాలడుగు రమేష్ గారు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ పాలన సాగుతోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలకు తిరిగి ఊపిరి పోసి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుకుంటూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. పేదలు, రైతులు, మహిళలు, యువత, వృద్ధులు, ఉద్యోగులు, కార్మికులు ఇలా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర, సాగుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు."ప్రజల ప్రభుత్వం-ప్రజల కోసం పాలన" అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని నాయకులు అన్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కార మార్గాలు చూపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లోనే ఉంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మూత్రపిండాలు,మూత్రనాళాల సమస్యలను నిరక్ష్యం చేయొద్దు

### కాలేయం, పిత్తాశయం, ప్యాంక్రియాస్ వ్యాధులకు ఆధునిక శస్త్రచికిత్సలతో మెరుగైన ఫలితాలు

### గుంటూరులో యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ యూనిట్ వైద్య నిపుణుల మీడియా సమావేశం..

**గుంటూరు మెడికల్, ఆగస్టు9 (ప్రభాతవార్త)**
మూత్రపిండాలు, మూత్రనాళాలు, మూత్రాశయం, కాలేయం, పిత్తాశయం, క్లోమం, జీర్ణాశయానికి సంబంధించిన వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ యూనిట్ వైద్య నిపుణులు తెలిపారు. గుంటూరులో



నిర్వహించిన మీడియా సమావేశంలో యూరాలజిస్ట్ డాక్టర్ కౌశిక్ అమంచర్ల, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వై. శ్రీమన్నారాయణ మాట్లాడారు.

మూత్రపిండాల సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించాలి – డాక్టర్ కౌశిక్ అమంచర్లమధుమేహం, అధిక రక్తపోటు, తగినంత నీరు తీసుకోకపోవడం, మారుతున్న జీవనశైలి కారణంగా మూత్రపిండాల సమస్యలు పెరుగుతున్నాయని డాక్టర్ కౌశిక్ అమంచర్ల తెలిపారు. మూత్రం పోసేటప్పుడు మంట, నొప్పి, తరచూ మూత్రం రావడం, మూత్రంలో రక్తం, నడుము లేదా పొత్తికడుపులో నొప్పి వంటి లక్షణాలను నిరక్ష్యం చేయరాదన్నారు. మూత్రపిండాల్లో రాళ్లు, ప్రోస్టేట్ సమస్యలకు ప్రారంభ దశలోనే చికిత్స తీసుకోవాలని సూచించారు. తగినంత నీరు తాగడం, ఉప్పు తగ్గించడం, మధుమేహం, రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలని తెలిపారు.

**కాలేయం, పిత్తాశయం, ప్యాంక్రియాస్ వ్యాధులకు ఆధునిక శస్త్రచికిత్సలు – డాక్టర్ వై. శ్రీమన్నారాయణ**

కాలేయం, పిత్తాశయం, పిత్తనాళాలు, క్లోమం, కడుపు, పేగులకు సంబంధించిన క్లిష్ట వ్యాధులకు ఆధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ వై. శ్రీమన్నారాయణ తెలిపారు. కడుపునొప్పి, అజీర్ణం, కామెర్లు, అకారణంగా బరువు తగ్గడం, మలంలో రక్తం వంటి లక్షణాలను నిరక్ష్యం చేయకూడదన్నారు.

కాలేయం, పిత్తాశయం, క్లోమం, జీర్ణాశయ క్యాన్సర్లను ప్రారంభ దశలో గుర్తించడం కీలకమన్నారు. ఆధునిక చిన్న కోతల శస్త్రచికిత్సలతో నొప్పి, ఆసుపత్రిలో ఉండే సమయం తగ్గుతుందని వివరించారు. ప్రారంభ లక్షణాలను నిరక్ష్యం చేయకండిమధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం ఉన్నవారు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులు సూచించారు. సమతుల్య ఆహారం, వ్యాయామం, తగినంత నీరు తీసుకోవడంతో పాటు పొగాకు, మద్యపానానికి దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ హెడ్ వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా ఉండండి : మర్రి రాజశేఖర్

**చిలకలూరిపేట,ఆగస్టు 9 ప్రభాతవార్త :**
గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య చివరి సమావేశం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్ నందు ఈరోజు జరిగింది. ఈ సమావేశానికి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి కత్తెర హెని క్రిస్టినా సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్



మాట్లాడుతూ వర్షాలు లేనప్పుడు అధికారులను మీరు చెప్పండి రైతులకు అండగా ఉండండి ఏ పైరు వేసుకోవాలో మీరే చెప్పండి అని అడుగుతారని, అదే అధికారులు డి ఏ పి, యూరియా అధికంగా వాడవద్దు అంటే అదేమో మీరు వినరు రైతులకు చెప్పరు అని జడ్పీటీసీ లపై ఆగ్రహించారు .రైతాంగానికి వర్షాలు పడటం లేదు కాబట్టి ఉన్న నీళ్ళని సర్దుకొని ఎలా వాడుకోవాలి అనే చర్చ ఇక్కడ ఉండాలి తప్ప గవర్నమెంట్ ఘోరమైన ప్రామిస్ చేసింది ఆయకట్టు వేసుకోండి అని నీళ్ల ఇస్తాం అని చెప్పి ఇవ్వడం లేదు అని విమర్శించడం సరికాదు అన్నారు. వర్షాలు పట్టడం లేదు కాబట్టి అందుకు ప్రత్యామ్నాయంగా ఏం చేయాలో అది ఇక్కడ చర్చించాలి అన్నారు . వర్షాలు పడకుండా పండే పంటలు ఏమైనా మీరు మీ జీవితకాలంలో చూసి ఉంటే చెప్పండని,నేను ఇప్పటివరకు అలాంటివి చూడలేదు అని అన్నారు. ఇప్పుడు పైనుండి నీళ్ల వస్తున్నాయి అవి త్రాగడానికి, దాచుకోవడానికి మాత్రమే పనికి వస్తాయని అనే విషయం జిల్లా పరిషత్ సమావేశం నుండి ఈ సమాచారం రైతులకు వెళ్ళాలని అన్నారు. వర్షాలు పడడం లేదు ఉన్న నీళ్ల పులిచింత నీళ్ల గాని, నాగార్జునసాగర్ నీళ్ళు గాని, లేదా శ్రీశైలం నీళ్ళు గాని త్రాగడానికి మాత్రమే సరిపోతాయని సాగు చేసుకోవడానికి నీళ్ల చాలవు అనే విషయం తెలియజేయాలన్నారు . గోదావరి నీళ్ల వస్తున్నాయి కాబట్టి కృష్ణా డెల్టా రైతులకు అక్కడ నీళ్ల అందుతున్నాయని మన దగ్గర మాత్రం నాగార్జునసాగర్ నుండి ఏమి నీళ్ల ఇచ్చే పరిస్థితి అయితే ప్రస్తుతం లేదని అన్నారు. ఈ విషయం గురించి రైతులకు వరి పంట వేయవద్దని వేస్తే నష్టపోతారని వర్షాలు పడితే మెట్ట పైర్లు వేసుకోండని వారిని చైతన్యవంతులు అయ్యేలా సందేశం ఇవ్వాలని అన్నారు .ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇంతకు తప్పి చేయగలిగింది ఏమీ లేదని రైతులకు తెలియజేయాలి. ఈ సంవత్సరం వర్షాలు లేవు కాబట్టి నీళ్ళు వదిలే పరిస్థితి అయితే లేదు అని చెప్పే సందేశం రైతులకి స్పష్టంగా తెలియజేయాలి అని అన్నారు. వర్షాలు సమృద్ధిగా పడినట్లయితే రైతులు వేసే పంటలకు అవసరమయ్యే ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని కలెక్టర్ గారు కూడా తెలియజేశారని అందుకోసం ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా సర్వసభ్య సమావేశం ఇదే చివరిది జడ్పీటీసీలుగా ఎన్నికై 5 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా తమ పదవి కాలం పూర్తి చేసుకుంటున్న జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీమతి హెని క్రిస్టీనా గారికి మరియు జడ్పిటిసి లకు అభినందనలు తెలియజేసారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ గారు, బాపట్ల పార్లమెంట్ సభ్యులు కృష్ణ ప్రసాద్ ,వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనంద్ బాబు, సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ,జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లిఖార్జున రావు , జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతి బసు ,జడ్పీటీసీలు మరియు మూడు జిల్లాలలోని అన్ని విభాగాల ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## అవగాహనలో..

## "క్విట్ ఇండియా డే" కార్యక్రమం

**గుంటూరు కల్చరల్,ఆగస్టు 9,ప్రభాతవార్త :** దేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో క్విట్ ఇండియా ఉద్యమం జాతికి స్ఫూర్తి నిచ్చిన మహోజ్వాల ఘట్టమని ఉద్యమ నాయకులందరినీ బ్రిటిష్ ప్రభుత్వం నిర్బంధించడంతో ప్రజలై సారథులై పోరాట యోధులై ఈ ఉద్యమాన్ని నిర్వహించటం జరిగిందని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన క్విట్ ఇండియా డే కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడారు. అవగాహన సంస్థ కార్యాలయంలో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తి అన్న అంశంపై పాల్గొన్నవారు మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ మాకు స్వాతంత్ర్యం ప్రకటించి మీరు మీ దేశానికి వెళ్ళిపోండి అంటూ భారతీయులు 1942ఆగస్టు 8న క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం తర్వాత భారతీయుల్లో పెల్లుబీకిన స్వాతంత్ర కాంక్షను గుర్తించిన పాలకులు భారత దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వక తప్పలేదన్నారు. ప్రముఖ కవి బండికల్లు జమదగ్ని మాట్లాడుతూ విజయమో వీరస్వర్గమో అంటూ గాంధీజి ఇచ్చిన పిలుపుతో ప్రారంభమైన ఉద్యమం ఆగస్టు 9నుంచి ఉధృతంగా దేశం మొత్తం నిర్వహించబడి స్వాతంత్ర్యం సాధించిందన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త చంద్రయ్య, విశ్లేషకులు ఎన్. సదాశివమ్ తదితరులు ప్రసంగించారు.

## శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ లో ముగిసిన " శ్రీ మహా ధన్వంతరి హోమం "

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 9 ( ప్రభాత వార్త ) :** గుంటూరు నగర సమీపంలోని గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద ఉన్న శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ లో " శ్రీ మహా ధన్వంతరి హోమం" ఘనంగా నిర్వహించారు.. శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఎండి చైర్మన్ శ్రీ కొండా వెంకటేశ్వర్లు ఈ హోమం భక్తి, శ్రద్ధలతో పూర్తి చేశారు. ధన్వంతరీ హోమం అనేది ఆయుర్వేద వైద్యానికి ఆధిదేవత, శ్రీ మహావిష్ణువు అవతారమైన ధన్వంతరి అనుగ్రహం కోసం చేసే పవిత్రమైన యజ్ఞం. దీర్ఘకాలిక రోగాలు తగ్గడానికి, శరీరంలో రోగ నిరోధక శక్తి పెరగడానికి, మానసిక ప్రశాంతతకు, ఆయురారోగ్యాల ప్రాప్తికి ఈ హోమం అత్యంత శక్తివంతమైనదిగా భావిస్తారని తెలిపారు. దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్నవారు త్వరగా కోలుకోవడానికి ఈ హోమం చేస్తారని, హోమంలో ప్రత్యేకమైన దివ్య ఔషధ మూలికలను సమర్పిస్తారని, దీనివలన వెలువడే ధూమ ప్రభావం గాలిలోని రుగ్మతలను తొలగించి సానుకూల శక్తిని ఇస్తుందని వెల్లడించారు. ఈ హోమంలో ముఖ్య అతిథులుగా ఎంపీ శ్రీ



భాష్యం రామకృష్ణ రాజ్యసభ సభ్యులు డాక్టర్ సి ఎల్ వెంకట్రావు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యులు శ్రీ బొల్లేపల్లి సత్యనారాయణ గారు భారతి ధార్మిక పరిషత్ అధ్యక్షులు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## పెన్షన్ వ్యాలిడేషన్ క్లాజ్ ను రద్దు చేయాలి

### సీ.బీ.ఐ.సీ పెన్షనర్స్ అసోసియేషన్ ఏ. పి అధ్యక్షుడు టి. వివేకానంద

**గుంటూరు లీగల్,ఆగస్టు 9, (ప్రభాతవార్త ) :** కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల హక్కులను కాలరాసే చర్యలు చేపట్టిందని, దానిని వెంటనే విరమించుకోవాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్స్ స్ అండ్ కస్టమ్స్ (సీ.బీ.ఐ.సీ) పెన్షనర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు టి. వివేకానంద డిమాండ్ చేసారు. ఆదివారం గుంటూరు కన్నవారితోటలోని జీఎస్టీ భవన్ లో ఎనిమిదవ వేతన సంఘం సమస్యలపై ఏ.పి లోని పలు



ప్రాంతాల పెన్షనర్ల సంఘం ప్రతినిధులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు టి. వివేకానంద మాట్లాడుతూ.. పెన్షనర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించే పెన్షన్ వ్యాలిడేషన్ యాక్ట్ ను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం పెన్షన్ చట్టం మూలాలకు సవరణలు తెస్తుందని, పెన్షనర్ల మధ్య పాత, కొత్త విభేదాలు సృష్టిస్తుందన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు బి. రాజేశ్వరరావు మాట్లాడుతూ..ఎనిమిదవ వేతన కమిషన్ పెన్షనర్ల కు మేలు జరిగేలా ఉండాలన్నారు. లోపాలన్ని సవరించాలన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసిన అదనపు పెన్షన్ ను ప్రభుత్వం వెంటనే ఆమోదించాలన్నారు. సంఘం జాయింట్ సెక్రటరీ పి. వి. సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎనిమిదవ వేతన కమిషన్ ఆలస్యం నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ఐ. ఆర్ ను విడుదల చేయాలని, యాభై శాతం డి. ఎ ను బేసిక్ పెన్షన్ లో విలీనం చేయాలని డిమాండ్ చేసారు. డిమాండ్ల ను ప్రభుత్వం అమలు చేయని పక్షంలో పోరాటానికి సిద్ధమవ్వాలని సమావేశం తీర్మానించింది ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ప్రతినిధులు గుమ్మడి సీతారామయ్యచౌదరి, పి. కోటేశ్వరరావు, ఎన్. ఎస్. నగేష్ బాబు, కె. సాంబ్రాజ్యం, డి. మధు బాబు, షేక్ మస్తాన్, బి.ఎల్. ఆదినారాయణ, ఎన్. ప్రకాష్ బాబు, పూర్ణచంద్రరావు, ఆషా, ఈశ్వరమ్మ, నాగశంకర్, నంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి తాడేపల్లి మండల అధ్యక్షునిగా కనసాని శ్రీనివాసరావు

**తాడేపల్లి, ఆగస్టు 9, ప్రభాతవార్త**
భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు ఆదివారం గుంటూరు జిల్లాలోని మంగళగిరి నియోజకవర్గంలో తాడేపల్లి రూరల్ మండల అధ్యక్షునిగా కనసాని శ్రీనివాసరావు నియమించారు. భారతీయ జనతా పార్టీని తాడేపల్లి మండలంలో



బలోపేతం చేస్తూ కార్యకర్తలను కలుపుకొని వెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కార్యదర్శి, మంగళగిరి నియోజకవర్గ బి ఎల్ ఏ 1 పంచమర్తి ప్రసాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు తాడేపల్లి మండల ఇన్చార్జి టంకసాల ఈశ్వర్ నాయుడు , కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి వై వి సుబ్బారావు, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లూరు శివరామకృష్ణ, సుబ్బారావు, నాగార్జున, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా విప్రనారాయణ యక్షగానం

**గుంటూరు కల్చరల్,ఆగస్టు 9,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి వారి సౌజన్యంతో మూడు రోజుల నృత్యకిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ నిర్వహణలో కూచిపూడి నృత్యోత్సవాలు నిర్వహిస్తున్న క్రమంలో శ్రీసాయిమంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ, గుంటూరు, కళారత్న డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం దర్శకత్వంలో విజయ రాఘవనాయుడు రచించి, కుమార సూర్యనారాయణ సంగీత అందించిన విప్రనారాయణ చరితం యక్షగానం అద్భుత ప్రదర్శన ప్రేక్షకులను అబ్బురపరిచింది. తొలుత ప్రారంభోత్సవ సభలో మండలి వెంకట కృష్ణారావు, అధికార భాషా సంఘం అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పి. త్రివిక్రమరావు, ఆంధ్రసారస్వత పరిషత్, ఆంధ్రప్రదేశ్, అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్, ఆత్మీయ అతిథిగా డిఎస్పీ గుంటూరు గోలి లక్ష్మయ్య, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య, సహ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించి ప్రసంగించారు. సన్మానాలల్లో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం స్వీకరిస్తున్న సందర్భంగా కుమార సూర్యనారాయణను అతిథులు, సంస్థ వారు ఘనంగా సత్కరించి ప్రశంసించారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఆర్. ప్రభాకరరావు, నిర్వాహకులు పి. విజయకుమార్, కోశాధికారి కె. వి. సుబ్బారావు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## హార్మోన్ల సమతుల్యత వల్ల వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ నందిపాటి వెంకట సందీప్

**గుంటూరు కల్చరల్,ఆగస్టు 9,ప్రభాతవార్త :** స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన ఆరోగ్యసభలో హార్మోన్ల సమతుల్యత లోపం వల్ల వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యసభలో ప్రధాన వక్తగా హాజరైన ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ నందిపాటి వెంకట సందీప్ పాల్గొని ప్రసంగించారు. మధుమేహం వ్యాధి ఉన్నవారు ఎప్పుడైనా షుగర్ డౌన్ అయ్యే ప్రమాదం ఉన్నందున, షుగర్ స్థాయిని పెంచడానికి ఉపయోగపడే చాక్లెట్స్ దగ్గర ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యసభలో అవగాహన సంస్థ సభ్యులు షుగర్, థైరాయిడ్, హార్మోన్ల అసమతుల్యత వల్ల వచ్చే వ్యాధుల గురించి లేవనెత్తిన సందేహాలను డాక్టర్ నందిపాటి వెంకట సందీప్ నివృత్తి చేశారు. అనంతరం డాక్టర్ నందిపాటిని అవగాహన సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. సభకు టివి సాయిరామ్ కోఆర్డినేటర్ గా వ్యవహరించగా, సీనియర్ వైద్యులు డాక్టర్ పి. సుబ్బారెడ్డి, శాంతా కాలేజీ వ్యవస్థాపకులు శ్రీమన్నారాయణ, విద్యావేత్త ఈ. చంద్రయ్య, గాయత్రీ బ్యాంక్ రీజనల్ కోఆర్డినేటర్ టి. సుబ్బారావు లు పాల్గొని ప్రసంగించారు.



10-8Pg7exHMNWJQE_10-8Pg7exHMNWJQE.qxd 10/Aug/26 12:22 AM Page 1



# పునరావాసం కల్పించకుండా

## 'వెలిగొండ' నిర్వాసితులకు ఖాళీ చేయించొద్దు

● సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా గ్రామాల నుండి ఖాళీ చేయించే ప్రయత్నాలు మానుకోవాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేసారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పనులు 2026 ఆగస్టుకి పూర్తిచేసి సెప్టెంబర్ 1వ తేదీన ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేయబోతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందిదని ఇది హర్షణీయమే అయినప్పటికీ గతంలో ఇలాంటి గడువులు చాలా పెట్టి అమలు చేయకుండా ఆలస్యం చేశారు. ఇంకా చాలా పనులు అసంపూర్తిగా ఉన్నాయన్న వాస్తవాన్ని గుర్తించాలి. కృష్ణా జలాశయంలో నీళ్ళులేవు. వరదలొస్తే తప్ప నల్లమల సాగర్‌కు నీళ్ళివ్వలేరు. రిజర్వాయర్‌కు వదిలినా పంటకాల్వలు లేవు. ఈ పరిస్థితులను మరిచినీళ్ళు వదలాలనుకోవడం వివేకంకాదు. ఏదో సాధించామని గొప్పలు చెప్పుకోడానికి నిర్వాసితులను బలిచేయొద్దు. నిర్వాసితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. నిర్వాసితులందరికీ ఇళ్ళస్థలాలు కూడా ఇవ్వకుండా చెల్లించాల్సిన ప్యాకేజీ చెల్లించకుండానే ఆగస్టు నెలాఖరుకు గ్రామాలు ఖాళీ చేయాలన్న కలెక్టర్ మౌఖిక ఆదేశాలతో నిర్వాసితులు తీవ్రంగా ఆందోళన పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన ప్రకారం రూ.906 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు మూడోవంతు అంటే రూ.306కోట్లే చెల్లించారు. మిగతా పరిహారం ఇస్తామంటూ ఊరిస్తూ కాలయాపన చేస్తున్నారు. గ్రామనాయకులు, బాధిత ప్రజలు కలెక్టర్ గారిని కోరినా ముందు ఖాళీ చేయండి, సమయం లేదంటూ ఎక్కడైనా పరదాలు కట్టుకుని వెళ్ళాల్సిందే నంటూ గ్రామాలు ఖాళీ చేయాలని బలవంత పెడుతున్నారు. విద్యుత్ సైతం కట్ చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నది. అప్పటికి గ్రామాలు ఖాళీ చేయకపోతే క్రిమినల్ కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారు. ఇది చట్టవిరుద్ధమే కాదు అమానవీయం కూడా. భూసేకరణ చట్టాన్ని అనుసరించి అందరికీ పరిహారం చెల్లించిన అనంతరం కనీసంగా 6 నెలలు చట్ట ప్రకారం సమయం ఇవ్వాలి. బలవంతంగా ఖాళీ చేయించకూడదని సిపిఐ(యం) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నది.

# చైల్డ్ హోమ్ నుంచి బాలిక పరార్



**తిరుపతి(క్రైమ్), ఆగస్టు 9 ప్రభాతవార్త:** ప్రభుత్వ పరిరక్షణ బాలికల పాఠశాలలో చదువుకున్నటువంటి సాయి దుర్గ (15) హోమ్ నుండి ఆదివారం పరారైంది. ప్రభుత్వ బాలికల హోమ్ సూపరిండెంట్ సునీత కథనం మేరకు బాపట్ల జిల్లాకు చెందిన కూన సాయిదుర్గ(15) అనే బాలిక ఈ నెల ఒకటో తారీకు ఒంటరిగా ప్రయాణిస్తుండగా తిరుపతి శక్తి టీం గమనించి బాలికను అదుపులో తీసుకున్నారు. అనంతరం తిరుపతికి చెందిన ప్రభుత్వ పరిరక్షణ పాఠశాలలో చేర్పించారు. అయితే అక్కడ ఉండటం ఇష్టంలేని సాయిదుర్గ ఆదివారం ఉదయం హోమ్ నుండి పరారైంది. సమాచారం తెలుసుకున్న హోమ్ సూపర్డెంట్ వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి ఆ అమ్మాయి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.



# అమరావతిలో ఎఐ వర్సిటీ

● అత్యాధునిక క్వాంటమ్ కూడా.. ● ముందుకొచ్చిన 'నీలిట్' - రూ.731.7 కోట్లతో ఏర్పాటు ● ఈ సెప్టెంబరు నుంచే విద్యార్థులకు శిక్షణ ప్రారంభం

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధానిని క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్ తీర్చిదిద్దాలనే ఎపి ప్రభుత్వం ఆలోచనకు అనుగుణంగా అమరావతి ప్రాంతంలో మరో విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నీలిట్) సంస్థ రూ.731.7 కోట్లతో దేశంలోనే తొలి, అత్యాధునిక క్వాంటమ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యూనివర్సిటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. నిడమర్రు వద్ద నీలిట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 10 ఎకరాల భూమిని కేటాయించింది. వాస్తవానికి ఆ సంస్థ మొదట 19 ఎకరాలు కావాలని కోరింది. అయితే మంత్రివర్గ ఉపసంఘం పరిశీలించి 10 ఎకరాలకు ఆమోదం తెలిపింది. ఈ భూమిని 30యేళ్ల పాటు లీజుకు ఇస్తూ నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో అవసరాన్ని బట్టి ఈ లీజును మరో 30యేళ్లు పొడిగించే వెసులుబాటును కూడా కల్పించింది. అమరావతిలో నిర్మించే నీలిట్ క్యాంపస్ కోసం రూ.731.7 కోట్లను ఖర్చు చేయనున్నారు. సుమారు 5.1 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ భవనాలతో ఈ క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది ఆరంభంలో ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఈ ప్రాజెక్టుకు బీజం పడింది. ఆ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఎపి ప్రభుత్వం, నీలిట్ సంస్థల మధ్య కీలకమైన ఎంఓయు కుదిరింది. అనంతర క్రమంలో నిడమర్రులో నీలిట్ యూనివర్సిటీ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రధాన క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యే వరకు తరగతులు ఆగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఆరునెలలు కుడా తిరగకుండా నీలిట్‌ను అందుబాటులోకి తీసుకుని వస్తోంది. ఈ సెప్టెంబరు నెల నుంచే ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నీలిట్ తాత్కాలికంగా తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నీలిట్ అమరావతి క్యాంపస్‌ను ఒక 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'గా అభివృద్ధి చేయనున్నారు.

క్వాంటమ్, ఏఐ, సెమీ కండక్టర్ టెక్నాలజీల్లో ఇక్కడ అత్యుత్తమ శిక్షణ అందిస్తారు. ఈ క్యాంపస్‌లో పలు అత్యాధునిక కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్ అండ్ సెక్యూరిటీ, ఏఐ, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్ రంగాల్లో యుజి, పిజి, పిహెచ్‌డి, డిప్లొమా కోర్సులు ఆఫర్ చేస్తారు.

సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్, చిప్ డిజైన్, విఎల్ఎస్ఐ, ఎటిఎంపి, ఎంబెడెడ్ సిస్టమ్స్, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్‌లో ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తారు. విద్యార్థుల కోసం అత్యాధునిక పరిశోధనశాలలను నెలకొల్పుతారు. డీప్‌టెక్ రంగంలో స్టార్టప్‌లకు, ఇతర సంస్థలకు ఈ క్యాంపస్ అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తుంది. నీలిట్ పూర్తి స్వయంప్రతిపత్తి గల ప్రతిష్ఠాత్మక కేంద్ర శాస్త్ర సంస్థ. ఇది కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తుంది. దేశవ్యాప్తంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో నాణ్యమైన విద్య, నైపుణ్య శిక్షణ, పరీక్షల నిర్వహణ, సర్టిఫికేషన్ వంటి కార్యక్రమాలను ఇది ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుంది. నైపుణ్య శిక్షణలో దీనికి దేశవ్యాప్తంగా మంచి పేరుంది. ఇటీవల నీలిట్‌కు కేంద్ర విద్యాశాఖ 'డీమ్డ్ టు బి యూనివర్సిటీ' హోదా కూడా కల్పించింది.

# పారదర్శకంగా మెగా డిఎస్సీ నిర్వహణ

● రేయింబవళ్లు కష్టపడి చదివి టీచర్ ఉద్యోగాలు పొందిన నిరుద్యోగ యువత కష్టాన్ని తక్కువ చేసి చూపొద్దు: మంత్రి సవిత

**విజయవాడ, ఆగస్టు 9 ప్రభాతవార్త ప్రతినిధి:** మెగా డిఎస్సీని పారదర్శకంగా, అక్రమాలకు తావు లేకుండా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పకడ్బందీగా నిర్వహించారని రాష్ట్ర బిసి, ఇడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేసారు. డిఎస్సీలో అక్రమాలు జరిగాయనడం సరికాదు అన్నారు. రేయింబవళ్లు కష్టపడి చదివి టీచర్ ఉద్యోగాలు పొందిన నిరుద్యోగ యువత కష్టాన్ని తక్కువ చేసి చూపొద్దు అన్నారు. కర్నూలు కొండారెడ్డి బురుజు ఎక్కిన వారికి నీ తాడేపల్లి ప్యాలెస్ ఎక్కడం ఒక లెక్క కాదు అన్నారు. 'మెగా డిఎస్సీపై రోజంతా చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం' అని మంత్రి ఎస్.సవిత సవాల్ అన్నారు. సిఎం చంద్రబాబునాయుడు 14కు పైగా డిఎస్సీలు నిర్వహించి, రెండు లక్షల వరకూ టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశారు. ఏనాడూ అవినీతి, అక్రమాలకు తావులేకుండా డిఎస్సీలు నిర్వహించారన్నారు. ఐదేళ్లలో ఒక్క డిఎస్సీ కూడా నిర్వహించని అసమర్థుడు జగన్ రెడ్డి అని విమర్శించారు.

ఈ మేరకు ఆదివారం ఆమె ఒక వీడియో ప్రకటన చేశారు. డీఎస్సీ అంటేనే జగన్‌కు మొదటి నుంచి విషం కక్కుతున్నారన్నారు. నోటిఫికేషన్ రాగానే కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవాలని చూశారన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆ అడ్డంకులన్నింటినీ అధిగమించి, మెగా డిఎస్సీని అవినీతికి, అక్రమాలకు తావులేకుండా నిర్వహించారన్నారు. మెగా డిఎస్సీ ద్వారా 16వేల కుటుంబాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపుతుంటే, వారందరినీ గొడ్డలి పార్టీ అవమానిస్తోందని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఉన్నా, పోయినా టీచర్లను అవమానించడమే పనిగా పెట్టుకోవడం మానుకోవాలని హితవు పలికారు.



ఐదేళ్ల పాలనలో ఉపాధ్యాయులను అన్ని విధాలా జగన్ వేధించారని మంత్రి సవిత మండిపడ్డారు. చంద్రబాబునాయుడు 14 డిఎస్సీలు నిర్వహించారని, వాటి ద్వారా రెండు లక్షలకు పైగా టీచర్ ఉద్యోగాలు భర్తీ చేశారని మంత్రి సవిత గుర్తు చేశారు. ఏ డిఎస్సీలోనూ అక్రమాలకు తావులేకుండా, టీచర్ పోస్టులు భర్తీ చేశారన్నారు. 2025 మెగా డిస్సీపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని జగన్ కు హితవు పలికారు. డిఎస్సీ నిర్వహణపై ఎలాంటి అనుమానాలు ఉన్నా.. దమ్ము, ధైర్యం ఉంటే జగన్ అసెంబ్లీకి చర్చకు రావాలని అన్నారు. జగన్‌కు ఎంతసేపైనా మైక్ ఇచ్చి గౌరవంగా మాట్లాడిస్తామని, అవసరమైతే ఒక రోజంతా మెగా డిఎస్సీపై అసెంబ్లీ వేదికగా చర్చించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె స్పష్టం చేశారు. నీతి, నిజాయితీ, దమ్ము, ధైర్యం ఉంటే సభకు వచ్చి తేల్చుకోవాలని జగన్‌కు మంత్రి సవిత సవాల్ చేశారు. వైసిపి, జగన్ తప్పుడు ఆరోపణలపై రాయలసీమకు చెందిన ఉపాధ్యాయులంతా సమరశంఖం పూరించారన్నారు.

# 12న సంపూర్ణ సూర్యగ్రహణం

## 55 దేశాల్లో మాత్రమే దృశ్యమానం..

## రాత్రివేళ కావడంతో భారత్‌లో కనిపించదు

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ఈ నెల 12న బహుళ అమావాస్య రోజున సంపూర్ణ సూర్యగ్రహణం రూపంలో ఖగోళంలో మరో అద్భుతం ఆవిష్కృతం కానుంది. యూరప్, రష్యా, ఉత్తర అమెరికా సహా 55 దేశాల్లో ఎనిమిది గంటలకు పైగా కనువిందు చేయనున్న ఈ గ్రహణం ఒక్క స్పెయిన్, ఐస్‌లాండ్‌లో మాత్రమే సంపూర్ణంగా కనిపించనుంది. మిగతా దేశాల్లో పాక్షికంగానే కనిపించనుంది. భారత కాలమా నం ప్రకారం సాయంత్రం ఏడు గంటల సమయంలో గ్రహణం మొదలు కానుండగా సంపూర్ణ గ్రహణం రాత్రి 9.15 గంటల సమయంలో ఏ ర్పడనుంది. గరిష్ట కాలం రాత్రి 11.17 గంటలకు వుండనుంది. దీని తరువాత తెల్లవారుజామున 1.20 గంటలకు సంపూర్ణ దశ ముగింపు మొదలవనుంది. తెల్లవారుజామున 3.30 గంటలకు గ్రహణం ముగియనుంది. రాత్రి వేళలో సూర్య గ్రహణం ఏర్పడనుండడంతో భారత్‌లో ఇది కనించదు. ఐస్‌లాండ్, స్పెయిన్ దేశాల్లో సంపూర్ణ సూర్య గ్రహణాన్ని పూర్తిగా వీక్షించే అవకాశం వుండడంతో సూర్యుడిపై పరిశోధనలకు ఖగోళ శాస్త్రవేత్తలు ఆ దేశాలకు ముందుగానే పయనమయ్యారు. ఇక ఈ గ్రహణం భారత్‌లో ఎక్కడ కనిపించ నందున ఇక్కడ ఎలాంటి సూతకం లేదని, ఆలయాల మూసివేత వుండదని ఆగమన పండితులు చెబుతున్నారు. ఈ గ్రహణం కర్కాటక రాశిలోని అశ్లేషా నక్షత్రంలో కేతుగ్రస్త సూర్య గ్రహణంగా సంభవి స్తోంది. కర్కాటక రాశి వారు శాంతి పూజలు చేయాలని పండితులు చెబుతున్నారు.

బహుళ అమావాస్య ను హిందువులు చుక్కల అమావాస్యగా పిలుస్తారు. పలు దేవాలయాల్లో ఇదే రోజున తాంత్రిక పూజలు చేయడం విశేషం. ఈ ఏడాది ఇది రెం డవ సూర్య గ్రహణం కావడం గమనార్హం. మొదటిది పాక్షిక సూర్య గ్రహణం ఈ ఏడాది ఫిబ్రవరి నెల 17న సంభవించగా ఇది కూడా భారత్‌లో కనిపించలేదు.

ఇదిలా ఉండగా ఈ నెల 12న సూర్యోదయానికి ముందు ఆకాశంలో ఆరు గ్రహాలు ఒకే ప్రాంతంలో వరుసగా కనువిందు చేయనున్నాయి. బృహస్పతి, బుధుడు, అంగారకుడు, శని, యురేనస్, నెప్ట్యూన్ తూర్పు నుంచి పడమర వైపు విస్తరించి వరుసగా కనిపిస్తాయి. వీటిలో అంగారకుడు, శని వంటి ప్రకాశ వంతమైన గ్రహాలను అందరు వీక్షించే వీలుంది. ఇతర గ్రహాల వీక్షణకు దూరదర్శిని అవసరం వుంటుంది. ఇదే సమయంలో ఆ రోజున రాత్రి ఉల్కా వర్షం కురవనుంది.

### 28న పాక్షిక చంద్రగ్రహణం

మరోవైపు ఆగస్టు 28వ తేదీన పాక్షిక చంద్ర గ్రహణం ఏర్పడనుంది. రక్షా బంధన్ పండగ రోజున భారత కాలమానం ప్రకారం ఈ గ్రహణం మధ్యాహ్నం 12.12 గంటల నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు వుండనుంది. పగటి వేళ అయినందున ఇది భారత్‌లో కనిపించ దు. దీంతో భారత్‌లో సూతకం వుండదని పండితులు చెబుతున్నారు.




# నాలుగు హైకోర్టులకు కొత్త సిజెలు

## మరో ఇద్దరు న్యాయమూర్తుల బదలీ

## సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** నాలుగు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తుల నియామకాన్ని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి. కామేశ్వరరావును పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా బదిలీ చేయాలని కూడా కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం బొంబాయి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ రవీంద్ర విఠల్‌రావు ఘుగేను కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సిఫార్సు చేసింది. ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ మహేష్ చంద్ర త్రిపాఠిని బొంబాయి హైకోర్టు ప్రధానన్యాయ మూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది. అంతేకాకుండా, ప్రస్తుతం పంజాబ్- హర్యానా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ అశ్వనీకుమార్ మిశ్రాను ఆ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం చేసిన ఈ సిఫార్సులను, ఇప్పుడు పరిశీలన కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సిఫార్సులను ఆమోదించి, అవసరమైన నోటిఫికేషన్లను జారీ చేసిన తర్వాత ఈ నియామకాలు అమల్లోకి వస్తాయి.

ప్రస్తుతం, దేశంలోని ఇరవై ఐదు హైకోర్టులలో ఏడింట శాశ్వత ప్రధాన న్యాయమూర్తులు లేకుండా పనిచేస్తున్నాయి. ఇటీవల పదవీ విరమణలు, సుప్రీంకోర్టుకు పదోన్నతుల కారణంగా బొంబాయి, కలకత్తా, జమ్మూకాశ్మీర్, లఢఖ్, మధ్యప్రదేశ్, పాట్నా, పంజాబ్- హర్యానా, రాజ స్థాన్ హైకోర్టులకు ప్రస్తుతం తాత్కాలిక ప్రధానన్యాయమూర్తులు నాయ కత్వం వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తే, ఈ తాజా సిఫార్సుల ద్వారా ఈ ఖాళీలలో ఐదింటిని భర్తీ చేయవచ్చు.



# రష్యానుంచి నేరుగా హిందూ మహాసముద్రానికి రైల్వేలైన్

## రష్యా ఉపప్రధాని ఖుస్నుల్లిన్ వెల్లడి

**మాస్కో, ఆగస్టు 9:** రష్యా నుంచి నేరుకగా హిందూ మహాసముద్రం వరకు రైల్వే మార్గాన్ని నిర్మించడం ద్వారా ఇండియాతో భూమార్గ అనుసంధానాన్ని పెంచుకోవాలని భావిస్తోంది. ఈ విషయాన్ని రష్యా ఉప ప్రధాని మారత్ ఖుస్నుల్లిన్ ప్రభుత్వ వార్తా సంస్థ టాస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చర్చించారు. హిందూ మహాసముద్రానికి రైల్వే మార్గాన్ని నిర్మించడాన్ని రష్యా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి ప్రత్యామ్నాయ రైలు నెట్‌వర్క్, ప్రస్తుతం ఉన్న సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని రష్యా విశ్వసిస్తోంది. ప్రస్తుతం రష్యా, భారత్ మధ్య అత్యధిక వాణిజ్యం బోస్పరస్, హోర్ముజ్ జలసంధి వంటి కీలకమైన సముద్ర మార్గాల ద్వారానే జరుగుతోంది. హోర్ముజ్ జలసంధి ప్రపంచంలోని అత్యంత కీలకమైన చమురు, గ్యాస్ వాణిజ్య మార్గాలలో ఒకటి. అయితే ప్రపంచ చమురు రవాణాలో 25 శాతం, ఎల్ఎన్‌జీ రవాణాలో 20 శాతం ఈ సముద్ర మార్గం గుండానే జరుగుతాయి. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య యుద్ధం కారణంగా సముద్రం మార్గం ద్వారా వెళ్లే వాణిజ్య నౌకల భద్రతపై ఆందోళనలు పెరిగాయి. ఈ నేపథ్యంలో రష్యా తన వాణిజ్యం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఏఏ దేశాల గుండా ఈ రైలు మార్గం వెళ్తుంది ప్రతిపాదిత రైల్వే నెట్వర్క్ రష్యా నుంచి బయలుదేరి మధ్య ఆసియా, పశ్చిమాసియా దేశాలైన తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ దేశాల గుండా హిందూ మహాసముద్రాన్ని చేరుకునేలా ప్రణాళికలు రచిస్తున్నారు.

ఈ మార్గం అందుబాటులోకి వస్తే ఇండియాకు రవాణా అయ్యే సరుకుల సమయం, వ్యయం గణనీయంగా తగ్గుతాయి. భూమార్గం, సముద్రమార్గాల కలయికతో కూడిన ఈ నెట్వర్క్ దక్షిణాసియా, మధ్య ఆసియా దేశాలకు సరికొత్త ఆర్థిక, వాణిజ్య అవకాశాలను అందిస్తుంది. భారతదేశం రష్యాకు ఓ ముఖ్యమైన వాణిజ్య భాగస్వామి. ఇంధనం, రక్షణ, ఇతర రంగాలలో ఇరు దేశాల మధ్య దీర్ఘకాలంగా వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. ఇండియాకు ప్రత్యక్ష, సురక్షితమైన భూమార్గ అనుసంధానాన్ని అభివృద్ధి చేయడం ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని మరింతగా పెంచగలదు. ఈ ప్రతిపాదన రష్యా, ఇండియాకు ముఖ్యమైనది మాత్రమే కాకుండా, మధ్య ఆసియా, ఇరాన్ వంటి దేశాలకు కూడా కొత్త వాణిజ్య అవకాశాలను అందించగలదు. భయంకపితులను చేసిన ఆ ఎయిర్ ఇండియా ఫ్లైట్ ఘటనలో అసలు విషయాలు వెలుగులోకి ఈ ప్రాజెక్టుకు భారీగా నిధులు అవసరం. అటువంటి రైల్వే నెట్‌వర్క్‌ను నిర్మించడం సులభం కాదు. అనేక దేశాల గుండా వెళ్లే ఈ మార్గానికి గణనీయమైన పెట్టుబడి, భద్రతా చర్యలు, వివిధ దేశాల మధ్య దీర్ఘకాలిక సహకారం అవసరం.

# కామన్వెల్త్ క్రీడాకారులతో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్ 2026లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి తిరిగి వచ్చిన భారత బృం దానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం తన ఢిల్లీ నివాసంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ దేశ పతక విజేతలతో సుదీర్ఘంగా సంభాషించి వారి అనుభవాలను తెలుసుకున్నారు. వారి అద్భుతమైన ప్రదర్శనను ప్రశంసిస్తూ, యావత్ దేశం తరపున అభినందనలు తెలిపారు. సోషల్ మీడియాలో ఓ వీడియోను కూడా పంచుకున్నారు, అది వేగంగా వైరల్ అవుతోంది. ప్రధాన మంత్రి తన సోషల్ మీడియాలో ఓ వీడియోను పంచుకోవడం ద్వారా కామన్వెల్త్ గేమ్స్ అథ్లెట్లతో జరిగిన ఈ ప్రత్యేక సమావేశం గురించి తెలియజేశారు. ఆ వీడియోలో ఆయన స్వర్ణ పతక విజేత బాక్సర్ సాక్షి చౌదరి, పలువురు ఇతర ఛాంపియన్‌లతో సంభాషిస్తూ కనిపించారు. ఆ వీడియోలో సాక్షిచౌదరి ప్రధాని మోదీ నిరాడం బరతను ప్రశంసిస్తూ ప్రధానమంత్రిని కలవడం మాకు చాలా సంతోషంగా ఉంది. ఆయన చాలా వినయశీలి అని అన్నారు. సంభాషణ సందర్భంగా ఆటగాళ్లు ప్రధానమంత్రిని ఏదైనా మాట్లాడమని కోరగా దేశంలో క్రీడా సంస్కృతిని ప్రోత్సహించే తన ప్రసిద్ధ సందేశాన్ని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు, జో ఖేలేగా, వో ఖిలేగా! ఆల్వేస్ చీర్4భారత్. అంటూ చివరకు భారత్ మాతా కీ జై అని నినాదాలు చేస్తూ ఆటగాళ్లలో ఉత్సాహాన్ని నింపారు. గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత అథ్లెట్లు అద్భుతంగా రాణించి, మొత్తం 39 పతకాలను గెలుచుకోవడం గమనార్హం. వీటిలో 13స్వర్ణాలు, 17రజతాలు, 9కాంస్య పతకా లున్నాయి. ఈ విజయం భారత జట్టు ఆత్మవి శ్వాసాన్ని పెంచగా ప్రధానమంత్రితో ఈ సమావేశం అథ్లెట్ల ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది.

# ఈగల్‌కు చిక్కిన అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్

## హాష్‌ఆయిల్ స్వాధీనం

**హైదరాబాద్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** ఒడిశా నుంచి హాష్ ఆయిల్‌ను హైదరాబాద్‌కు స్మగ్లింగ్ చేస్తున్న అంతరాష్ట్ర స్మగ్లర్‌ను ఈగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అతని వద్ద నుంచి 200 మిల్లీ లీటర్ల హాష్ ఆయిల్‌ను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఎపిలోని ప్రకాశం జిల్లాకు చెందిన బర్సె నరేంద్ర శ్రీనివాస్ (30) చాలా కాల ంగా హైదరాబాద్‌లో వుంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు అలవాటుపడ్డ ఇతను ఐదేళ్ల క్రితం డ్రగ్ స్మగ్లర్‌గా మారాడు. ఈ క్రమంలో ఇతనిపై సరూర్‌నగర్, మీర్‌పేట్ పోలీసు స్టేషన్లలో ఐదు కేసులు నమోదయ్యాయి.

గత ఏడాది మే నెలలో మీర్‌పేట్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో అరెస్టయి నవంబర్ నెలలో బెయిల్‌పై విడుదలయ్యాడు. అనంతరం మళ్లీ కొద్దిరోజులు డ్రైవర్‌గా పనిచేసినా ఆదాయం సరిపోక పోవడంతో మళ్లీ డ్రగ్స్ దందా చేయసాగాడు. స్నాప్ చాట్‌లో ఒడిశాలోని కోరాపూర్‌కు చెందిన హరీ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి అక్కడి నుంచి తక్కువ ధరకు హాష్ ఆయిల్ కొన సాగా డు. దీనిని జంట నగరా లలో ఎక్కువ ధరకు విక్ర యిస్తూ దండిగా సంపా దించ సాగాడు. అయితే ఇతని కదలికలపై ఈగల్ పోలీసులు నిఘా వుం చారు. తాజాగా ఇతను ఈ నెల రెండవ తేదీన వైజాగ్ మీదుగా ఒడిశాలోని కోరాపూర్ జిల్లాకు వెళ్లి హాష్ ఆయిల్ స్మగ్లర్ హరితో భేటీ అయ్యాడు. అక్కడ నాలుగు రోజులు వున్న తరువాత తొమ్మిది వేల రూపాయలు చెల్లించి 200 మిల్లీలీటర్ల హాష్ ఆయిల్‌ను తీసుకుని వైజాగ్ మీదుగా హైదరాబాద్‌కు బస్సులో వచ్చాడు.



నరేంద్ర శ్రీనివాస్ గురించి పక్కా సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో ఆదివారం ఉదయం అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద ఓఆర్ఆర్ వద్ద కాపుకాశారు. విజయవాడ నుంచి వస్తున్న బస్సులో ఇతను వచ్చి అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద దిగాడు. అనంతరం ఆటో కోసం ఎదురు చూస్తుండగా ఈగల్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. నిందితుడి బ్యాగుల్లో 200 మిల్లీలీటర్ల హాష్ ఆయిల్ పట్టుబడింది. దీని విలువ రెండున్నర లక్షల రూపాయలుగా తేలింది. ఒడిశాలో కొన్న హాష్ ఆయిల్‌ను జంట నగరాలలో పది మిల్లీ లీటర్‌గా చిన్న బాటిల్‌లో వుంచి 1200 రూపా యలకు ఇతను అమ్ముతున్నట్లు తేలింది. నింది తుడిని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు తదుపరి విచారణ నిమిత్తం అప్పగించారు. ఈ కేసులో ఒడిషా స్మ గ్లర్ హరి కోసం గాలిస్తున్నారు. కాగా నరేంద్ర శ్రీనివాస్ నుంచి పది మంది హాష్ ఆయిల్ కొన్నట్లు తేలగా వారి కోసం కూడా గాలిస్తున్నారు.



జూరాల గేట్లు మూసివేసిన దృశ్యం

# జూరాల గేట్లు మూసివేత

**మహబూబ్‌నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త బ్యూరో:** జూరాలకు ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుతం 8.415 టీఎంసీలుగా నమోదు అయింది. జూరాల ప్రాజెక్టుకు 63,000క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు అయింది. దీంతో డ్యాం గేట్లు మూసివేశారు. పవర్ హౌస్ ద్వారా 43,686 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. మొత్తంగా జూరాల నుంచి 47,060 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదు అయింది. 878టీఎంసీ లకు శ్రీశైలం జూరాల నుంచి వరద వస్తుండడంతో శ్రీశైలం జలాశ యానికి జలకళ సంతరించుకున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు 215.8070 టీఎంసీలకు గాను ప్రస్తుతం 878.10 అడుగులకు చేరి 178.7400టీఎంసీలుగా నమోదు అయింది. జూరాల పవర్ హౌస్ నుంచి 36,233 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు అయింది. శ్రీశైలంలోని రెండు ఎడమ కుడి జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. కుడి జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా 31,306 క్యూసెక్కులు, ఎడమ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 7063 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

10-8 Pg10_10-8 Pg10.qxd 10/Aug/26 12:05 AM Page 1



# 13 మంది స్టార్లు ఔట్

## టీమిండియాకు ఊహించని షాక్

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ రేసులో భారత్‌కు అత్యంత కీలకమైన శ్రీలంక పర్యటన ప్రారంభానికి ముందే గాయాల సమస్య రూపుదిద్దుకుంది. శ్రీలంకతో జరగబోయే కీలకమైన టెస్టు సిరీస్ ముందు ఒకరు కాదు, ఇద్దరు కాదు ఏకంగా 13 మంది భారత ఆటగాళ్ళు గాయాల బారిన పడ్డారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో సహా జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా లాంటి స్టార్ ప్లేయర్లు దూరం కావడంతో భారత్ క్రికెటన కంట్రోల్ బోర్డు తీవ్ర ఒత్తిడిలో పడిపోయింది. ఈ నెల 15 నుంచి రెండు



మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుండగా, భారత క్యాంప్‌లో తీవ్ర ఆందోళన నెలకొంది. లంక ఎలెవన్‌తో జరుగుతున్న ప్రాక్టీస్ మ్యాచ్‌కూ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వేలి గాయం వల్ల దూరమయ్యాడు. అతని స్థానంలో కేఎల్ రాహుల్ జట్టు బాధ్యతలను భుజాన వేసుకున్నారు. టీమిండియా మేనేజ్‌మెంట్‌ను ఇది కోలుకోలేని దెబ్బగా మారింది. గాయపడిన 13 మంది ఆటగాళ్ళు ప్రస్తుతం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్‌సిఎ)లో పునరావాసం పొందుతున్నారు. వీరిలో స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా మోకాలి గాయంతో బాధపడుతుండగా, హార్దిక్ పాండ్యా తొడ కండరాల గాయంతో మైదానానికి దూరమయ్యారు. ఆకాష్ దీప్ వెన్నుముకలో స్ట్రెస్ ఫ్రాక్చర్, రియాన్ పరాగ్ కుడి చేతి మణికట్టు గాయంతో కోలుకుంటున్నారు. నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా హ్యామ్‌స్ట్రింగ్ సమస్యలతో ఇబ్బంది పడుతుండటంతో మ్యాచ్ ఎంపికలకు దూరమయ్యారు. వరుణ్ చక్రవర్తి, సుయాష్ శర్మ, అశోక్ శర్మ, యుధ్‌వీర్ సింగ్, హిమాంశు సింగ్ సైతం వేర్వేరు గాయాలతో చికిత్స పొందుతున్నారు. శ్రీలంక టెస్టు సిరీస్‌కు ఎంపికైన యువ బ్యాటర్ సాయి సుదర్శన్ కాలి వేలి ఫ్రాక్చర్ నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. దీంతో అతడు ఈ సిరీస్ మొత్తానికి దూరం కానున్నట్లు సమాచారం వస్తోంది. అయితే దీనిపై బిసిసిఐ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వాషింగ్టన్ సుందర్ అందుబాటుపై కూడా ఇంకా అనుమానాలు తొలగిపోలేదు. ఇంతమంది ముఖ్యమైన ఆటగాళ్ళు ఒకేసారి గాయాల బారిన పడటం జట్టు ఎంపికను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ముఖ్యమైన టెస్టు సిరీస్ ముంగిట ప్రధాన ఆటగాళ్ళు మైదానానికి దూరం కావడం భారత జట్టుకు పెద్ద ఎదురుదెబ్బే. ఎన్సిఏలో చికిత్స పొందుతున్న ఆటగాళ్ళు ఎంత త్వరగా కోలుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

### లెక్సింగ్టన్ ఓపెన్‌లో ఛాంపియన్స్‌గా


# నిక్కి, ఎస్కోబార్ జోడీ

**న్యూఢిల్లీ:** ఏటీపీ ఛాలెంజర్ 75 టోర్నమెంట్ అయిన లెక్సింగ్టన్ ఓపెన్ 2026లో, భారత్‌కు చెందిననికి కలియంద పూనాచా- ఈక్వెడార్‌కు చెందిన గొంజలో ఎస్కోబార్ జోడీ అద్భుతమైన పునరాగమనం చేసి, అమెరికన్ జోడీ ఆండ్రీ ఇలగన్-కార్ల్ పోలింగ్‌లను ఓడించి పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఆదివారం కెంటకీలోని లెక్సింగ్టన్‌లో ఒక గంట 42 నిమిషాల పాటు జరిగిన ఫైనల్‌లో, మూడవ సీడ్ జంట పూనాచా



ఎస్కోబార్ 6-7 (1), 6-3, 11-9 తేడాతో విజయం సాధించింది. పూనాచా-ఎస్కోబార్ భాగస్వామ్యంగా గెలిచి ఛాంపియన్‌గా నిలిచిన మొట్టమొదటి ఛాలెంజర్ టైటిల్ కూడా ఇదే. తొలి సెట్‌లో పూనాచా-ఎస్కోబార్ నాలుగో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి బలమైన ఆరంభాన్ని ఇచ్చారు. అయితే, ఏడో గేమ్‌లో తిరిగి బ్రేక్ చేసి ఇలాగన్ మరియు పోలింగ్ సెట్‌ను సమం చేశారు. ఆ తర్వాత అమెరికన్లు టైబ్రేక్‌లో ఆధిపత్యం చెలాయించి, దానిని 7-1 తేడాతో గెలుచుకున్నారు. భారత ఈక్వెడార్ ద్వయం రెండవ సెట్‌లో బలంగా పుంజుకుని, మూడవ గేమ్‌లోనే తొలి బ్రేక్ సాధించి ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. తొమ్మిదవ గేమ్‌లో మళ్లీ విజృంభించి మ్యాచ్‌ను సూపర్ టైబ్రేక్‌కు తీసుకువెళ్లారు. నిర్ణయాత్మక మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఏ జట్టు కూడా రెండు పాయింట్లకు మించి ఆధిక్యాన్ని సాధించలేకపోయింది. పూనాచా-ఎస్కోబార్ 7-9తో వెనుకబడి ఓటమి అంచున నిలిచినా చివరి నిమిషాల్లో నిర్ణయాత్మకమైన పుంజుకోవడంతో వరుసగా నాలుగు పాయింట్లు గెలుచుకుని, ఆ క్రమంలో రెండు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు.



### వరల్డ్ ఛాంపియన్‌షిప్..

# హైజంప్‌లో బసంత్ రజతం

## లాంగ్‌జంప్‌లో షానవాజ్ కాంస్యం

**న్యూఢిల్లీ:** ప్రపంచ అండర్20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత జంపర్లు మరో రెండు పతకాలను జోడించారు. అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రం, యూజీన్‌లో జరుగుతున్న ఈ ఛాంపియన్‌షిప్‌లో బసంత్ హైజంప్‌లో రజత పతకం సాధించి భారతదేశానికి మొట్టమొదటి పతకాన్ని అందించగా, షానవాజ్ ఖాన్ కాంస్య పతకం గెలుచుకొని ఈ పోటీలో పతకం సాధించిన తొలి పురుష లాంగ్ జంపర్‌గా నిలిచాడు. బసంత్ తన రెండవ ప్రయత్నంలో తన వ్యక్తిగత అత్యుత్తమమైన 2.21 మీటర్లను సమం చేసి, కౌంట్‌బ్యాక్ ఆధారంగా అల్జీరియాకు చెందిన యూనెస్ అయాచి (2.21 మీటర్లు) వెనుక ఫైనల్‌లో రెండవ స్థానాన్ని పొందాడు. ఈలోగా, షహనవాజ్ తన అత్యుత్తమ ఫామ్‌ను కనుగొనలేకపోయినప్పటికీ, తన మూడవ ప్రయత్నంలో 7.84 మీటర్లు దూకి, యూజీన్‌లో డేనియల్ ఇంజోలి (ఇటలీ) మరియు మేసన్ మెక్‌గ్రోడర్ (ఆస్ట్రేలియా)ల వెనుక టాప్ 3 స్థానాన్ని ఖరారు చేసుకున్నాడు. అంతకుముందు జరిగిన క్వాలిఫైయింగ్ రౌండ్‌లోని హీట్ 1లో మూడో స్థానంలో నిలిచిన భారత మహిళల 4x400 మీటర్ల రిలే జట్టు ఫైనల్‌కు చేరుకుంది. భూమికా నేహతే, తహురా ఖతున్, తనూ చౌదరి, థియా ఆరుముగమ్‌ల క్వార్టెట్ 3:39.53 సెకన్లతో స్లోవేకియాను ఓడించి హీట్ 1లో 3వ స్థానంలో నిలిచింది.

# కొరియా మాస్టర్స్‌లో అష్మితకు టైటిల్

**న్యూఢిల్లీ:** కొరియా మాస్టర్స్ సూపర్ 300 ఈవెంట్‌లో అష్మిత చలిహా మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుని, బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సర్క్యూట్‌లో తన తొలి టైటిల్‌ను గెలుచుకుంది. ఆదివారం నాడు 53 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో, 26 ఏళ్ల క్రీడాకారిణి వెనుకబడి ఉన్నప్పటికీ పుంజుకుని నాలుగో సీడ్ చైనీస్ షట్లర్ హాన్ కియాన్ క్సీ ని 14-21, 21-14, 21-14 తేడాతో ఓడించింది. చాలిహా మ్యాచ్‌ను బాగా ప్రారంభించి, తొలి గేమ్‌లో 9-5 ఆధిక్యం సాధించింది. కానీ మిడ్‌గేమ్ తర్వాత ఆమె నియంత్రణ కోల్పోవడంతో, హాన్ ఆ గేమ్‌ను 21-14 తేడాతో గెలుచుకుంది. ఆమె రెండవ గేమ్‌ను మరింత మెరుగ్గా ఆడింది. ఈసారి తన ఆధిక్యాన్ని చేజార్చుకోకుండా, గేమ్‌ను 21 -14తో ముగించి, నిర్ణయాత్మక గేమ్‌కు దారితీయడం ద్వారా తన తొలి టైటిల్ ఆశలను సజీవంగా ఉంచుకుంది.



హోరాహోరీగా సాగిన నిర్ణయాత్మక గేమ్‌లో, చివరి మధ్యంతర విరామ సమయానికి హాన్ 11-9 స్వల్ప ఆధిక్యంలో ఉంది, కానీ ఆ తర్వాత అష్మిత వరుసగా ఆరు పాయింట్లు గెలుచుకుని, చివరికి 21-14 తేడాతో గేమ్‌ను కైవసం చేసుకుంది. భారత మహిళల సింగిల్స్ ఈ ఏడాది అత్యుత్తమ సంవత్సరాలలో ఒకటిగా నిలుస్తోంది. దేవికా సిహాగ్, తన్వి శర్మ, అష్మిత, పివి సింధు వంటి విభిన్న క్రీడాకారిణులతో ఇప్పటికే నాలుగు టైటిళ్లను గెలుచుకుంది. మొత్తంగా, ఈ ఏడాది ఈ సర్క్యూట్‌లో భారతదేశానికి ఇది ఐదవ టైటిల్.

### శ్రీలంక వామప్ మ్యాచ్‌లో..

# భారత్ ఘన విజయం

**న్యూఢిల్లీ:** శ్రీలంక పర్యటన భారత్ ఘనంగా ప్రారంభించింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సన్నాహకంగా శ్రీలంక ఎలెవన్‌తో జరిగిన మూడు రోజుల వామప్ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆదివారం నాడు జరిగిన మూడో రోజు ఆటలో ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో 207 పరుగుల లక్ష్య ఛేదనలో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్ నిర్ణీత 45 ఓవర్లలో 4 వికెట్లకు 214 పరుగులు చేసి గెలుపొందింది. యశస్వి జైస్వాల్(61) హాఫ్ సెంచరీతో రాణించగా, శుభ్‌మన్ గిల్(44), మహమ్మద్ సిరాజ్(32 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో కేశర



నువాంత(2/57)రెండు వికెట్లుతీయగా, విశ్వ ఫెర్నాండో, రమేష్ మెండీస్ తలో వికెట్ తీసారు. భారత్ విజయానికి ఆఖరి 6 బంతుల్లో 16 పరుగులు అవసరమయ్యాయి. క్రీజులో టెయిలెండర్ సిరాజ్‌తో పాటు, సరాన్ష్ జైన్ ఉండటంతో విజయం కష్టమేనని అంతా అనుకున్నారు. కానీ సిరాజ్ అనూహ్యంగా హ్యాట్రిక్ సిక్స్‌లు బాది విజయాన్ని అందించాడు. లంక జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు నష్టానికి 200 పరుగులు చేసి టీమిండియా ముందు 207 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. నిషాన్ మధుష్క (63) అర్థ సెంచరీతో రాణించగా, అంజల బండార (35), నిపున్ ధనంజయ్ (46)తో రాణించారు. భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 357 వద్ద డిక్లేర్ చేసింది. పడిక్కల్ (142 నాటౌట్), రవీంద్ర జడేజా (63), రాహుల్ (40), మానవ్‌సుతార్ (41), గుర్నూర్ బ్రార్ (36 నాటౌట్), సరాన్ష్ జైన్ (22) స్కోరు చేశారు. దీని ముందు లంక తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు నష్టానికి 363 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. నిషాన్ మధుష్క (66), రవిందు రాషాంత (71), సోనల్ దినుష (52) రాణించారు.

### కృత్రిమ మేధతో భారత్‌లో

# ఉద్యోగ సృష్టి ఎక్కువే




**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తరణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా టెక్ కంపెనీల్లో వేలాది ఉద్యోగాల కోతలు జరిగాయి. వరుసగా లేఆఫ్స్ ప్రకటిస్తున్నా భారతీయ ఉద్యోగ మార్కెట్ పై దీని ప్రభావం భిన్నంగా ఉందని గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ నోమురా వెల్లడించింది. భారత్‌లో ఎఐ కారణంగా కోల్పోయిన ఉద్యోగాలకంటే ఎఐ ఆధారిత టెక్నాలజీల వల్ల కొత్తగా సృష్టిస్తున్న ఉద్యోగాల సంఖ్యే ఎక్కువగా ఉందని నోమురా తన నివేదికలో స్పష్టం చేసింది. లేఆఫ్స్‌తో పోలిస్తే భారత్‌లో ఎఐ నియామకాలు దాదాపు 3 రెట్లు ఉన్నట్లు నోమురా నివేదిక పేర్కొంది. 2022 నుంచి 2026 ఆగస్టు వరకు చూసుకుంటే భారతీయ కంపెనీలు ఎఐ కారణంగా 31,921 మందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి. ఇదే సమయంలో 83,100 ఎఐ ఆధారిత కొత్త నియామకాలు చేపట్టినట్లు నివేదిక తెలిపింది. ఎఐ చాట్‌బాట్లను వినియోగించడంతో చాలా కంపెనీలు తమ సపోర్ట్ టీమ్స్‌లో కోతలు చేపట్టినట్లు తెలిపింది. ఎఐ ఆధారిత డిమాండ్‌ను భర్తీ చేసేందుకు ఐటీ సేవల గ్రాడ్యుయేట్ల నియామకాలు పెరిగినట్లు తెలిపింది. ఎఐ విధానాలతో ఇండియా, సౌత్ కోరియా వంటి దేశాల్లో రెండంచెల కార్మిక మార్కెట్ సృష్టి జరిగిందని నోమురా అంచనావేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఎంట్రీ లెవెల్ ఉద్యోగాలకు డిమాండ్ తగ్గినావ్యాపార కార్యకలాపాల్లో అనుభవజ్ఞులైన ఉద్యోగులకు అవకాశాలు మెరుగుపడు తున్నాయని తెలిపింది. గడిచిన నాలుగు సంవత్సరాల్లో ఆసియా వ్యాప్తంగా 1.3 లక్షలకు పైగా ఎఐ ఆధారిత నియామకాలు జరిగాయని తెలిపింది. ఇందులో 90 శాతం టెక్నాలజీ రంగంలోనే ఉన్నాయని పేర్కొంది. ఆసియా కంపెనీలు గత నాలుగేళ్లలో 60,654 ఉద్యోగులను తొలగించాయని, అందులో 60 శాతం ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగంలోనే ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

# 4.5 బిలియన్ డాలర్ల షేర్ బైబాక్

## బెర్క్‌షైర్ వ్యూహాల్లో మార్పులు

**న్యూయార్కు, ఆగస్టు 9:** వారెన్ బఫెట్ నుంచి గ్రెగ్ అబెల్ చేతుల్లోకి వచ్చిన తర్వాత బర్క్‌షైర్ హాత్‌వే వ్యూహంలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఈ యేడాది రెండో త్రైమాసికంలో సుమారు 4.5 బిలియన్ డాలర్ల విలువైన సొంత షేర్లను తిరిగి కొనుగోలు చేసింది. 2021 తర్వాత ఒక త్రైమాసికంలో బర్క్‌షైర్ చేపట్టిన అతిపెద్ద షేర్ బైబ్యాక్ ఇదే. జూన్‌తో ముగిసిన మూడు నెలల్లో కంపెనీ నిర్వహణ కార్యకలాపాల ద్వారా వచ్చే లాభం 16 శాతం పెరిగి




దాదాపు 13 బిలియన్ డాలర్లకు చేరింది. తయారీ, సేవలు, రిటైల్ విభాగాల్లో మెరుగైన పనితీరు కంపెనీ లాభాల వృద్ధికి దోహదపడింది. వివిధ రంగాల్లో విస్తృత వ్యాపారాలు, పెట్టుబడులు కలిగి ఉన్న బర్క్‌షైర్ ఫలితాలను అమెరికా ఆర్థిక వ్యవస్థ పరిస్థితులకు ఒక ముఖ్యమైన సూచికగా ఇన్వెస్టర్లు పరిగణిస్తారు. భారీ నగదు నిల్వలకు కదలిబర్క్‌షైర్ భారీ నగదు నిల్వలను పెట్టుబడుల వైపు మళ్లించడంతో త్రైమాసికం చివరికి నగదు, నగదుకు సమానమైన ఆస్తులు 365.5 బిలియన్ డాలర్లకు తగ్గాయి. ఇదే సమయంలో కంపెనీ దాదాపు 20 బిలియన్ డాలర్ల నికర ఈక్విటీ కొనుగోళ్లు చేపట్టింది. వారెన్ బఫెట్ నాయకత్వంలో గత కొన్నేళ్లుగా బర్క్‌షైర్ కొత్త కొనుగోళ్లు, పెట్టుబడుల విషయంలో ఆచితూచి వ్యవహరించింది. ముఖ్యంగా అమెరికా మార్కెట్లలో కంపెనీల విలువలు భారీగా పెరగడంతో, బర్క్‌షైర్ అనుసరించే విలువ ఆధారిత పెట్టుబడి విధానానికి సరిపడే అవకాశాలు పరిమితమయ్యాయి. సిఇఒగా బాధ్యతలు చేపట్టిన గ్రెగ్ అబెల్ మార్పు తెస్తున్నారు. కంపెనీ వద్ద ఉన్న అపారమైన మూలధనాన్ని సరైన అవకాశాల్లో పెట్టుబడి పెట్టేందుకు ఆయన మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. బైబ్యాక్‌లకు మళ్లీ ప్రాధాన్యంఏడాదికి పైగా సొంత షేర్ల కొనుగోళ్లకు దూరంగా ఉన్న బర్క్‌షైర్ ఈ యేడాది తొలి త్రైమాసికంలో బైబ్యాక్‌లను పునఃప్రారంభించింది. రెండో త్రైమాసికంలో 4.5 బిలియన్ డాలర్ల బైబ్యాక్ చేయడం ద్వారా కంపెనీ తన సొంత షేర్ల విలువపై యాజమాన్యానికి ఉన్న విశ్వాసాన్ని మరోసారి చాటింది. 6.8 బిలియన్ డాలర్లకు టేలర్ మారిసన్ హోమ్ కార్పొరేషన్‌ను కొనుగోలు చేసింది.

# ద్రవ్యోల్బణం, త్రైమాసిక ఫలితాలే కీలకం




## ఈ వారం మార్కెట్లకు లాభం కానున్న పశ్చిమాసియా వార్

**ముంబయి, ఆగస్టు 9:** రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు, ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, హర్ముజ్ జలసంధిపై అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధరలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల (ఎఫ్ఐఐ) ప్రవాహాలు వచ్చే వారం దేశీయ స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేయనున్నాయి. వరుసగా రెండో వారంలోనూ బెంచ్‌మార్క్ సూచీలు లాభాలతో ముగియడంతో మార్కెట్లలో సానుకూల ధోరణి కొనసాగుతోంది. గత వారంలో భారత ఈక్విటీ మార్కెట్లు వరుసగా రెండో వారం లాభాల్లో ముగిశాయి. ముడి చమురు ధరలు భారీగా తగ్గడం, రూపాయి కొంత బలపడటం, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొనసాగడం మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. జూన్ త్రైమాసిక రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ 12న విడుదల చేయనుంది. అధికారిక గణాంకాల ప్రకారం జూన్‌లో హెడ్‌లైన్ సిపిఐ ద్రవ్యోల్బణం 4.38 శాతంగా నమోదైంది. ఇది ఆర్బీఐ నిర్దేశించిన 4 శాతం లక్ష్యంకంటే అధికంగా ఉన్నప్పటికీ, నిర్దేశిత సహన పరిమితిలోనే ఉంది. ఆహారం, ఇంధన ధరలు ద్రవ్యోల్బణంపై ప్రధాన ప్రభావం చూపాయి. ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ వచ్చే వారంలోనూ కొనసాగనుంది. ఆగస్టు 10న లాయిడ్స్ మెటల్స్ అండ్ ఎనర్జీ, బాష్, భారత్ ఫోర్జ్, లిండే ఇండియా, ఇన్ఫోఎడ్జ్, వొడాఫోన్ ఐడియా తదితర కంపెనీలు తమ ఫలితాలను ప్రకటించనున్నాయి. 11న సీమెన్స్, జైడస్ లైఫ్ సైన్సెస్ తదితర కంపెనీలు ఫలితాలను వెల్లడించనున్నాయి. మొత్తంమీద వచ్చే వారంలో 250కి పైగా కంపెనీలు తమ త్రైమాసిక ఫలితాలను ప్రకటించనున్నట్లు కార్పొరేట్ ఎర్నింగ్స్ క్యాలెండర్లు సూచిస్తున్నాయి. ఎఫ్ఐఐల పెట్టుబడులపై దృష్టి ఇటీవలి సెషన్లలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు మిశ్రమంగా కొనసాగాయి. ఈనెల7న నగదు విభాగంలో ఎఫ్ఐఐలు రూ.480.20 కోట్ల విలువైన షేర్లను నికరంగా కొనుగోలు చేశారు. గతవారంలో కొంతమేర విక్రయాలు జరిపిన నేపథ్యంలో ఈ కొనుగోళ్లు మార్కెట్ సెంటిమెంట్‌కు ఊతమిచ్చాయి. ముడి చమురుధరల పతనం కీలక మద్దతుముడి చమురు ధరలు గణనీయంగా తగ్గడం దేశీయ మార్కెట్లకు ప్రధాన సానుకూల అంశంగా మారింది. జూలైలో బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా ఉన్న బ్రెంట్ క్రూడ్‌ధర ప్రస్తుతం సుమారు 79-83 డాలర్ల స్థాయికిపడిపోయింది. దీనితోపాటు రూపాయి విలువకూడా డాలర్‌తోపోలిస్తే 95.3-95.4 స్థాయిలో కొంతస్థిరంగా ఉండటం మార్కెట్ సెంటిమెంట్‌కు మద్దతు అందిస్తోంది. మొత్తంగా వచ్చే వారం దేశీయ స్టాక్ మార్కెట్ల దిశను రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు, కంపెనీల క్యూ1 ఫలితాలు, ముడిచమురు ధరలు, రూపాయి కదలికలు, ఎఫ్ఐఐల పెట్టుబడులు, హోర్ముజ్ జలసంధిపై అమెరికా-ఇరాన్ నిర్ణయాలు కీలకం కానున్నాయి.

# ఈ వారంలో 10 కొత్త ఫండ్స్




**ముంబయి, ఆగస్టు 9:** స్టాక్ మార్కెట్లో హెచ్చుతగ్గులున్న క్రమంలోమ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్టర్లు కోట్లాది రూపాయలు కుమ్మరిస్తున్నారు. సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ సిప్ లేదా లంప్‌సమ్ విధానంలో పెట్టుబడులు పెట్టాలనుకునే ఇన్వెస్టర్ల కోసం ఇటి మ్యూచువల్ ఫండ్స్ టాప్ 10 ప్రధాన మ్యూచువల్ ఫండ్ల జాబితాను ప్రకటించాయి. పరాగ్ పరీఖ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ లార్జ్‌క్యాప్ కేటగిరీలో టాప్‌లోఉంది. విదేశీ, దేశీయ ఈక్విటీల్లో సమతుల్య పెట్టుబడులతో స్థిరమైన రాబడులను అందిస్తోంది. కెనరా రోబెకో బ్లూచిప్ ఈక్వీటీ ఫండ్ లార్జ్ క్యాప్ విభాగంలో తక్కువ రిస్క్‌తో స్థిరత్వం అందించే ఫండ్, ఐసిఐసిఐ ప్రూడెన్షియల్ బ్లూచిప్ ఫండ్ పెద్ద తరహా కంపెనీల్లో పెట్టుబడి పెట్టడానికి నమ్మకమైన లార్జ్ క్యాప్ ఫండ్. మిరాయ్ అసెట్ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ పెరుగుతున్న మిడ్ క్యాప్ కంపెనీలు, స్థిరమైన లార్జ్ క్యాప్ కాంబినేషన్‌తో మంచి గ్రోత్ పొటెన్షియల్ ఉన్న ఫండ్ ఇదే. హెచ్‌డీఎఫ్‌సీ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఫండ్ మేనేజర్ అసెట్ కేటాయింపులు మార్చే సామర్థం ఉన్న ఫండ్ కోటక్ ఎమర్జింగ్ ఈక్విటీ ఫండ్ మిడ్ క్యాప్ విభాగంలో అత్యంత స్థిరమైన పనితీరును కనబరుస్తోంది. నిప్పాన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ స్మాల్ క్యాప్ విభాగంలో పెద్ద పరిమాణంలో నిధులను సేకరించి మంచి రాబడులను అందించిన ఫండ్. ఎస్‌బీఐ స్మాల్‌క్యాప్ ఫండ్ దీర్ఘకాలికంగా పెట్టుబడిపెట్టే అగ్రెసివ్ ధోరణి ఉన్న ఇన్వెస్టర్లకు ఈఫండ్ అనుకూలం. హెచ్‌డఎఫ్‌సీ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ ఈక్విటీ, డెట్ అసెట్లలో డైనమిక్ కేటాయింపులు జరుపుతూ మార్కెట్ నష్టాల నుంచి రక్షణ కల్పిస్తుంది. యూటీఐ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్ తక్కువ ఖర్చుతో నిఫ్టీ 50 సూచీలో ఇన్వెస్ట్ చేసే ఇండెక్స్ ఫండ్.




### తొమ్మిది కంపెనీల ఐపిఒలు..

# రూ.7681 కోట్లు సమీకరణ

**ముంబయి, ఆగస్టు 9:** స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు పండగే. భారతీయ ప్రాథమిక మార్కెట్ ఈవారం పబ్లిక్ ఇష్యూలతో బిజీ అవుతోంది. ఇకామర్స్ ఎనేబుల్మెంట్ ప్లాట్ ఫామ్ షిప్‌రాకెట్, డెయిరీ బ్రాండ్ మిల్కీ మిస్ట్ వంటి దిగ్గ కంపెనీలతో సహా మొత్తం 9 కంపెనీలు ఐపీఓకు వస్తున్నాయి. ఈ కంపెనీలు అన్నీ కలిసి రూ.7,681 కోట్లు సమీకరించేందుకు మార్కెట్లోకి వస్తున్నాయి. మోల్బియో డయోగ్నస్టిక్, ధూత్ ట్రాన్స్‌మిషన్, మిల్కీ మిస్ట్ డైరీ ఫుడ్, ఫాస్కినేట్ టెక్స్‌టైల్స్, షిప్‌రాకెట్, బెహారీ లాల్ ఇంజినీరింగ్, ప్రమోదిని మెడికేర్, క్యూ అండ్ టీ ఫుడ్స్, షామ్ ఫామ్ వంటివి ఉన్నాయి. ఈ కంపెనీల పబ్లిక్ ఇష్యూలు ఈనెల 10 నుంచి 12వ తేదీల మధ్య సబ్‌స్క్రిప్షన్ ప్రారంభిస్తున్నాయి. ఆగస్టు 14 వరకు సబ్‌స్క్రిప్షన్ కొనసాగనుంది. వీటితో పాటు ఈ వారం ఏకంగా 8 కంపెనీలు మార్కెట్ల లిస్టింగ్ కానున్నాయి. ఈ వారం వస్తున్న పబ్లిక్ ఇష్యూల్లో ధూత్ ట్రాన్స్‌మిషన్ అతిపెద్ద ఐపీఓగా నిలిచింది. ఈ పబ్లిక్ ఇష్యూ 10వ తేదీన మొదలై 12వ తేదీతో ముగుస్తుంది. ఈ మెయిన్‌బోర్డ్ ఐపీఓ షేరు ధరలు రూ.829-871గా నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద రూ.3066.89 కోట్లు సమీకరించనుంది. మిల్కీ మిస్ట్ డైరీ ఫుడ్ ఐపీఓ మిల్కీ మిస్ట్ డైరీ ఫుడ్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 11వ తేదీన మొదలై 13వ తేదీతో ముగుస్తుంది. రూ.1553 కోట్లు సమీకరించే లక్ష్యంతో మెయిన్‌బోర్డు విభాగంలో వస్తోంది. షేర్ల ప్రైస్ బ్యాండ్ రూ.133-140 గా నిర్ణయించారు. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ. 1428 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.125 కోట్లు సమీకరించనుంది. ఈ ఐపీఓ జీఎంపీ 19 శాతంగా ఉంది. షిప్ రాకెట్ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ ధరలు రూ.92-97గా నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద రూ.1617.48 కోట్లు సమీకరించనుంది. ఇందులో ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.885.50 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.731.98 కోట్లుగా సమీకరించనున్నారు. మొల్బియో డయాగ్నోస్టిక్స్ లిమిటెడ్ ఐపీఓ మెయిన్‌బోర్డు విభాగం నుంచి వస్తోంది. రూ.939.70 కోట్లు సమీకరించనుంది. షేరు ధరలు రూ.768807 గా నిర్ణయించారు. బెహారీ లాల్ ఇంజినీరింగ్ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 12న ప్రారంభమయి రూ.301.62 కోట్లు సమీకరించనుంది. షేరు ధరలు రూ.271-285 గా నిర్ణయించారు. ఇక ఎస్ఎంఈ విభాగం నుంచి ప్రమోదిని మెడికేర్ రూ.69.04 కోట్లు సమీకరించనుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14